అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 19-2-2024

సమగ్ర తెలుగు దినపత్రిక



మనోళ్లు బంగారం

- మహిళా బ్యాడ్మింటన్ జట్టుకు పసిడి పతకం • ఆసియా టీమ్ చాంపియన్‌షిప్స్

వివరాలు ఆటలులో..

సంపుటి : 10 | సంచిక : 50 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు వాళ్లకేనా..?

ఇతర కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారి సంగతేంటి అంటూ ప్రశ్న

- కేంద్రానికి మధ్యప్రదేశ్ హైకోర్టు నోటీసులు



భోపాల్: ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లపై మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆర్థికంగా వెనుకబడిన జనరల్ కేటగిరీ కులాల వారికి మాత్రమే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు వర్తిస్తాయా..? అని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇతర కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు వర్తించడం లేదని 'అడ్వకేట్స్ యూనియన్ ఫర్ డెమోక్రసీ అండ్ సోషల్ జస్టిస్' సంస్థ మధ్యప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ వేసింది. ఆ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు కేవలం జనరల్ కేటగిరీ అభ్యర్థులకే వర్తిస్తాయా..? లేదంటే ఇతర కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి కూడా వర్తిస్తాయా..? అనే విషయంలో స్పష్టత ఇవ్వాలంటూ చీఫ్ జస్టిస్ రవి విజయ మలిమత్, జస్టిస్ విశాల్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. ఆరు వారాల్లో స్పందనను తెలియజేయాలని ఆదేశించింది. కాగా, ఇతర కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు వర్తించడం లేదని, పేదలపై కులం పేరుతో ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని, ఈ రిజర్వేషన్‌లను రాజ్యాంగ విరుద్ధంగా భావించి కొట్టి వేయాలని పిటిషనర్‌లు కోర్టును కోరారు.

ఔటర్ సమీపంలో పారిశ్రామిక సిటీ

25వేల ఎకరాల్లో నిర్మాణం : సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో 25 వేల ఎకరాల్లో కాలుష్య రహిత పారిశ్రామిక సిటీని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి తెలిపారు. దీనిలో హెల్త్, స్పోర్ట్స్‌కు సంబంధించిన పరిశ్రమలు ఉంటాయన్నారు. నానక్‌రామ్‌గూడలో తెలంగాణ స్టేట్ ఫైర్ సర్వీసెస్ హెడ్ క్వార్టర్స్ బిల్డింగ్‌ను ఆదివారంనాడాయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో శాంతి భద్రతలు సక్రమంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయన్నారు. పెట్టుబడులకు హైదరాబాద్ నగరం అనువైన ప్రాంతమనీ, ఇక్కడ రాజకీయాలు ఎలా ఉన్నా నగరాభివృద్ధి కొనసాగిందని చెప్పారు. ఇక్కడ గత ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలను కొనసాగిస్తూనే, మరింత ఉన్నతంగా నగరాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి త్వరలో మెగా మాస్టర్ ప్లాన్-2050 తీసుకొస్తామనీ, అర్బన్, సెమీ అర్బన్, రూరల్ పేరుతో మూడు భాగాలుగా విభజించి, ఎక్కడికక్కడ స్థానిక పరిశ్రమల్ని నెలకొల్పి అభివృద్ధిని సాధిస్తామని ...13లో

నాణ్యమైన విద్య అందట్లే!

నిరుద్యోగానికి అదీ ఓ కారణమే : ఏఎస్ఈఆర్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ : దేశంలో నాణ్యమైన విద్య లభించడం లేదని యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ (ఏఎస్ఈఆర్) ఆందోళన వ్యక్తం చేసింది. గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులు ఎంత మంది విద్యను అభ్యసిస్తున్నారు, వారి విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయి అనే విషయాలపై ఏఎస్ఈఆర్ 2005లో అధ్యయనం ప్రారంభించింది. ఇప్పటి వరకూ మూడు నివేదికలు వెలువడ్డాయి. తాజాగా గత సంవత్సరం విడుదలైన నివేదిక పాఠశాల విద్యపై పెదవి విరిచింది. 14-18 సంవత్సరాల మధ్య వయసున్న విద్యార్థుల్లో విద్యకు సంబంధించిన పునాది ఇప్పటికీ బలహీనంగానే ఉన్నదని తేల్చింది. ఉద్యోగాలలో చేరే సమయంలో కూడా వీరికి ప్రాథమిక అవగాహన కొరవడిందని తెలిపింది.

తాజా నివేదిక ప్రకారం...14-18 సంవత్సరాల మధ్య వయసున్న వారిలో కేవలం 73.6% మంది మాత్రమే స్టాండర్డ్-2 స్థాయి పుస్తకాన్ని చదవగలుగుతున్నారు. గణితంలో కేవలం 45% మందికే ప్రాథమిక నైపుణ్యం ఉంది. మిగిలిన వారి పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నదని నివేదిక వివరించింది. బలమైన పునాది లేకపోవడంతో యువత సరైన ఉద్యోగాలు పొందలేకపోతున్నారు. మానవాభివృద్ధిలో విద్యకు ఉన్న ప్రాధాన్యత గురించి చెప్పాల్సిన అవసరం లేదు. ప్రజలు తమ సామాజిక, ఆర్థిక హోదాను మెరుగుపరచుకోవాలంటే తప్పనిసరిగా విద్యావంతులై ఉండాలి. పేదరికాన్ని నిర్మూలించడంలో విద్య సహాయకారిగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు విద్యకు తగినంత ప్రాధాన్యత ఇవ్వాలి. అయితే క్షేత్ర స్థాయిలో అలా జరగడం లేదు. 2022లో విడుదలైన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం నిరక్షరాస్యుల్లో, ప్రాథమిక స్థాయి వరకూ చదువుకున్న వారిలో ...3లో


ఉద్యోగాల కల్పనలో స్తబ్దత

- చేతులెత్తేసిన మోడీ ప్రభుత్వం
- తైవాన్, ఇజ్రాయిల్‌తో ఒప్పందాలు
- కార్మికులను తరలించేందుకు ప్రయత్నాలు : లక్నో ఐఐఎం వెల్లడి

వివరాలు 3లో

జార్ఖండ్‌లోనూ కులగణన

- సీఎం చంపయి సోరేన్ గ్రీన్‌సిగ్నల్



రాంచీ : బీహార్ తరహాలో జార్ఖండ్‌లో కూడా కులగణన నిర్వహించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంపయి సోరేన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. సర్వేకు సంబంధించి ముసాయిదాను రూపొందించాలని, దానిని ఆమోదం నిమిత్తం క్యాబినెట్ ముందు ఉంచాలని ఆయన ఆదివారం నాడు సిబ్బంది శాఖను ఆదేశించారు. అంతా ఓ ప్రణాళిక ప్రకారమే జరుగుతుందని, లోక్‌సభ ఎన్నికల తర్వాత కులగణన ప్రారంభమవుతుందని ...13లో



చర్చలు విఫలం

రైతు నేతలు, కేంద్రమంత్రుల మధ్య పురోగతి లేని చర్చలు

- పెరుగుతున్న మహిళా రైతుల సంఖ్య

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కనీస మద్దతు ధర చట్టం, రుణమాఫీ తదితర రైతుల డిమాండ్లపై రైతు నేతలు, కేంద్ర మంత్రుల మధ్య చర్చలు విఫలం అయ్యాయి. దీంతో ఉద్యమం కొనసాగుతోందని రైతులు ప్రకటించారు. హర్యానా సరిహద్దులో జరుగుతున్న రైతుల ...2లో

21న నల్లజెండాలతో నిరసన

- బీజేపీ, ఎన్డీఏ ఎంపీల ఇండ్ల ముందు ఆందోళన : సంయుక్త కిసాన్ మోర్చా

13లో..

ఇకపై వడ్డీ లేని డ్వాక్రా రుణాలు

సీఐటీయూ వినతిపై స్పందించిన భట్టి

- స్కీం వర్కర్లకు ప్రతినెలా జీతాలు చెల్లిస్తామని హామీ : మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం ఐటీడీఏ పాలకమండలి సమావేశానికి విచ్చేసిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి సీఐటీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇచ్చిన వినతి పత్రం పట్ల స్పందించారు. సీఐటీయూ ...13లో



గిరిజనంలో వెలుగులు నింపుతాం

13లో..

సుప్రీంకోర్టు ఆదేశాలు పాటిస్తాం

- ఎన్నికల బాండ్లపై సీఈసీ



న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటిస్తామని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిన తర్వాత ఎన్నికల సంఘం ...13లో



బంద్, సమ్మెలో 20 కోట్ల మంది

- ఎస్‌కేఎం, కేంద్రకార్మికసంఘాల వెల్లడి

వివరాలు 13లో

ప్రమాదంలో రిజర్వేషన్లు

- దళిత వర్గాలకు అన్యాయం :డీవైఎఫ్ఐ యువ దళిత సదస్సులో యూజీసీ మాజీ చైర్మెన్ సుఖదేవ్ థోరాట్



వివరాలు 6లో

రైతులపై దమనకాండ సరికాదు

కేంద్రానికి లొంగిపోయిన జాతీయ మీడియా

- ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాసిన వారికి వేధింపులు
- రాజ్యాంగం అమలుకు పెరుగుతున్న సవాళ్లు : నార్ల వెంకటేశ్వరరావు పురస్కార ప్రదాన సభలో పాలగుమ్మి సాయినాథ్



గుంటూరు : కనీస మద్దతు ధర చట్టం కోసం రైతులు చేస్తోన్న ఆందోళనలపై ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం పాశవికమైన దమనకాండకు పాల్పడుతోందని ప్రముఖ జర్నలిస్టు, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత పాలగుమ్మి సాయినాథ్ అన్నారు. గుంటూరులోని కొరటాల భవన్‌లో అంబేద్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ జర్నలిస్టు నార్ల వెంకటేశ్వరరావు పురస్కారాన్ని ఆదివారం రాత్రి పాలగుమ్మి సాయినాథ్‌కు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఫౌండేషన్ అధ్యక్షులు బి.విల్సన్ అధ్యక్షత వహించారు. సాయినాథ్ మాట్లాడుతూ హర్యానా, పంజాబ్ ప్రభుత్వాలతోపాటు కేంద్ర ప్రభుత్వం రైతుల పట్ల వ్యవహరిస్తోన్న తీరు సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం డ్రోన్ల ద్వారా మూకుమ్మడిగా భాష్పవాయువు గోళాలు ప్రయోగిస్తుంటే రైతుల పిల్లలు వీటిని తెలివిగా గాలిపటాల ద్వారా అడ్డుకున్నారని వివరించారు. ఢిల్లీ సరిహద్దులో జరుగుతున్న రైతుల ఉద్యమంపై జాతీయ మీడియా ఫోకస్ చేయడం లేదని, ఒక్క పత్రికలో కూడా కనీసం ప్రభుత్వ తీరును ఎండగడుతూ ఒక్క ఎడిటోరియల్ కూడా రాలేదని అన్నారు. రైతులపై కేంద్ర బలగాలు కనీవినీ ఎరుగని రీతిలో దాడులకు పాల్పడుతున్నాయని ధ్వజమెత్తారు. అన్నదాతలపై ప్రభుత్వం డ్రోన్లు, వైమానిక దాడులు చేయడం అత్యంత పాశవికమని తెలిపారు. ఇతర దేశాల టెర్రరిస్టులపై ప్రయోగించాల్సిన డ్రోన్లు, వైమానిక దాడులు మన దేశ రైతులపై ప్రయోగించడం శోచనీయమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి జాతీయ మీడియా, కార్పొరేట్ మీడియా దాసోహం అనడం వల్ల ప్రజా సమస్యలు వెలుగులోకి రావడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుత కేంద్ర పాలకులు సమాజాన్ని మత, కుల పరంగా విభజిస్తున్నారని విమర్శించారు. దేశంలోని ...6లో

కేసీఆర్ ఇలాకాపై నజర్

మెదక్ ఎంపీ సీటు గెలుపు కోసం కాంగ్రెస్ కసరత్తు

- సిద్దిపేటలో మకాం వేసిన మైనంపల్లి హనుమంతరావు
- బలమైన అభ్యర్థిని బరిలోకి దించే వ్యూహం
- కాంగ్రెస్ వైపు నీలం మధు, ఇతర నాయకులు
- మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నియోజక వర్గాలపై స్పెషల్ ఫోకస్



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కేసీఆర్ ఇలాకాపై హస్తం నేతల కన్ను పడింది. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్ఎస్‌ను ఢీ కొట్టి గెలిచి తీరాలనే పట్టుదలతో మెదక్ నియోజకవర్గంపై దృష్టి సారించారు. మరో పక్క తన ఇలాకాలో మరొకరికి చోటివ్వకుండా తమ పట్టు నిలుపుకోవాలన్న పట్టుదలతో గులాబీ బాస్ కేసీఆర్, ట్రబుల్ షూటర్ హరీశ్‌రావు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు మాత్రం ఎలాగైనా బీఆర్ఎస్ కంచుకోటను బద్దలు కొట్టాలనే లక్ష్యంతో చాపకింద నీరులా పార్టీని విస్తరింప చేస్తున్నారు. ఆరుగురు ఎమ్మెల్యేలు గెలిచి రెండు లక్షల ఓట్ల మెజార్టీ ఉన్నప్పటికీ బలమైన అభ్యర్థి పోటీలో లేకపోతే ఫలితం అటు ఇటు అవ్వొచ్చనే లెక్కలేస్తున్న గులాబీ బాస్.. గెలుపు గుర్రాల కోసం అన్వేషిస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున మెదక్ ఎంపీ సీటు గెలిచి తీరాలనే పట్టుదలతో బలమైన అభ్యర్థిని బరిలో దించాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇలా ఇరు పార్టీలు వ్యూహ ప్రతి వ్యూహాలతో ఎవరు పై చేయి సాధిస్తారో చూడాలి. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం చుట్టూ ...13లో

ఏనుగు దాడిలో ఇద్దరు మహిళల మృతి





చెన్నై : అడవి ఏనుగు దాడి చేయడంతో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. తమిళనాడు కృష్ణగిరి జిల్లా డెంకనికొట్టై అటవీ ప్రాంతంలో ఆదివారం ఈ ఘటనలు జరిగాయి. అన్నియాలం గ్రామానికి చెందిన వ్యవసాయ కార్మికురాలు వసంతమ్మ (37) పొలంలో పనికి వెళ్లగా, ఏనుగు ఆమెను తొండంతో దూరంగా విసిరివేసింది. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. డెంకనికొట్టై రేంజ్ ఫారెస్ట్ అధికారులు, పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇదే ఏనుగు సమీపంలోని దాసరపల్లి గ్రామానికి వెళ్లి అక్కడి మహిళ అశ్వతమ్మను తొక్కి చంపేసింది. ఈ ఘటనలపై మృతుల బంధువులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. రెండు రోజుల క్రితమే సమాచారం ఇచ్చినా అధికారులు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఏనుగును తరిమివేయాలని, మృతుల కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా షర్మిల కుమారుడి వివాహం



హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపిపిసిసి) అధ్యక్షులు వైఎస్ షర్మిల కుమారుడు రాజారెడ్డి వివాహవేడుక రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ ప్యాలెస్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు ఘనంగా జరిగింది. 16న సంగీత్, 17న హల్దీ, 18న తలంబ్రాలు, విందు వైభవంగా నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను షర్మిల సామాజిక మాధ్యమాల్లో ఆదివారం పోస్టు చేశారు. పెళ్లిలో భాగంగా నిర్వహించిన 'హల్దీ' వేడుక ఫొటోలను శనివారం పోస్టు చేసిన ఆమె ఆదివారం తలంబ్రాలు, ఉంగరాలు మార్చుకునే ఫొటోలను షేర్ చేశారు.

భావోద్వేగంతో తన స్పందన తెలియజేశారు. ఒక తల్లిగా తన జీవితంలో మరో సంతోషకరమైన క్షణాన్ని చేరుకున్నట్లు ఆమె తెలిపారు. 'ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన క్షణం రానే వచ్చింది, ఆత్మీయుల శుభాకాంక్షలు, ఆశీర్వాదం, దేవుడి కరుణ. నా కుమారుడి తన జీవితపు ప్రేమ (ప్రియా)తో వివాహం చేసుకున్నందున కొన్ని అద్భుతమైన జ్ఞాపకాలు కలకాలం గుర్తుండిపోతాయి' అని షర్మిల పేర్కొన్నారు. ఈ ఫొటోల్లో నూతన దంపతులు రాజారెడ్డి-ప్రియాతో పాటు వైఎస్ విజయమ్మ, షర్మిల-అనిల్ దంపతులు, కూతురు అంజలి, వధువు అట్లూరి ప్రియా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఉన్నారు. కాగా ఈ వేడుకకు షర్మిల సోదరుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

చర్చలు విఫలం

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యమం ఆరో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆదివారం చండీగఢ్ లోని మహాత్మా గాంధీ స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎంజిఎస్ఐపిఎ) రైతు నాయకులతో కేంద్ర మంత్రులు నాలుగో విడత చర్చలు జరిగాయి. చర్చల్లో రైతు నేతలు కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం) సమన్వయకర్త సర్వన్ సింగ్ పంధేర్, బికెయు ఏక్తా (సింధుపూర్) అధ్యక్షుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ హాజరయ్యారు. కేంద్ర వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ పాల్గొన్నారు. అలాగే పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మన్ కూడా చర్చల్లో పాల్గొన్నారు. అంతకుముందు కేంద్ర మంత్రులు, పంజాబ్ సీఎం హోటల్ లో భేటీ అయి, రైతు ఆందోళనపై చర్చించారు. సమావేశానికి ముందు, పంధర్ మాట్లాడుతూ, తమకు ఆశ ఉందని, బంతి ఇప్పుడు కేంద్రం కోర్టులో ఉందని అన్నారు.

పెరుగుతున్న మహిళా రైతుల సంఖ్య

రైతు ఉద్యమం పెరుగుతున్న కొద్దీ మహిళా రైతుల సంఖ్య మరింత పెరుగుతోంది. మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొంటూభోజన ఏర్పాట్లలో సహకరిస్తున్నారు. రైతు కుటుంబాలకు చెందిన మహిళలు తమ పిల్లలతో కలిసి నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వాస్తవానికి, పంజాబ్ నుండి రైతులు అధికంగా ఉద్యమంలో పాల్గొంటున్నారు. అమృత్‌సర్, లూథియానా, ఫిరోజ్‌పూర్ ప్రాంతాల రైతులు ఎక్కువగా వచ్చారు. గత 5 రోజులుగా రైతులందరూ కుటుంబానికి దూరంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఆదివారం వారిని కలవడానికి వచ్చారు.

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి

- డాక్టర్ జి.నిర్మల డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ జి నిర్మల డిమాండ్ చేశారు. పాత పెన్షన్ అమలు చేయాలనీ, 317 జీవో రద్దు చేయాలనీ, 20 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ కాన్ఫడరేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరై ఆయా రాష్ట్రాల్లో ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులపై చర్చించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ -2024 డైరీని ఆవిష్కరించారు. నూతనంగా ఎన్నుకున్న కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆరేండ్ల పాటు అసోసియేషన్ అధ్యక్షునిగా సేవలందించిన సంపత్ కుమార్ స్వామితో పాటు పూర్వ కోశాధికారి గడ్డం బాలస్వామిని ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. సంపత్ కుమార్ స్వామి సీపీఎస్, 317 జీవో సమస్యలపై పోరాడాలని సూచించారు. మరియు నూతనంగా ఎన్నికైన సంఘం కార్యవర్గాన్ని అభినందించి, సత్కరించారు. సమావేశంలో స్టేట్ సెక్రటరీ జనరల్ సెక్రెటరీ యాకుబ్ పాషా, జాజుల రంజిత్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఫోటో జర్నలిస్ట్ కృష్ణ పై దాడికి ఖండన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫోటో జర్నలిస్ట్ కృష్ణ పై దాడి చేయడం పట్ల తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు అనుమల్ల గంగాధర్, కే.ఎస్.హరి ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతపురం సిద్ధం బహిరంగ సభలో ఫోటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ కృష్ణపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల దాడి చేశారని తెలిపారు. ఫోటోగ్రాఫర్‌పై దాడి చేయడం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. ఫొటో జర్నలిస్టులు తమ వృత్తి ధర్మంలో భాగంగా రాజకీయ బహిరంగ సభల్లో పాల్గొంటుంటారని గుర్తుచేశారు. దానిని రాజకీయ కోణంలో చూడడం సరికాదని వారు హితవు పలికారు.



జైసల్మేర్: పోఖ్రాన్ రేంజ్ వద్ద వాయు శక్తి 2024 సందర్భంగా అగ్ని శక్తి ప్రదర్శన.

మోడీ అభివృద్ధి నమూనా విఫలం

- కేరళ తరహా ప్రజా ప్రణాళికే ప్రత్యామ్నాయం : శ్రీకాకుళం సమగ్రాభివృద్ధి సదస్సులో వి శ్రీనివాసరావు



శ్రీకాకుళం: వికసిత్ భారత్, మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ వంటి పేర్లతో మోడీ తీసుకొచ్చిన అభివృద్ధి నమూనా దేశంలో విఫలమైందని సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఎవిఎస్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన శ్రీకాకుళం జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సులో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టి పదేళ్లు కావస్తున్నా, కనీసం ఎలక్ట్రానిక్ చిప్‌ను సొంతంగా తయారు చేసుకోలేని పరిస్థితి ఉందన్నారు. గుజరాత్ నమూనా అంటూ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆ రాష్ట్రం నుంచి వలసలు పోతున్న ఎనిమిది వేల మంది కార్మికులు పోలీసులకు పట్టుబడడం మోడీ అభివృద్ధి నమూనాకు అద్దం పడుతోందని ఎద్దేవా చేశారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానన్న మోడీ.. అప్పులు, ఆత్మహత్యలను రెట్టింపు చేశారని విమర్శించారు. మోడీ అభివృద్ధి నమూనా విఫలం కావడంతో 2024 ఎన్నికల్లో లబ్ది కోసం అయోధ్య రాముని నామం జపం చేస్తున్నారని దుయ్యబట్టారు. దేశంలో మానవాభివృద్ధి సూచీలో కేరళ ప్రథమ స్థానంలో ఉందని, కేరళలో వామపక్ష ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజా ప్రణాళికే అభివృద్ధికి సరైన ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. ఎలక్టోరల్ బాండ్లు స్వీకరించడం ఒక పెద్ద కుంభకోణమని, మోడీ అందులో మునిగిపోయారని తెలిపారు. ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేస్తేనే ప్రజాస్వామ్యం బతికిబట్టకట్టదని చెప్పారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా బీజేపీ రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి కుదరకపోతే మూసేయడానికి సిద్ధపడుతోందని తెలిపారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తోన్న బీజేపీని వైసీపీ, టీడీపీ పార్టీలు పల్లెత్తు మాట అనకపోవడం దారుణమన్నారు. హైదరాబాద్‌లోని ఆస్తులన్నీ తెలంగాణకు అప్పగించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఇప్పుడు హైదరాబాద్ రాజధాని కావాలంటున్నారని విమర్శించారు.

రాష్ట్రంలో ఎన్నికలు వస్తుండడంతో ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టడానికి హైదరాబాద్ రాజధాని అంశాన్ని తెర పైకి తెచ్చారన్నారు. ప్రభుత్వ విద్యా రంగం బలోపేతం, నిష్ణాతులైన ఉపాధ్యాయులను తయారు చేయాల్సిన ముఖ్యమంత్రి బైజూస్, ఎడెక్స్ వంటి ప్రయివేట్ కంపెనీలకు చీఫ్ మార్కెటింగ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

కేవలం నగదు బదిలీ పథకాలతోనే అభివృద్ధి జరగదని, ప్రజల ఆదాయాలు పెరగవని చెప్పారు. నగదు బదిలీతో జనం తొలుత కొంత ఆదరించినా, కరెంట్ ఛార్జీల పెంపు, ప్రజలపై పలు రకాల పన్నుల భారం మోపడంతో 2024 నాటికి జగన్‌మోహన్‌రెడ్డి ఫెయిల్యూర్ సీఎంగా నిలిచారని వివరించారు. అనంతరం 'విద్య-వైద్యం' అనే అంశంపై పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ ముఖ్య వక్తగా మాట్లాడారు. 'పారిశ్రామికీకరణ-ఉపాధి అవకాశాలు'పై జివిఎంసి కార్పొరేటర్ బి.గంగారావు, 'వ్యవసాయం, నీటి ప్రాజెక్టులు'పై నీటిపారుదల విశ్రాంత చీఫ్ ఇంజనీర్ ఉప్పలపాటి నారాయణరాజు ప్రసంగించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ఎన్నికలయ్యాక టీడీపీ రూపురేఖలు ఉండవ్!

- అందుకే ఆ పార్టీని గెలిపించేందుకు పెత్తందారులంతా ఏకమవుతున్నారు
- జాతీయ పార్టీలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా టీడీపీ పొత్తులు
- 99 శాతం హామీలను నెరవేర్చాం
- వైసీపీకి ప్రజలే స్టార్ క్యాంపెయినర్లు : రాప్తాడు 'సిద్ధం' సభలో సీఎం జగన్



అనంతపురం : 'చంద్రబాబు వయసు ఈ ఎన్నికల తరువాత 80 ఏండ్లకు చేరుకుంటుంది. ఆ పార్టీ ఓడిపోతే రాష్ట్రంలో టీడీపీ రూపురేఖలు ఉండవు. అందుకే పెత్తందారులంతా ఏకమై టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ఎన్నికలు అత్యంత కీలకం' అని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో మొత్తం 175 అసెంబ్లీ స్థానాల్లోనూ, 25 పార్లమెంటు స్థానాల్లోనూ గెలవడం వైసిపి టార్గెటని, ఇందుకు కార్యకర్తలంతా కృషి చేయాలని కోరారు. అనంతపురం జిల్లా రాప్తాడులో రాయలసీమ స్థాయి సిద్ధం' సభ ఆదివారం జరిగింది. ఈ సభలో జగన్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రంగురంగుల మ్యానిఫెస్టోలు విడుదల చేయడం, తరువాత వాటిని అమలు చేయకుండా మయం చేయడం టీడీపీకి పరిపాటిగా మారిందని విమర్శించారు. 2014 ఎన్నికల సమయంలో 600 హామీలు ఇచ్చి వాటిలో పది శాతం కూడా అమలు చేయలేదన్నారు. గత ఎన్నికల ముందు వైసీపీ ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశామని వివరించారు. అందుకే ప్రజల్లోకి కాలరెగరేసి వెళ్లి వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు ఓటు అడిగే ధైర్యముందని అన్నారు. చంద్రబాబుని ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని, అందుకే దత్తపుత్రుడితోపాటు జాతీయ పార్టీలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా పొత్తులు పెట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నాడని విమర్శించారు. జగన్ ఒక్కడినీ ఎదుర్కొనేందుకు ఈ తోడేళ్లన్నీ ఏకమై రాబోయే ఎన్నికల్లో ప్రజల ముందుకు రానున్నాయన్నారు. ప్రజలు తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. టీడీపీని గెలిపిస్తే రాజకీయాలకు అతీతంగా ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలన్నింటికీ కోతపెట్టే అవకాశముందని హెచ్చరించారు. చంద్రబాబు హయాంలో రైతులకుగాని, మహిళలకుగాని ఏ మాత్రమూ మేలు జరగలేదని విమర్శించారు. ఒక్క వైఎస్.జగన్ హయాంలోనే సంక్షేమ పథకాలను ఎవరి ప్రమేయం లేకుండా నేరుగా అందుతున్నాయని వివరించారు. వైసీపీకి ప్రజలే స్టార్ క్యాంపెయినర్లని అన్నారు. ఈ సభలో రాయలసీమ ప్రాంత మంత్రులు, వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీగా జనసమీకరణ

రాయలసీమ జిల్లాల పరిధిలోని 50 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున జనసమీకరణను వైసీపీ చేపట్టింది. లక్షలాది మంది వైసీపీ అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు తరలచ్చారు. అనంతపురం నగరానికి వచ్చే ప్రధాన రహదారులన్నీ వాహనాలతో ట్రాఫిక్ జామ్ అయ్యాయి.

బస్సుల్లేక ప్రయాణికుల ఇక్కట్లు

రాప్తాడు సభకు ఆర్టీసీ బస్సులతోపాటు, ప్రయివేటు, ప్రభుత్వ విద్యా సంస్థల బస్సులనూ పెద్ద ఎత్తున వినియోగించారు. రాయలసీమ వ్యాప్తంగా 1520 ఆర్టీసీ బస్సులను కేటాయించారు. వీటిలో అనంతపురం జిల్లాకు సంబంధించి 520 ఉన్నాయి. దీంతో, సాధారణ ప్రయాణికులు బస్సుల్లేక ఇక్కట్లు ఎదుర్కొన్నారు. మరోవైపు ప్రయివేటు విద్యా సంస్థల నుంచి కూడా ఒక్క అనంతపురం జిల్లాలోనే 700 బస్సులను వినియోగించారు. రాయలసీమ జిల్లాల పరిధిలో ఆరు వేల వరకు వాహనాలను ఎన్నికల ప్రచార సభ కోసం వినియోగించడంతో అన్నిచోట్లా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. జాతీయ రహదారి 44ని ఆనుకుని సభ జరగడంతో రెండు గంటలకుపైగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి

సిద్ధం సభలో ఫొటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణను వైసిపి నాయకులు, కార్యకర్తలు చుట్టుముట్టి దాడి చేసి రక్తం కారేలా కొట్టారు. వేసుకున్న చొక్కాను కూడా చింపేసి దాడి చేయడంతో ఒళ్లంతా వాతలుపడ్డాయి. ఆ పక్కనే ఉన్న ఈనాడు, ఇతర ఫొటోగ్రాఫర్లపైనా దాడికి ప్రయత్నించడంతో వారు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదంతా పోలీసుల సమక్షంలోనే జరిగినా నిలువరించే ప్రయత్నం చేయలేదు. తీవ్రంగా గాయపడిన కృష్ణను అనంతపురం సర్వజన ఆస్పత్రికి సహచరులు తరలించారు.

పోలీసులు, జర్నలిస్టులపై దాడి

బీహార్ నవ్‌గాచియాలో ఘటన

పాట్నా : పోలీసులు, జర్నలిస్టులపై గ్రామస్తులు దాడికి దిగారు. ఈ దాడిలో ఇద్దరు జర్నలిస్టులకు తీవ్రగాయాలైనట్టు అధికారులు తెలిపారు. బీహార్‌లోని నవ్‌గాచియా గ్రామంలో ఆదివారం ఈ ఘటన జరిగింది.


వివరాల ప్ర కారం.. శోభాదేవి అనే మహిళ ఫిబ్రవరి 16న పాలు అమ్మేందుకు వెళ్లిన శోభాదేవి అనే మహిళ అదృశ్యమైంది. ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆ మహిళ మతదేహాన్ని ఆదివారం గుర్తించారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ పోలీసులపై దాడి చేశారు.



పోలీస్ వాహనానికి నిప్పుపెట్టారు. వార్తను కవర్ చేసేందుకు వచ్చిన జర్నలిస్టులపై కూడా దాడి చేశారు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీస్ ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని, గ్రామస్తులో మాట్లాడారు. మహిళ మృతిపై దర్యాప్తు చేపట్టామని అన్నారు. అలాగే ఆ గ్రామంలో పరిస్థితిని నియంత్రించేందుకు పోలీసులను మోహరించారు.

బాబు, పవన్‌లకు బీజేపీ అధిష్టానం పిలుపు?

- 21న పొత్తులపై స్పష్టత వచ్చే అవకాశం



అమరావతి : రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి పొత్తుల అంశం కొలిక్కి రానున్నట్లు తెలిసింది. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడుకు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు మరోసారి బిజెపి అధిష్టానం నుండి పిలుపు వచ్చినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం రేపు (మంగళవారం) వారిద్దరిని అందుబాటులో ఉండాలని బిజెపి నేతలు కోరారు. అవసరమైతే ఆ రోజు ఢిల్లీకి రావాల్సిఉంటుందని బీజేపీ నాయకత్వం సూచించి నట్లు చెబుతున్నారు. దీంతో ఈ నెల 21న ఎన్‌డిఎ పొత్తులపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇప్పటికే ఈ దిశలో ప్రకటన వెలువడి ఉండాల్సిందని, బిజెపి జాతీయ కౌన్సిల్ సమావేశాల నేపథ్యంలో ఆలస్యమైందని అంటున్నా రు. బీజేపీతో పొత్తు ఖాయమని తేలడంతో సీట్ల సర్దుబాటు గురించి టీడీపీ, జనసేన నేతల్లో ఆసక్తి కర చర్చ జరుగుతోంది. వైసీపీ నుండి వచ్చే నేతలను చేర్చుకునే విషయమై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఏ పార్టీకి ఎన్ని సీట్లు ?

విశ్వసనీయ సమాచారం మేరకు బీజేపీ 10 ఎమ్మెల్యే ఆరు ఎంపి సీట్లు అడుగుతోంది. వీటిల్లో రాజమండ్రి, నరసాపురం, రాజంపేట ఎంపి సీట్లు ఇచ్చేందుకు టీడీపీ సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. మచిలీపట్నం, కాకినాడ, అనకాపల్లి, తిరుపతి పార్లమెంటు సీట్లను జనసేన అడుగుతుండగా, మచిలీపట్నం, కాకినాడ సీట్లు ఇచ్చేందుకు టీడీపీ నుంచి అంగీకారం ఉందని సమాచారం. తప్పని సరైతే అనకాపల్లి కూడా ఇచ్చే వీలుంది. ఎమ్మెల్యే సీట్ల విషయానికి జనసేన 28 నుంచి 33 స్థానాలు కోరుతున్నట్లు తెలిసింది.


సీనియర్లకు బుజ్జగింపులు

పొత్తుల్లో భాగంగా ఎవరి సీటు త్యాగం చేయాల్సి వస్తోందోననే భయం టిడిపి సీనియర్ నేతల్లో కనిపిస్తోంది. సీటింగ్ ఎమ్మెల్యేలకు ఖచ్చితంగా సీటు ఇవ్వాల్సిందేనని సీనియర్లు పట్టుపడుతున్నారు. ఇదే సందర్భంలో టీడీపీ సిట్టింగ్ స్థానాలను బీజేపీ, జనసేనకు కేటాయించాల్సి వస్తే సీనియర్ శాసనసభ్యుల రాజకీయ భవిష్యత్ ముగిసినట్లేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సిట్టింగు స్థానాలను త్యాగం చేసేందుకు టీడీపీ సీనియర్లు అంగీకరించడం లేదని తెలిసింది. వారికి నచ్చజెప్పే పనిలో టీడీపీ నాయకత్వం ఉంది.

బెంగళూరు శివార్లలో అగ్ని ప్రమాదం : ముగ్గురి మృతి

బెంగళూరు : కర్నాటక రాజధాని బెంగళూరు శివార్లలో ఒక పెర్‌ఫ్యూమ్ గిడ్డంగిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ముగ్గురు మరణించారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. కుంబలగోడు సమీపంలోని రామసముద్ర వద్ద ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న వెంటనే అక్కడకు చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. గిడ్డంగి నుంచి ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు. గాయపడిన వారిని విక్టోరియా ఆస్పతికి తరలించారు.

ఉద్యోగాల కల్పనలో స్తబ్దత



న్యూఢిల్లీ : దేశంలో ఉద్యోగాల వృద్ధి రేటులో స్తబ్దత నెలకొన్నదని లక్నో ఐఐఎం పరిశోధకులు తెలిపారు. బిట్స్ పిలానీ, కేంద్ర వ్యవసాయ-కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సహకారంతో లక్నో ఐఐఎం పరిశోధకులు ఓ నివేదికను రూపొందిం చారు. జాతీయ శాంపిల్ సర్వే కార్యాలయం, ఉద్యోగ-నిరుద్యోగ సర్వే, పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేల నుంచి తీసుకున్న సమాచారం ఆధారంగా నివేదికను తయారు చేశారు. 1987-88 నుంచి 2004-05 వరకూ ఉద్యోగాల కల్పనలో వృద్ధి కన్పించిందని, అయితే 2004-05 నుంచి 2018-19 మధ్య తిరోగమనం నమోదైందని నివేదిక తెలియజేసింది. ఆ తర్వాత కూడా పరిస్థితిలో పెద్దగా మార్పేమీ రాలేదని చెప్పింది. దీనిని బట్టి చూస్తే ఉద్యోగ కల్పనలో మోడీ ప్రభుత్వం చేతులెత్తేసిందని అర్థమవుతోంది.

నివేదిక ప్రకారం 2020-21లో దేశంలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 55.61 కోట్లు. వీరిలో అత్యధికంగా 54.9శాతం మంది స్వయం ఉపాధి పొందిన వారే. కేవలం 22.8శాతం మంది మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు. 22.3శాతం మంది క్యాజువల్ ఉద్యోగులు. ఉద్యోగ సంక్షోభం, ఉద్యోగ నాణ్యతపై 'ది వైర్' పోర్టల్ గత సంవత్సరం మే 2న ఓ కథనాన్ని అందించింది. దేశంలో ఉద్యోగ నాణ్యత చాలా తక్కువగా ఉన్నదని, అనేక ఉద్యోగాలలో తక్కువ వేతనాలు ఇస్తున్నారని సీఎంఐఈకి చెందిన మహేష్ వ్యాస్ చెప్పారు.

విదేశాలకు కార్మికులు

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళా ఉద్యోగినుల విషయంలో వివక్ష కొనసాగుతోందని ఐఐఎం నివేదిక ఎత్తిచూపింది. 1983 నుండి 2020-21 వరకూ పురుషులతో పోలిస్తే మహిళా ఉద్యోగుల శాతం లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ (ఎల్ఎఫ్‌పీఆర్) తగ్గింది. దేశంలో నైపుణ్యం లేని లేదా కొంతమేర నైపుణ్యం కలిగిన వారిని తైవాన్, ఇజ్రాయిల్ దేశాలకు పంపి అక్కడ వారికి ఉపాధి కల్పించడానికి మోడీ ప్రభుత్వం మధ్యవర్తిత్వం వహిస్తోంది. దేశంలో ఉత్పత్తికి సంబంధించిన పరిశ్రమల్లో వారికి ప్రభుత్వం ఉపాధి కల్పించలేకపోవడమే దీనికి కారణం. ఈ నెల 16న తైవాన్‌తో మోడీ సర్కారు ఎంఓయూ కుదుర్చుకుంది. దేశంలో నెలకొన్న ఉద్యోగ సంక్షోభం కారణంగానే కార్మికులను ఇజ్రాయిల్ పంపుతున్నారని బీబీసీ గత నెలలో తెలిపింది. గాజాపై ఇజ్రాయిల్ యుద్ధం చేయడానికి ముందే 42 వేల మంది నిర్మాణ కార్మికులు, నర్సులను పంపేందుకు మోడీ ప్రభుత్వం ఒప్పంద కుదుర్చుకుంది.

నివేదిక ఏం చెప్పింది ?

విద్యా స్థాయి పెరిగినప్పటికీ దానికి అనుగుణంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడడం లేదు. దేశంలో ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని నివేదిక స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం, పేదరిక నిర్మూలన కార్యక్రమాలు, ప్రజా పనులపై మరింతగా దృష్టి సారించాలని ప్రభుత్వానికి సూచించింది. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వేతనాలు 5% మేర పెరుగుతాయని, మహిళా కార్మికుల సంఖ్య కూడా పెరుగుతుందని, గ్రామీణ వేతన స్థాయిలు పెరుగుతాయని తెలిపింది.



నాణ్యమైన విద్య అందట్లే!

(మొదటి పేజీ తరువాయి)

నిరుద్యోగ రేటు వరుసగా 0.4శాతం, 1.0శాతంగా ఉంది. సెకండరీ స్థాయి, ఆ పైన విద్యను అభ్యసించిన వారిలో నిరుద్యోగ రేటు 8.6శాతంగా ఉంది. విద్యా వంతు లైన వారందరికీ ఉద్యోగాలు లభించడం లేదు. పట్టభద్రుల్లో 45శాతం మంది మాత్రమే ఉద్యోగాలు చేస్తున్నారని మెర్సర్ మెటిల్ సంస్థ రూపొందించిన నివేదిక తెలిపింది. భారత్‌లో విద్యనభ్యసించి పట్టభద్రులైన వారిలో నైపుణ్యం పరి మితంగా ఉండడమో లేదా పూర్తిగా లేకపోవడమో జరుగుతోందని గత సంవత్స రం ఏప్రిల్ లో విడుదలైన బ్లూమ్‌బర్గ్ నివేదిక నిగ్గుతేల్చింది. మరోవైపు దేశంలో ఆర్థిక వృద్ధి జరుగుతున్నప్పటికీ అది ఉద్యోగాలను సృష్టించడం లేదు. దీనికి కారణం విద్యావం తుల్లో నైపుణ్యం కొరవడడమే. ఇక్కడ గమనించాల్సిన మరో ముఖ్యమైన విషయమే మంటే ఉన్నత విద్యలో ఏదైనా ఒక నిర్దిష్టమైన సబ్జెక్టులో డిగ్రీ సంపా దించిన వ్యక్తికి ఆ చదువుతో సంబంధం ఉన్న ఉద్యోగం లభించడం లేదు. దేశ ఆర్థికాభివృద్ధికి విద్యా రంగం ఇతోధికంగా సాయపడుతోంది. దేశంలో విద్యా రంగం అంచనా విలువ 11,700 కోట్ల డాలర్లు. ఈ విలువ 2025 నాటికి 22,500 కోట్ల డాలర్లకు చేరుతుందని భావిస్తున్నారు. విద్యా రంగం ఇంతగా పురోభివృద్ధి చెందుతున్నప్పటికీ అనేక మంది యువతీ యువకులకు ఉద్యోగాలు లభించడం కష్టంగా ఉంది.

పిల్లర్ల కుంగుబాటును భూతద్దంలో చూపుతున్నారు

మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి విమర్శ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మేడిగడ్డలో కుంగిన మూడు పిల్లర్లను భూతద్దంలో చూపి, గత ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చాలని కాంగ్రెస్ భావిస్తున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. దీనిపై మాజీ మంత్రి హరీశ్‌రావు సమాధానాలకు బిత్తరపోయిన కాంగ్రెస్ పెద్దలు అసెంబ్లీలో ఆయన ప్రసంగానికి అడుగడుగునా ఆటంకాలు సృష్టించారని తెలిపారు. ఆదివారంనాడిక్కడి తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 72 రోజుల కాంగ్రెస్ పాలనలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప, కొత్తగా ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు సరిపడా కేటాయింపులు బడ్జెట్‌లో లేవనీ, దీనితో గ్యారంటీల అమలు సాధ్యం కాదని చెప్పకనే చెప్పేశారని ఆరోపించారు. తొమ్మిదేండ్ల తర్వాత రాష్ట్రంలో తిరిగి కరెంటు కోతలు మొదలయ్యాయనీ, రైతుబంధును మూడెకరాల రైతులకు మాత్రమే ఇచ్చారని చెప్పారు. రైతుభరోసా అమలు చేస్తారో లేదో స్పష్టత ఇవ్వాలన్నారు. కాళేశ్వరంపై అత్యున్నతస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ల సరఫరా విషయంలో స్పష్టత లేదనీ, వాటిని అమలుచేస్తారో లేదో చెప్పాలని కోరారు. ఆలేరు మెడికల్ కళాశాలను కొడంగల్‌కు తరలించడం పద్ధతికాదనీ, చేతనైతే కొత్త మెడికల్ కళాశాలను అక్కడ పెట్టుకోవాలని సూచించారు. వరి ధాన్యంపై క్వింటాలుకు రూ.500 బోనస్ కచ్చితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మెన్ ఆల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరంతర ఉద్యమాలతోనే కార్మిక, కర్షకులకు విముక్తి

వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

నవతెలంగాణ - అశ్వారావుపేట

నిరంతర ఉద్యమాలతోనే కార్మికులు, శ్రామికులు, కర్షకులకు వారి కష్టాల నుంచి విముక్తి కలుగుతుందని, అందుకోసం అమరజీవి కామ్రేడ్ వేదగిరి శ్రీనివాసరావు స్ఫూర్తితో వ్యవసాయ కార్మిక ఉద్యమాన్ని ఉధృతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ పిలుపునిచ్చారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యకాస కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కామ్రేడ్ వేదగిరి శ్రీనివాసరావు 4వ వర్ధంతి సభనూ నిర్వహించారు. ఆయా సభల్లో వెంకట్ మాట్లాడుతూ.. వేదగిరి శ్రీనివాసరావు నిరంతరం పేదల సంక్షేమం కోసం, వ్యవసాయ కార్మిక సంఘం నిర్మాణం కోసం కృషి చేశారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా మనమందరం నడుచుకోవడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు కూలి బంధు ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. దేశంలో బీజేపీ అతి ప్రమాదకరమైన కార్పొరేట్ ప్రభుత్వంగా రుజువయిందన్నారు. దేశ సంపదను కార్పొరేట్లతో కలిసి లూటీ చేస్తూ రైతులు, కార్మికులు, సామాన్య ప్రజలపై అనేక రకాల భారాలు మోపుతుందన్నారు. వీటన్నింటికీ వ్యతిరేకంగా వేదగిరి శ్రీనివాసరావు స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షులు మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ.. వేదగిరి ఆచరణ కమ్యూనిస్టుగా ఆదర్శ ప్రజాప్రతినిధిగా, సంఘం జిల్లా, రాష్ట్ర, జాతీయ కమిటీల్లో వివిధ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు.



ఆయన స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు ఉధృతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సంఘం అధ్యక్షులు మచ్చ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో.. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొక్కెరపాటి పుల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు, నిమ్మల వెంకన్న, ముదిగొండ రాంబాబు, సహాయ కార్యదర్శులు శెట్టి వినోద, గడ్డం స్వామి, జిల్లా కమిటీ సభ్యులు సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ ఫైనాన్స్ కమిషన్‌గా రాజయ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్‌గా సిరిసిల్ల రాజయ్య బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో గల ఆ సంస్థ కార్యాలయంలో బంధుమిత్రులు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజయ్య పదవీ బాధ్యతలను చేపట్టారు. ఆయనతో పాటు సభ్యులు సంకేపల్లి సుధీర్ రెడ్డి, రమేష్ ముదిరాజ్, నెహ్రూ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు గ్రామాలను, మున్సిపాల్టీలను బలోపేతం చేస్తామని తెలిపారు. గ్రామ పంచాయితీలను బలోపేతం చేసేందుకు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఫైనాన్స్ కమిషన్‌ను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం కమిషన్‌ను నిర్వీర్యం చేయడంతో నిధుల్లేక గ్రామాలు, మున్సిపాల్టీలు అల్లాడిపోతున్నాయని విమర్శించారు. మూలనపడేసిన ఫైనాన్స్ కమిషన్‌ను సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ధరించి, తనకు బాధ్యతలు అప్పగించారని ధన్యవాదాలు తెలిపారు.



ఎంఐఎంను కలుపుకొని వెళ్లండి

వక్ఫ్ బోర్డ్ చైర్మెన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, అభివృద్ధిపై ఎంఐఎం పార్టీని కలుపుకొని వెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఆదివారం సాయంత్రం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ నేతృత్వంలో కొత్తగా ఎన్నికైన వక్ఫ్ బోర్డు చైర్మెన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు సమీర్ వలీవుల్లా, వక్ఫ్ బోర్డు సభ్యులు సయ్యద్ అక్బర్ నిజాముద్దీన్ సబ్రీ, మాలిక్ మోతాసిం ఖాన్, సయ్యద్ అబుల్ ఫతే బందగీ, పాషా హుద్రీ, మౌలానా సయ్యద్ నిసార్ హెచ్ జడ్ నిసార్. జావీద్, అయేషా ఖాన్, వక్ఫ్ బోర్డ్ సీఈఓ సయ్యద్ ఖాజా మొయినుద్దీన్‌లు ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన నూతన బృందాన్ని అభినందించారు. వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన అంశాలను అధ్యయనం, పరిశీలన, విశ్లేషించేందుకు సమగ్ర సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. ఆ సమావేశంలో సమస్యలతో పాటు పరిష్కారాలను చూపాలని, దానికోసం రెవెన్యూ, ఆర్థిక శాఖలు, అడ్వకేట్ జనరల్ సలహాలు, సూచనలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఎంఐఎంతో ఘర్షణాత్మక ధోరణి వద్దని సూచించారు.

జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో మరోసారి పొగలు

- బ్రేక్స్ పట్టి వేయడంతో ఘటన
- భయపడాల్సింది ఏమీ లేదు : స్టేషన్ మాస్టర్ అభినవ్

నవతెలంగాణ - నల్లగొండ కలెక్టరేట్

విశాఖపట్టణం నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే జన్మభూమి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ బోగీల్లో ఆదివారం పొగలు రావడంతో రైలును నల్లగొండ జిల్లా తిప్పర్తి వద్ద నిలిపివేశారు. ఈ ఘటనతో ప్రయాణికులు భయాందోళనకు గురై బోగీల నుంచి దూరంగా వెళ్లిపోయారు. రైల్వే సిబ్బంది మరమ్మతులు చేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అయితే, నాలుగు రోజుల కిందట కూడా జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు వచ్చాయి. దాంతో రైలును మిర్యాలగూడ వద్ద 25 నిమిషాల పాటు నిలిపివేశారు. జన్మభూమిలో వరుసగా ఘటనలు చోటుచేసుకోవడంతో రైలును పూర్తిగా పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ ఘటనపై నల్లగొండ రైల్వే స్టేషన్ మాస్టర్ అభినవ్‌ను వివరణ కోరగా.. జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు తిప్పర్తి సమీపానికి రాగానే ఒక్కసారిగా బ్రేక్స్ పట్టి వేయడంతో పొగలు వచ్చాయని తెలిపారు. దాంతో వెంటనే రైలును నిలిపివేసి మరమ్మతులు చేసినట్టు చెప్పారు.

నాణ్యతమైన విద్య అందించాల్సి బాధ్యత.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే..

యాదాద్రి జిల్లా టీఎస్ యూటీఎఫ్ సభలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



నవతెలంగాణ-ఆత్మకూర్(ఎం)

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసి బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలోని ఎంఎస్ఆర్ గార్డెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎస్‌టీఎఫ్ఐ పతాకాన్ని సీనియర్ నాయకులు పోరాల యాదగిరి, దడిపెల్లి వెంకన్న కలిసి ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. విద్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో అధిక నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బడి లేకుంటే సామాజిక అంతరాలు పెరిగి సమాజ విచ్ఛిన్నానికి దారితీస్తాయన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులకు ఆటంకంగా ఉన్న కోర్టు కేసులను త్వరగా పరిష్కరించి ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేసేందుకు అంగన్వాడీలను పాఠశాలకు అనుసంధానం చేసి ప్రీ ప్రైమరీ తరగతులను ప్రవేశపెట్టాలని తెలిపారు. టీఎస్ యూటీఎఫ్ మొదటి నుంచి ఉపాధ్యాయ సమస్యల పట్ల నిక్కచ్చిగా పోరాడుతుందని, నేడు వారు పొందుతున్న అనేక సౌకర్యాలు టీఎస్ యూటీఎఫ్ పోరాటాల ఫలితమేనని చెప్పారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్.రాములు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి పదేండ్లుగా విద్యారంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం విద్యారంగ పటిష్టతకు కృషి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన విద్యా విధానం 2020 శాస్త్రీయవిద్యను దూరం చేసి అశాస్త్రీయతను పెంపొందించేలా ఉన్నదని విమర్శించారు. వెంటనే నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సభలో.. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వలిగొండ మండల ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కేసీహెచ్.రవి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కేపీ కృష్ణమూర్తి, రాష్ట్ర కార్యదర్శులు జి.నాగమణి, ఎం.రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు మిరియాల దామోదర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు, ఆహ్వాన సంఘం అధ్యక్షులు కట్ట రమేశ్, నల్గొండ జిల్లా అధ్యక్షులు వై.సైదులు, సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్, సంఘం మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం బరిలోకి ప్రియాంక దిగుతుందా?

రాష్ట్ర కాంగ్రెస్ నేతల ప్రయత్నాలు ఫలిస్తాయా?

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాలను కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తోంది. ఇప్పటికే రాష్ట్రం నుంచి సోనియాగాంధీ పోటీ చేయాలని కోరుతూ టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ తీర్మానం చేసి ఏఐసీసీకి పంపిన సంగతి తెలిసిందే. ఖమ్మం పార్లమెంటు స్థానాన్ని సునాయాసంగా కైవసం చేసుకునే అవకాశం ఉన్నట్టు అంచనా. సోనియగాంధీ పోటీ చేసేందుకు వీలుగా ఆ టికెట్ ఆశిస్తున్న రేణుకాచౌదరిని రాజ్యసభకు పంపించింది. అయితే అనూహ్యంగా సోనియాగాంధీ రాజస్థాన్ నుంచి రాజ్యసభకు పోటీ చేయడంతో రాష్ట్ర కాంగ్రెస్ నేతల ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. సోనియాగాంధీ ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకోవడంతో ప్రత్యామ్నాయంగా ప్రియాంకగాంధీని రంగంలో దించాలని భావిస్తున్నది. అందుకోసం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది.ఈ క్రమంలో సోనియాగాంధీ నిర్ణయాన్ని స్వాగతిస్తూనే... ప్రియాంకగాంధీని ఇక్కడి నుంచి పోటీ చేయించాలని పార్టీ నేతలు మరో ప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం.


(ఫైల్)

ఆమె పోటీ చేయడం ద్వారా పార్లమెంటు ఎన్నికల్లో లాభం ఉంటుందనేది కాంగ్రెస్ నేతల ఆలోచన. ప్రియాంకగాంధీని ఇక్కడి నుంచి పోటీ చేయించాలనే రాష్ట్ర కాంగ్రెస్ నేతల ఎత్తుగడ సరైందే అయినప్పటికీ అందుకు పరిస్థితులు అనుకూలంగా లేవనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆమె ఇక్కడి రావడం అంత ఈజీ కూడా కాకపోవచ్చనేది మరికొంత మంది నేతలు చెబుతున్నారు. ప్రస్తుతం ఆమె ఉత్తరప్రదేశ్ ఇన్‌చార్జి జనరల్ సెక్రటరీగా కొనసాగుతున్నారు. అత్యధికంగా 80 ఎంపీ స్థానాలు ఉన్నాయి. ఈసారి తల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న రాయబరేలీ నియోజకవర్గం నుంచి ఆమె పోటీ చేయనున్నట్టు తెలుస్తోంది. దీంతోపాటు అన్ని స్థానాల్లో కాంగ్రెస్ గెలిచేందుకు కృషి చేయాల్సి కర్తవ్యం ఆమెపై ఉన్నది. అంతేకాకుండా యూపీలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అంత ఆశాజనకంగా లేదనే తెలుస్తోంది.ఈసారి సోనియాగాంధీ ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకోవడంతో ఆ రాష్ట్ర బాధ్యత ప్రియాంకపై పడింది. ఇప్పటివరకు అక్కడి నుంచి సోనియగాంధీ, రాహుల్‌గాంధీ ప్రాతినిధ్యం వహిస్తూ వస్తున్నారు. గత ఎన్నికల్లో అమేధీ నుంచి రాహుల్‌గాంధీ ఓడిపోగా,రాయబరేలీ నుంచి సోనియాగాంధీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రియాంకగాంధీ తెలంగాణ రాష్ట్రం నుంచి పోటీ చేస్తే, పార్టీకి ప్రయోజనం కంటే నష్టం జరిగే అవకాశమే ఎక్కువ ఉన్నట్టు తెలుస్తోంది. ఓటమిని ముందుగా అంగీకరించిన ప్రియాంకగాంధీ తెలంగాణ నుంచి పోటీ చేస్తున్నారంటూ ఆ రాష్ట్రంలో బీజేపీ పెద్ద ఎత్తున ప్రచారం చేసే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇది బీజేపీకి మరో ఆయుధంగా మారబోతుందనే విషయం అధిష్టానం పెద్దల్లో చర్చ జరుగుతున్నది. ఈ నేపథ్యంలో ప్రియాంక యూపీని వదిలి ఇక్కడి రావడం అంత సులువు కాదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే రాష్ట్రం నుంచి ఆమె పోటీ చేయడం వల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రభావం పడుతుందని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అందుకోసమే ఆమెను ఇక్కడి నుంచి పోటీ చేయించేలా అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసింది. అయితే ప్రియాంకగాంధీని పోటీ చేయించి, లబ్ది పొందాలనే కాంగ్రెస్ నేతల ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయనేది వేచి చూడాల్సిందే..

నిజామాబాద్‌లోనే పసుపు బోర్డు ఏర్పాటు చేయండి

కేంద్రానికి లేఖ రాసిన మంత్రి తుమ్మల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పసుపు బోర్డును నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మోడీ ప్రభుత్వానికి లేఖ రాశారు. రాష్ట్రంలో అత్యధికంగా పసుపు పండిచే నిజామాబాద్ జిల్లాలోనే బోర్డును ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని రైతులు పెద్ద ఎత్తున నిజామాబాద్ ఎంపీ స్థానానికి నామినేషన్లు వేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ తర్వాతనే కేంద్రం స్పందించి పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని పేర్కొన్నారు. పసుపు బోర్డు ఏర్పాటు చేసే ప్రదేశంకానీ, దానికి అవసరమన బడ్జెట్ ప్రతిపాదన కానీ లేకుండా కేవలం కమిటీ సభ్యుల నియామకానికి సంబంధించి మాత్రమే వివరాలను గెజిట్లో పేర్కొన్నారని వివరించారు. ఈ నేపథ్యంలో తమ ప్రభుత్వం బోర్డు ఏర్పాటుకు చర్యలను వేగవంతం చేసిందని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2019-20 ఏడాదిలో 3.4 లక్షల ఎకరాల్లో పసుపు సాగు కాగా, 2022-23 కొచ్చేసరికి మూడేండ్లలో 56 వేల ఎకరాలకు పడిపోయిందని తెలిపారు. సరైన మార్కెటింగ్ సౌకర్యం లేక పోవడం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందక పోవడం వల్లనే సాగు విస్తీర్ణం తగ్గిందని పేర్కొన్నారు. ధరల స్థిరీకరణ, అనుబంధ విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి ఎగుమతి అవకాశాలు పెంచడానికి ఈ బోర్డు ఉపయోగపడుతుందని వివరించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిజామాబాద్‌లోనే పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మల లేఖలో కేంద్రాన్ని కోరారు.

అభయారణ్యంలో వరుసగా కార్చిచ్చు..!

ఫారెస్ట్ సిబ్బందికి సవాల్‌గా మారిన మంటలు



నవతెలంగాణ- అచ్చంపేట

నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ రిజర్వ్ టైగర్ ఫారెస్ట్ ఏరియాలో వేసవికాలం వచ్చిందంటే తరచూ అడవి మంటల్లో అహుతి అవుతున్న సంఘటనలు జరుగుతూనే ఉంటాయి. కానీ వేసవి కాలం రాకముందే ఇప్పటికే మూడునాలుగు దఫాలుగా మంటలు వ్యాపించినట్టు స్థానికులు తెలుపుతున్నారు. కాగా, రెండు రోజులుగా దోమలపెంట రేంజ్‌లోని ఉప్పునుంతల గ్రామ సమీప అడవి నుంచి కృష్ణా రివర్ సమీపంలోని వజ్రాల మడుగు వరకు మంటలు వ్యాప్తి చెందడంతో ఆదివారం వెలుగులోకి వచ్చింది. రెండు రోజులుగా మంటలు ఎగిసిపడుతుండటతో వాటిని ఆర్పడం.. అటవీశాఖ అధికారులకు సవాల్‌గా మారింది. మంటలను అదుపులోకి తెచ్చేందుకు తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటుచేసి చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు తెలుపుతున్నారు. మంటలు ఆర్పే సమయంలో సిబ్బందికి సరైన రక్షణా పరికరాలు లేకపోవడంతో కొంతమందికి గాయాలయినట్టు సమాచారం. అయితే, గత రెండు రోజులుగా 18 కి.మీపై అటవి కాలినట్టు తెలుస్తోంది. కాగా, గతేడాది వేసవిలో నాలుగు వేల హెక్టార్ల పరిధిలో అటవి కాలినట్టు అధికారిక లెక్కలు తెలుపుతున్నాయి. ప్రస్తుతం ఈ నెలలోనే మూడుసార్లు మంటలు వ్యాప్తి చెందడంతో సుమారు 3 వందల హెక్టార్లకు పైగా అడవి కాలినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

ఇవీ మన మూలాలు!

మానవ ప్రస్థానం గురించీ, మరీ ముఖ్యంగా 'మన' మూలాల గురించీ తెలుగులో ఒక సాధికారిక గ్రంథంగా ఇటీవల విడుదలైన 'ఇవీ మన మూలాలు'లో "మన విశ్వాసాలూ, ఇష్టాయిష్టాలూ, రాజకీయ అవసరాలదీ కాకుండా, శాస్త్ర పరిశోధనల్లో జ్ఞానానిది పైచేయి అయినంతవరకూ ఆ పరిశోధన క్రమంలో ఎలాంటి ఫలితాలు వచ్చినా, వాటిని తెరచిన బుద్ధితో ఆహ్వానించడమే మనం చేయగలిగిందీ, చేయవలసిందీ" అంటారు కల్లూరి భాస్కరం.

"ఒక్క మనదేశానికి మాత్రమే పరిమితమై చెప్పుకుంటే, జన్యు పరిశోధనలు భారత్ లోకి ఆర్య ఇండో- యూరోపియన్ జనాల వలసను స్పష్టీకరించిన దరిమిలా, జనం సెంటిమెంటును వాడుకునే రాజకీయానికీ, జ్ఞాన రంగానికీ మధ్య ఒక అసమ యుద్ధం ముమ్మరమైంది. ధర్మ పోరాటంలో తాను ఓడిపోతున్న పరిస్థితుల్లో రాజకీయం తమకు కలిసివచ్చే మేధావులూ, మీడియా సాయంతో అసత్యాలూ, అర్ధసత్యాలూ వక్రీకరణలే ఆయుధాలుగా అధర్మ పోరాటానికి దిగింది. అంతకన్నా కూడా అసలా చర్చ మీదే తెరదించేసి వ్యూహాత్మక మౌనం పాటించడమే మంచిదని కూడా క్రమంగా భావించినట్లు కనిపిస్తోంది"

నిజానికి కల్లూరి భాస్కరం గారి ఈ వాక్యాలే ఈ పుస్తకానికి ఆలంబన. ఇవీ 'మన' మూలాలు అనగానే మనకు తట్టేది ఒక గర్వాతిశయం. మన పూర్వీకుల గురించి గర్వంతో ఉప్పొంగి పోవాలన్న ఆసక్తి! ప్రతీ మానవుడికీ ఇది సహజమేనేమో! మన జననం, మన జనం, మన ఊరు, మన దేశం, మన తాత ముత్తాతలు, మన వంశవక్షం... అబ్బా, ఈ 'మన'లో ఎంత ఆకర్షణ వుంది! ఈ అవ్యాజమైన అనురాగాన్ని ఏ జన్యువు పెంచి పోషించిందో తెలీదు కానీ, మన మూలాల గురించి తెలుసుకోవాలన్న తపన మనని నిరంతరం ఉత్సాహంతో నింపేస్తుంది. ఈ సందర్భంలో అలెక్స్ హేలీ రాసిన "ది రూట్స్' మనని అమితంగా ప్రభావితం చేసిన పుస్తకాల్లో ఒకటి.


ప్రాణికోటి ప్రస్థానం అంతా కలగాపులగం. అదేమీ అధ్యాయాలకు అధ్యాయాలు ఏదో మెథడలాజికల్‌గా, పద్ధతిగా అల్లుకుపోయిన కథేమీ కాదు. నిజానికి అదొక పేజీలు చిరిగిన పుస్తకం. అన్నీ అతుకుల బొంతలు. తదుపరి పేజీలో క్లూ దొరుకుతుందన్న ఉత్సాహంతో పేజీ తిప్పితే అక్కడ ఆ పేజీనే గల్లంతై ఉంటుంది.

తొలి మానవ ఆనవాళ్లు మొదలయ్యాక వాటి వలసలన్నీ అయోమయంగా ఊహకు అందనంతగా, ఎటువంటి ఆధారాల్లేకుండా పోవడానికి చాలా కారణాలే ఉన్నాయి. మనం భూగోళంగా భావించే ఈ మట్టి (నీటి) ముద్ద ఒకప్పుడెలా ఉందో, ఆ తర్వాత అది పెళ్ళలుగా విడిపోయి ఖండాలుగా అవతరించినప్పుడూ, మంచు యుగాలు కొనసాగినప్పుడూ, జల ఖండాలు విడదీసినప్పుడూ, అగ్ని పర్వతాలు బద్దలైనప్పుడూ ఎలా రూపురేఖలు మార్చుకుందో నిరాధారం. మానవ మనుగడ మొదలయ్యే అనేక దశల్లో ఆ ఖండ భాగాలు చెల్లాచెదురై, గుంపులు గుంపులుగా కలిపి వుంచిన తొలి మానవ ప్రాణుల మధ్య అగాధాలు సృష్టించినా, ఒక చోటు నుంచి ఇంకొక చోటుకు వెళ్లి మరొక గుంపుతో సంపర్కాలు జరిపి, తమ జన్యువుల్లో అన్ని గుంపుల తాలూకూ లక్షణాలను ఎలా మోసుకుంటూ తిరిగారో అంతా అనూహ్యం. అయినప్పటికీ, ఒకచోట స్థిరపడే వరకూ కొనసాగిన ఆ మానవ మహాప్రస్థానాన్ని, గల్లంతయిన పేజీలను జాగ్రత్తగా పేర్చుకుంటూ, సరిచేసుకుంటూ, నిర్మించుకు రావడం చాలా ఆసక్తికరం. ఈ ఆసక్తికర కథనాన్ని ఈ పుస్తకం నిష్పక్షపాతంగా మన ముందుంచే ప్రయత్నం చేసింది.



చాల్స్ డార్విన్, టోనీ జోసెఫ్, డేవిడ్ రైక్, రూథర్ ఫర్డ్, డేవిడ్ అంతోనీ వంటి వారి అద్భుత పరిశోధనా ఫలితాలను ఉటంకిస్తూ సాగిన ఈ రచన బీజాంకుర దశ నుంచి, అంటే ఎక్స్, వై క్రోమోజోముల నుంచి మొదలై, హద్దుల్లేని భూగోళమంతా చుట్టి, ఆర్యావర్తం వరకూ వచ్చి అంతమవుతుంది. స్థల, కాలాల సరిహద్దుల ఊహాజగతి ఒక్కసారిగా విస్తృతమై, దిగంతాలు దాటి వెతుక్కుంటూ వెళ్లి, అన్వేషణ పూర్తయ్యాక మన హృదయాలు కుంచించుకుపోవడానికి బదులు విప్పారుతాయి. కుల, వర్ణ, వర్గ, జాతి స్పృహలు లేని ఒక మహోన్నత సమాజంలో విశ్వ మానవ ప్రాణిగా వికసించాల్సిన అవసరాన్ని ఈ పుస్తకం మన హృదయంలో నాటుతుంది. ఈ పుస్తకం పూర్తయ్యాక, మానవ సమాజం పట్ల ఒక గొప్ప గ్రంథానికి వుండాల్సిన బాధ్యత ఇంతకంటే వేరే ఏదో ఉంటుందనుకోవడం పొరపాటనిపిస్తుంది.

ఈ గ్రంథం మహా వానరాలైన చింపాంజీలూ, బోనోబోలు, ఒరాంగుటాన్లూ, గొరిల్లాలు, హోమోలు (24 జతల క్రోమోజోములు కలిగిన) నుంచి విడిపోయి, 23 జతల క్రోమోజోములు కలిగిన మనిషి తొలిసారిగా కనబడటం మొదలుపెట్టిన 32 లక్షల సంవత్సరాల క్రితం నుంచీ ప్రారంభించి, 19 లక్షల సంవత్సరాల క్రితం ఆఫ్రికా నుంచి వేరే ప్రాంతాలకు విస్తరించడమూ, 7 లక్షల సంవత్సరాల క్రితం వునికిలోకి వచ్చిన హోమో



సేపియన్స్, నియాండర్తల్ అనే రెండు మానవ రకాల పరిశీలనతో ప్రారంభమవుతుంది. నియండర్తల్ మగ ప్రాణి లక్ష సంవత్సరాల క్రితం ఈ హోమో సేపియన్స్ ఆడప్రాణితో జత గూడడమూ, నియాండర్తల్ రకం అంతరించిపోయినా, ఇప్పటికీ మనలో 'కెరాటిన్' జన్యు అవశేషాన్ని మోసుకు తిరిగడమూ అనే ఒక్క ఉదాహరణతో మన సజాతీయ గుంపుల మధ్య సంపర్కాలు ఖండాలు దాటి ఉన్నాయన్న వాస్తవం గగుర్పాటు కలిగిస్తుంది.

ఇందులో ప్రతిదీ ఒక ఆసక్తికరమైన అంశమే. మన మూలాల్లోని ఒకటి రెండు సందర్భాల్ని ఇక్కడ ఉటంకించడం ద్వారా అవి మిమ్మల్ని ఎంతగా అప్రతిభుల్ని చేస్తాయో చూడొచ్చు.

మానవ చరిత్రలో తొలి మహత్తర విప్లవం వ్యవసాయమనీ, వ్యవసాయం కోసం ప్రాదేశిక భావన బలపడి రాజ్యావతరణకు ఎలా దారి తీసిందో, ఈ ప్రాదేశిక భావన వెనక అసలు నిజం ఆస్తుల స్వంతమూ, వాటిని కాపాడుకోవడం కోసమేననేది సరిహద్దుల గీతలు, కంచెలు, గోడల్లో చూడొచ్చుననే నిజాన్ని బయట పెడుతుంది. ఇలాంటి అద్భుత సూత్రీకరణలు ఈ పుస్తకంలో చాలా ఉన్నాయి. ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డేవిడ్ రైక్, హిట్టైట్ లిపి ఛేదించిన ప్రముఖ పురాతత్వ భాషావేత్త బెడ్రిక్ హ్రోజ్నీ నీ ప్రస్తావిస్తూ, వ్యవసాయ విప్లవం పారిశ్రామిక విప్లవంతో పోల్చదగ్గ మహా విప్లవం ఎందుకైందో చెబుతారు.

నాలుగు భాగాలుగా విస్తరిల్లిన ఈ గ్రంథంలో మొదటి భాగంలో మానవ పూర్వీక జాతులైన నాలుగైదు రకాల మనలాంటి వారి మూలాలను చూపగా, రెండో భాగంలో వాంగ్మయాధారాలూ, యూరప్, భారత్‌లో కనపడే సామ్యాలూ, మూడో భాగంలో ఆఫ్రికన్ తల్లిలో వెతుక్కున్న జనన రహస్యాలూ, జన్యుమూలాలూ, తర్వాత అక్కడి నుంచి మానవ ప్రస్థాన విస్తృతిలో భాగంగా భరతభూమిగా పేర్కొనే మన సరిహద్దుల లోపల మెహర్‌గడ్, హరప్పా, ద్రవిడ సంస్కృతి మేళవింపులూ, సరిహద్దు దేశాలతో బాంధవ్యమూ, ఆర్యావర్తమూ, వేదవాంగ్మయమూ, రామాయణ మహాభారతాల వెనుక ఉన్న చారిత్రక వెలుగు జిలుగులూ, మధ్య యూరప్ నుంచి చైనా వరకూ ఎనిమిది వేల కిలోమీటర్ల దూరం వ్యాపించిన స్టెప్స్ (ఎందుకో మరి కల్లూరి భాస్కరం గారు ఈ పదాన్ని 'స్టెప్పీలు' అన్నారు! నిజానికి వీటిని స్టెప్స్ అనడం సరైంది!) అనబడే గడ్డి భూములనుండి (సరిహద్దుల ఎల్లలు అనే స్పృహ ఇప్పుడు ఏర్పరచుకున్నది!) మొదలు పెట్టి, మహాభారత గాథల్లోని ఇతిహాసపు ఆనవాళ్లనూ, ఆర్యావర్తంలో అతి సాధారణమైన పశుబలుల గురించీ, యజ్ఞ యాగాదుల గురించీ, వైదిక ప్రమాణాల గురించీ చాలా విస్తృతమైన వివరణలు ఇస్తూ 'మన' మూలాల లోపలికి చొచ్చుకు వెళతారు.

ఇందులో ప్రతిదీ ఒక ఆసక్తికరమైన అంశమే. మన మూలాల్లోని ఒకటి రెండు సందర్భాల్ని ఇక్కడ ఉటంకించడం ద్వారా అవి మిమ్మల్ని ఎంతగా అప్రతిభుల్ని చేస్తాయో చూడొచ్చు.

భారతీయుల రూపురేఖల్లో జన్యు మిశ్రమం వల్ల ఎంత వైవిధ్యం కనబడుతుందో చెబుతూ, నలుపు నుంచి చామన చాయ వరకూ, యూరోపియన్ కవళికల నుంచి చైనీయ కవళికల వరకూ ఇక్కడ జనాల్లో కనిపిస్తాయనీ, ఉత్తర భారత పూర్వీకులకు యురేషియా జనాలతో అంటే... యూరప్, మధ్య ఆసియా, పశ్చిమాసియా, కాకసస్ లతో జన్యు సంబంధం ఉందనీ, అదే సమయంలో దక్షిణ భారత పూర్వీకులకు, నేటి భారత ఉపఖండానికి బయట ఉన్న ఏ జనాభాతోనూ జన్యు సంబంధం లేదనీ డేవిడ్‌రైక్ ప్రతిపాదించిన సూత్రీకరణలను ప్రస్తావిస్తారు.

ఈ విషయ విస్తృతి ఒక మహా సముద్రమైతే, ఈ సమీక్ష ఒక నీటి బొట్టు మాత్రమే!

ఈ సమీక్ష ఉద్దేశం బాధ్యతగల ఒక చదువరిగా తన జాతి మూలాలను వెతుక్కునే క్రమంలో సరిహద్దులు లేని ఒక నవీన మానవుడి అవతరణ దిశగా మన ప్రస్థానం కొనసాగుతుందని తెలుసుకోవడమే ప్రధాన విషయం.

తెలుగువారికి ఒక గొప్ప పరిశోధక గ్రంథాన్ని అందించిన కల్లూరి భాస్కరం గారికి యావత్తూ తెలుగు ప్రజానీకం కతజ్ఞతలు తెలుపుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



– వి.విజయకుమార్, 8555802596

సమరం!



నెర్రెలు బారిన నేలకూనకు
చనుబాలిచ్చే చైతన్య మాతలు!
జీవకోటి మనుగడకు
జీవం పోసే నిత్య బాలింతలు!

గలగలా పారే నదీతీర గర్భంలో
పాపాత్ములు పంచుకొనే నల్ల బంగారునిధులు!
పచ్చని చీరను పరుచుకొని
నిరంతర విధులను నిర్వర్తించే పరిసరప్రభలు!

ఆధునికత పేరుతో! అభివృద్ధి ముసుగులో
పంచభూతాల సీమంతపు వసంతాన్ని
యంత్రభూత కోరలతో పరపరా చెరిచి!
అభయారణ్య ఆవాసాల్లో సునామీలనుసృష్టించి
ఆనక!అమాయక ఆదివాసుల గుండెల్లో
గునపాలు దించే హరిత హంతకులు!

కొలిమిలా మండుతున్న
ధరిత్రీ ఊపిరి తిత్తులు
కొంతైనా ఉపశమించేందుకు
కంకణం కట్టుకున్న భూమి పుత్రులు!
సడలని మదితో సమరం సాగించే
అవిశ్రాంత సాధనా శూరులు!!

– కరిపె రాజ్‌కుమార్, 8125144729

చలి కప్పిన సన్మాన దుప్పటి



ఇత్తులు చల్లిన
నేలనా నెత్తురు సల్ల
కారినా చెమట చుక్కలు
రాలిన రక్తపు చుక్కలు

మొక్కలు చెప్పుతాయి
నా మొఖంలో దుఃఖం
ఎంత ఉందని
సెలకనే చెప్పుతాది
నా శ్రమ ఎంతని

ముండ్లను ముద్దాడిన పాదాలు
నెలకు నెత్తురు తిలకం దిద్ది
పచ్చని పతాకని
ఎగుర వేసిన హృదయమని

మట్టే మందై మానిన గాయాలు
ప్రకృతి గాలి ప్రాణం
పోసిన పాదాలు

మేఘమే నాకు మెరుపుల గొడుగు
సెలక్క శరీరానికి చేసిన సత్కారం
వరి గడ్డిని నా వంటికి
చలి కప్పిన సన్మానం దుప్పటి

– దేవరపాగ కృష్ణయ్య, 9963449579

సాహిత్య వార్తలు

మాడభూషి రంగాచార్య స్మారక కథాపురస్కారం

మాడభూషి రంగాచార్య స్మారక కథాపురస్కారం 2023 సంవత్సరానికి ఉమానూతక్కి కథాసంపుటి ' 25వ గంట' ఎంపిక అయ్యింది. ఫిబ్రవరి 25 సాయంత్రం 5-30 గంటలకు కష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం, సుల్తాన్ బజార్, హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో రచయిత్రికి నగదు బహుమతి, జ్ఞాపిక అందజేస్తారు. 'నేటికాలపు మేటి కథకులు పుస్తకావిష్కరణ' ఉంటుంది. శీలా సుభద్రాదేవి, శ్రీధర, కొండవీటి సత్యవతి, లలితాదేవి పాల్గొంటారు.

– శ్రీమతి మాడభూషి లలితాదేవి

కొమ్మవరపు విల్సన్ పుస్తక పరిచయం

కొమ్మవరపు విల్సన్ రావు కవితా సంపుటి 'నాగలి కూడా ఆయుధమే..!' పుస్తక పరిచయ సభ ఈ నెల 25 తేదీ ఉదయం 9:30 గంటలకు శ్రీకాకుళం మీటింగ్ హాల్‌లో జరుగుతుంది. ఇందులో కె.శ్రీనివాసు, అట్టాడ అప్పలనాయుడు, కలిమిశ్రీ, డా॥ కె.జి.వేణు, డా॥ కె.ఉదయ్ కిరణ్, వి.జి.కె. మూర్తి, నెట్టిమి రమణారావు, చింతాడ తిరుమలరావు, దాసరి రామచంద్రరావు, పాయల మురళీకష్ణ, బాల సుధాకర్ మౌళి, కంచరాన భుజంగరావు, సాంబమూర్తి లండ, బాడాన శ్యామలరావు, పూజారి దివాకర్, కె.షణ్ముఖరావు, యస్. భవానీ వర ప్రసాద్ పాల్గొంటారు

– సాహితీ స్రవంతి, శ్రీకాకుళం

తెరవే రాష్ట్ర మహాసభలు

ఈ నెల 25వ తేదీ ఉదయం హైదరాబాద్, బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర మహా సభలు నిర్వహించనున్నారు. ఈ సదస్సులో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, కె. శ్రీనివాస్, అందెశ్రీ, నగునూరి శేఖర్, ఆచార్య జయధీర్ తిరుమలరావు, జూకంటి జగన్నాథం, ఆచార్య కాత్యాయనీ విద్మహే, గాజోజు నాగభూషణం, అన్నవరం దేవేందర్, ఉదారి నారాయణ పాల్గొంటారు. తెలంగాణ భాషా సాహిత్య సంస్కృతులకు ఎదురవుతున్న సవాళ్లు - పరిష్కారాలు, తెలంగాణ కవులు రచయితల కర్తవ్యాలు చర్చిస్తారు.

– కొండి మల్లారెడ్డి, బూర్ల వేంకటేశ్వర్లు

కొలకలూరి పురస్కారాలు - 2024

ఈ సంవత్సరం పురస్కారార్థం వచ్చిన సుప్రసిద్ధ సాహిత్య స్రష్టల గ్రంథాలలో పురస్కారాలకు ఎంపికైన మూడింటితోపాటు మరి మూడు గ్రంథాలకు పురస్కారం ప్రకటించగలగటం ఆనందదాయకంగా ఉంది. విజేతలు : 'శ్రీమతి కొలకలూరి భాగీరథీ కథానికా పురస్కారం - 2024' కి గాను 1. 'కామునికంత' (హుమయున్ సంఘీర్), 2. 'కలుంకూరి గుట్ట' (కె. వి. మేఘనాథరెడ్డి). 'కొలకలూరి విశ్రాంతమ్మ నవలా పురస్కారం - 2024' కి గాను 1. 'అడవి బతుకులు' (డా॥దిలావర్), 2. 'నిర్మాల్యం' సింహప్రసాద్). 'కొలకలూరి రామయ్య విమర్శన పురస్కారం - 2024' కి గాను 1. 'తాత్త్విక నేపథ్యంలో తెలుగు కవిత్వ పరిణామం' (డా॥సుంకిరెడ్డి నారాయణరెడ్డి), 2. 'నవలా హదయం -3' (వి. రాజారామమోహనరావు). మా అమ్మ జయంతి, వర్ధంతి 26.2.2024. రోజు సాయంకాలం పురస్కార ప్రదాన సభ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (నాంపల్లి, హైదరాబాద్)లో జరుగుతుంది.


– ఆచార్య కొలకలూరి సుమకిరణ్, 9963564664

వైద్యం వేంకటేశ్వరాచార్యులుకి సాహిత్య పురస్కార ప్రదానోత్సవం

22వ సాహిత్య పురస్కార ప్రదానం డా॥ భూతపురి సుబ్రహ్మణ్యశర్మ మెమోరియల్ ట్రస్ట్, అల్లసాని పెద్దన సాహిత్యపీఠం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 25 వ తేదీ ఉదయం 10 గంటలకు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కడపలో జరుగుతుంది. వైద్యం వేంకటేశ్వరాచార్యులు ఈ పురస్కారం అందుకుంటారు. ఈ సభలో ఆచార్య బి.ఆంజనేయ ప్రసాద్, ఆచార్య చింతా సుధాకర్, ఆచార్య టి.రామప్రసాద రెడ్డి, బి.రాజశేఖర్, ఎ.రామసుబ్బారెడ్డి, డా॥ కె.గోపీనాథ్, డా॥ వై.నాగేంద్రమ్మ పాల్గొంటారు.

–డా॥భూతపురి గోపాలకష్ణశాస్త్రి, 9966624276

కొత్తల పండుగ



కష్టసుఖాలు కావడి కుండలైన ఊరిలో
ఉగాది ముందు ఒక్క కల్లమైనా ..
ఊరు ఊరంతా కొత్తల పండుగ
సాటగొట్టి బూడ్డి పొత్తిబోసిన
యాసంగి వడ్లకుప్ప మీద గణాలపతి
పెద్ద బతుకమ్మ మీది గుమ్మడి గౌరమ్మ
ఆరున్నొక్క రాగంబట్టి కుండ కొలతబెడుతుంటే..
కష్టాలన్నీ రైతు కంటి చెమ్మలో
కరిగిపోయే ఎన్నరావలు
ఇయ్యడమే గుణమైన ప్రకృతికి
ఇస్సాసంగా ఉండడం కన్నా
తిరిగి ఏమివ్వగలమని దోసిలి నిండా కొత్తొడ్లుబట్టి
మెత్తగా గుండెలకత్తుకుంటుంటే
పంచభూతాలు కల్లొత్తుకుంటాయి
పెద మేతరి తాత సేతుల్ల దివ్యత్వమేముందో..
శివాంట మూడు పిడికిల్ల కొత్త బియ్యం
అడుక్కొచ్చి వండుకుంటే
ఇగ యేడు యేడంతా ఇంట్లె బర్కతే
జాజు సున్నపు పూతలతో
రోల్లు రోకళ్ళు జల్లలు కుందెన్లకు
ఏటికొక్కమారు పెండ్లికళ
పుదిచ్చిన కూరాడు కుండ
ఇంటి లచ్చువమ్మోరు
ఆడకట్టు ముత్తైదువలు ఒక్కతానజేరి
బొట్టు పసుపొంచుకొని
పిడికెడు పిడికెడు వడ్లు రోట్లెబోసి
కుదురుగా కూసబెట్టిన కుందెనలో
కంకణాలు కట్టిన రోకళ్ళతో
సువ్వీ సువ్వన్నలారా సువ్వన్నలారో సువ్వన్నలారా..
సువ్వీ అంటూ మీరంతా
పోటు ఎయ్యంగా.. ఒక పోటు ఎయ్యంగా..
అని పాటతో పాటు పోటు వేస్తుంటే
మట్టి గాజుల గలగల సప్పుడు బతుకు గీతమైతది
ఆకాశమప్పుడు కునికిపాట్లుబడ్తది
అల్కు పిడుసతొ ఇగురంజేసిన
ఒత్తు పొయ్యిమీద.. తెచ్చిన గిద్దెడు బియ్యం
తుకతుక ఉడికితే ఇత్తడి గిన్నెల అత్తెసరన్నం
పుట్టకన్నెలు తెరుస్తది
కూరాడు ముంగటి పచ్చటాకుల
ఆ పచ్చబువ్వే ప్రసాదమైతది
కోడిపుంజులు లేవు కొబ్బరికాయలు లేవు
కూరాడు కుండకు నీళ్లారబోసి
పప్పు పచ్చిపులుసుతో పావురంగ కలిపి
ఇంటాడబిడ్డ మొదట ముద్ద తిని
తలో బుక్కెడు నైవేద్యంబెడితే..
ఏటికేడంతా పుట్టింటి గడపకు
కంకెడు కూడుకు కొదవుండదు
నోటి దాకా ముద్ద రావడానికి
ప్రకృతి చేసిన సాయాన్ని ఆడబిడ్డ అనుమతికి
తంతులా ముడేసిన తాతలు
సచ్చి సర్గానికి బోయింద్రు..
కాలంలో కనుమరుగయ్యేదాకానైనా
భూమ్మీద ఈ పండగుంటే
ఎంత బాగుండో అనిపిస్తది..
కొత్తల పండుగ యాదికొచ్చినప్పుడల్లా..
పానం పాత రోజుల్లకు పరుగులువెడ్తది..

– తుల.శ్రీనివాస్, 9948525853

దేదీప్యమానంగా వెలిగే గజల్ కాగడా

దివంగత మునవ్వర్ రాణా ప్రముఖ కవి. ఉర్దూతో పాటు హిందీ, అవధి భాషల్లో గజల్ రాసేవారు. ఉర్దూ సాహిత్యానికి గాను ఆయనకు 2014 సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. మునవ్వర్ రాణా జనవరి 14, 2024న తన 71వ ఏట లక్నో, ఉత్తర ప్రదేశ్‌లో గుండెపోటుతో మరణించారు. వారి మరణం సాహితీ లోకానికి, ముఖ్యంగా ఉర్దూ సాహిత్యానికి తీరని లోటు.

మునవ్వర్ రాణా ఉత్తరప్రదేశ్‌లోని సరియు నదీ తీరాన ఉన్న చరిత్రాత్మక నగరమైన రాయబరేలిలో 1952 నవంబర్ 26న ముస్లిం కుటుంబంలో జన్మించాడు. తండ్రి పేరు సయ్యద్ అన్వర్ అలి తల్లి అయిషా ఖాతూన్.

భారతదేశ విభజన తరువాత, అతని బంధువులు చాలా మంది పాకిస్తాన్‌కు వెళ్లారు. కాని అతని తండ్రి భారతదేశం విడిచి వెళ్లలేదు. దేశ విభజన తర్వాత అతని తండ్రి 'జమీందారీ'ని కోల్పోయాడు. తన జీవనోపాధి కోసం అతని తండ్రి రవాణా వ్యాపారం ప్రారంభించాడు. వారి ఇంటి వాతావరణం మౌల్వీ సంప్రదాయం.


మునవ్వర్ రాణా బాల్యం చాలా వరకు కోల్‌కతాలో గడిచింది. అతను అక్కడి పాఠశాల నుండి విద్యను అభ్యసించాడు. తర్వాత బి.కాం గ్రాడ్యుయేట్ చేశాడు.

కోల్‌కతాలో నివసిస్తున్నప్పుడు, మునవ్వర్ రాణా 'నక్సలిజం' వైపు ఆకర్షితుడయి, వాళ్లను కలవడం ప్రారంభించాడు. వారిలో కొందరు మునవ్వర్ రాణాకు స్నేహితులు కూడా అయ్యారు. 'నక్సలైట్స్' తో తన కొడుకుకు సంబంధం గురించి తెలిశాక, అతను మునవ్వర్ రాణాను ఇంటి నుండి బయటకు పంపి, అతనితో కుటుంబ సంబంధాల్ని తెంచేశాడు. రెండేళ్ల ఆవారా జీవితం లాంటిదే గడిపాడు రాణా. అలా గడిపిన కాలంలో మానవ విలువలను, జీవిత పరమార్థాన్ని బాగా అర్థం చేసుకున్నాడు.

మునవ్వర్ రాణా తన తల్లిని చాలా ప్రేమిస్తాడు. తన కవిత్వంలో తల్లి/ అమ్మ పట్ల తనకున్న ప్రేమను వ్యక్తపరిచాడు. పంపకంలో ఒకరికి భవనం/ మరొకరికి వ్యాపారం/ ఇంట్లో పిన్నవాడినైన నాకు/ దక్కింది అమ్మ, వరం.

మరో ద్విపదం (షేర్) లో తల్లి గురించి తన గజల్‌లో అంటాడు... "ఓ చీకటి! చూసుకో నీ మొహం/ మారింది గాడాంధకారం/ అమ్మ తెరిచిన నయనాలకు/ వెలిగింది ఇల్లు దేదీప్యమానం".

మునవ్వర్ రాణా లక్నో వెళ్ళినప్పుడు, ఆ ప్రాంతం అతన్ని ఎంతగానో ఆకర్షించింది, లక్నో అతనికి ఇష్టమైన నగరంగా మారింది. అక్కడే స్థిర పడ్డాడు. మునవ్వర్ రాణా లక్నోలో ఉన్నప్పుడు ప్రముఖ గజల్ కవి వలీ అసిని కలిశాడు. వలీ ఆసి సలహా మేరకు కవిత్వం నేర్చుకోవడం ప్రారంభించాడు. గజల్ నైపుణ్యాన్ని జీర్ణించుకున్నాడు. వలీ అసికి కృతజ్ఞుడయ్యాడు. మునవ్వర్ తన గజల్ లను మొదటిసారిగా ఢిల్లీలోని 'ముషాయిరా'లో ఆలాపించాడు. అతను తన కవితలలో సున్నితమైన సమస్యలను చిత్రీకరించడానికి హిందీ, అవధి భాషల పదాలను ఉపయోగించడంలో ప్రసిద్ధి చెందాడు. మునవ్వర్ రాణా కవితల్లో (గజల్) చెప్పుకోదగ్గ విశేషం 'అమ్మ'ని గౌరవించడం.



మునవ్వర్ రాణా తన తల్లిని చాలా ప్రేమిస్తాడు. తన కవిత్వంలో తల్లి/ అమ్మ పట్ల తనకున్న ప్రేమను వ్యక్తపరిచాడు. పంపకంలో ఒకరికి భవనం/ మరొకరికి వ్యాపారం/ ఇంట్లో పిన్నవాడినైన నాకు/ దక్కింది అమ్మ, వరం.

మునవ్వర్ రాణా ఒక ప్రత్యేకమైన స్వరంతో ఇండియాలో, విదేశాలలోనూ అత్యంత ప్రజాదరణ పొందిన కవులలో ఒకరు. అతని అత్యంత ప్రసిద్ధ కవిత 'మా'. దీనిలో అతను తల్లి సద్గుణాలను కీర్తించడానికి గజల్ శైలిని ఉపయోగించాడు.

మునవ్వర్ రాణ గజల్‌లో గ్రామం, పొలాలు, కూలీలు, నేల, ఉనికి, బీడీలు తయారు చేసే కార్మిక మహిళలు, రైలు డబ్బాలను చీపురు ద్వారా ఊడ్చే స్త్రీలు కేంద్రంగా ఉంటాయి. ఓ ముషాయిరా (కవిత గోష్టి) లో అంటాడు: "ఎలా తెంచుకొని వెళ్లాలి నా ఉనికి సంకెళ్లను/ జీవితాంతం ముడిపడినవి, ఎక్కడికెళ్లను/ పృథ్వియే గదా నా తల్లి/ దాన్నొదిలి నేనెక్కడికి వెళ్లను".

ఉర్దూలో ప్రచురించబడిన కొన్ని గజల్ సంకలనాలు: 'బగైర్ నక్షే కా మకాన్, చహరే యాద్ రహతె హై, జంగ్లి ఫూల్, కహో జిల్లే ఇలాహి, మా(తల్లి), సఫేద్ జంగ్లి కబుతర్, ముహజిర్ నామా' మొదలైనవి. రాణా కవిత్వం హిందీ, ఇంగ్లీష్, గురుముఖి, బంగ్లా భాషలలో కూడా అనువదించ బడినాయి.



- మొహ్మాద్ అమ్జద్ అలీ, 00 966 507662638

చండీగఢ్ మేయర్ రాజీనామా



చండీగఢ్ : దేశం యావత్తు తీవ్ర విమర్శలు చేసిన ఎన్నికల్లో విజయంతో చండీగఢ్ మేయర్‌గా ఎన్నికైన మనోజ్ సొంకార్ ఆదివారం సాయంత్రం తన పదవికి రాజీనామా చేశారు. మనోజ్ సొంకార్ ఎన్నికకు వ్యతిరేకంగా దాఖలైన పిటీషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు విచారణకు ఒక రోజు ముందుగా మనోజ్ రాజీనామా చేసినటు భావిస్తున్నారు. జనవరి 30న చండీగఢ్ మేయర్ ఎన్నికలు జరిగాయి. అయితే ఇందులో కాంగ్రెస్, ఆప్ కౌన్సిలర్లకు చెందిన ఏడు ఓట్లను చెల్లనవిగా ప్రకటించి బీజేపీ అభ్యర్థి మనోజ్ సొంకార్ విజయం సాధించినట్లుగా అధికారులు ప్రకటించారు. చెల్లని ఓట్లుగా ప్రకటించడం కోసం ప్రతిపక్ష కౌన్సిలర్ల బ్యాలెట్ పత్రాలపై ఎన్నికల అధికారి పిచ్చి గీతలు పెడుతున్న వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఎన్నికలను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును ఆప్ ఆశ్రయించింది. గత విచారణలో ఈ ఎన్నికను 'ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడంగా' సుప్రీంకోర్టు విచారించింది. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. నేడు జరిగే విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలని ప్రెసిడింగ్ అధికారి ఆదేశించింది.

ఇంకా ముఖ్యమంత్రి కేసీఆరే..!

- ఆదర్శ పాఠశాలలో మారని విద్యాశాఖ బోర్డు
- పేరు మార్పు చేయడంలో బహిర్గతమైన సిబ్బంది నిర్లక్ష్యం



నవతెలంగాణ-బెజ్జంకి

ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి మార్పు జరిగి సుమారు రెండు నెలలు గడుస్తున్నా పాఠశాలలో ఏర్పాటు చేసిన బోర్డుపై ఇంకా రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్‌నే యథావిధిగా కొనసాగిస్తుండటం విధుల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టంగా బహిర్గతమవుతోంది. క్రమశిక్షణకు మారుపేరుగా పేరు గడించిన ఆదర్శ విద్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం మండలంలో పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రానికి అనుబంధ గ్రామమైన ఎల్లంపల్లి ఆదర్శ విద్యాలయంలో విద్యాశాఖ బోర్డుపై ముఖ్యమంత్రిగా కేసీఆర్, విద్యాశాఖ మంత్రిగా సబితా ఇంద్రారెడ్డి పేర్లను మార్పు చేయకుండా యథావిధిగా కొనసాగిస్తుండటం సిబ్బంది నిర్లక్ష్యానికి తార్కాణంగా నిలుస్తోంది. ఆదర్శ విద్యాలయ సిబ్బంది ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి విద్యాశాఖ బోర్డుపై పేర్లను మారుస్తారా లేకా యథావిధిగా కొనసాగిస్తారా వేచి చూడాల్సిందే.

ఎన్‌డీ నాయకత్వంపై కుట్రకేసులు

- రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీపీఐ(ఎంఎల్)ఎన్‌డీ రాష్ట్ర నాయకత్వంపై రాష్ట్ర ప్రభుత్వం కుట్ర కేసులు మోపుతున్నదనీ వీటిని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర నాయకులు కె. గోవర్ధన్, గౌని ఐలయ్య, ఎం శ్రీనివాస్, జి అనురాధతో కలిసి విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 14న ఎన్‌డీ రాష్ట్ర కార్యదర్శి అశోక్, రాష్ట్ర నాయకులు గోపన్నలతో పాటు ఎస్‌కే మదార్, కె సురేశ్‌లను ఖమ్మం పరిసర ప్రాంతాల్లో అదుపులో తీసుకున్నారని తెలిపారు. వారిని 48గంటల్లో కోర్టులో హాజరుపర్చకుండా 16న అరెస్టు చేసినట్టు తప్పుగా చూపించారని విమర్శించారు. వారితో పాటు 24 మందిపై ప్రభుత్వాన్ని కూలదోయటానికి ఆయుధాలు, డబ్బులు సమకూర్చుకుంటున్నారని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. వారితో పాటు మరికొందరిని అరెస్టు చేశారని వారందరిపైనా పెట్టిన కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన అని చెప్పుకునే సర్కారులో నిర్బంధమేంటని ప్రశ్నించారు.

14 శాతం వద్దు

- వేతన పెంపు కనీసం 25 శాతం ఉండాలి : ఎల్ఐసీ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బీమా సంస్థ ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం 14 శాతం వేతన పెంపు ప్రతిపాదనను తిరస్కరించింది. ఐదేండ్ల ఒప్పందం ప్రకారం 2017 నుంచి వేతన సవరణ జరగాల్సిన ఉద్యోగులు కనీసం 25 శాతం పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. శుక్రవారం ముంబయిలో ఆల్ ఇండియా నేషనల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏఐఎన్ఎల్ఐఈఎఫ్), ఎల్ఐసీలోని ఇతర యూనియన్‌లతో జరిపిన ఒక సమావేశంలో ఈ ప్రతిపాదనను ప్రభుత్వం అందించింది. దీనిని యూనియన్ తిరస్కరించింది. ఇది అంకితభావాన్ని, కార్మికుల నిబద్ధతను ప్రతిబింబించడం లేదని తెలిపింది. ఏఐఎన్ఎల్ఐఈఎఫ్ జనరల్ సెక్రెటరీ రాజేష్ నింబాల్కర్ ఒక ప్రకటనను విడుదల చేశారు. అనేక పరామితులలో ప్రభుత్వ రంగ బీమా సంస్థ పనితీరును పరిగణనలోకి తీసుకుంటే, మేనేజ్‌మెంట్ చేసిన ఆఫర్ ఉద్యోగులను నిరాశపరిచిందని పేర్కొన్నారు. ఉద్యోగులకు చివరి పెంపు 2017లో జరిగింది. తదుపరి సవరణ 2022లో జరగాల్సి ఉంది. "2017 వేతన సవరణలో, కంపెనీ దాదాపు 20-25 శాతం పెంపును ఇచ్చింది. ఈసారి కూడా మేము దాదాపు 22 శాతం పెంపును ఆశిస్తున్నాం" అని నింబాల్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ రంగ బీమా సంస్థ నివేదిక ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24 మూడో త్రైమాసికంలో సంవత్సరానికి 49 శాతం నికర లాభాన్ని నమోదు చేసింది. ఇది గత సంవత్సరంలో రూ. 6,334.29 కోట్ల నుంచి రూ. 9,444.42 కోట్లుగా ఉన్నది. నికర ప్రీమియం ఆదాయం కూడా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.1,11,788 కోట్ల నుంచి రూ.1,17,017 కోట్లకు మెరుగుపడింది. ఎల్ఐసీ మొత్తం ఆదాయం కూడా గత డిసెంబర్ త్రైమాసికంలో రూ.1,96,891 కోట్లతో పోలిస్తే రూ.2,12,447 కోట్లకు పెరిగింది.

కాంగ్రెస్ హయాంలో మెగా స్కామ్‌లు

- బీజేపీకి 370 ప్లస్ ఖాయం: ప్రధాని మోడీ



న్యూఢిల్లీ : కాంగ్రెస్ హయాంలో అవినీతి రాజ్యమేలగా, తమ పదేండ్ల పాలనలో దేశంలో ఎలాంటి మెగా స్కామ్‌లు జరగలేదని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఢిల్లీలో ఆదివారం పార్టీ జాతీయ సదస్సు 2024 రెండో రోజు బీజేపీ నేతలను ఉద్దేశించి ప్రధాని మాట్లాడుతూ విపక్ష నేతలు ఈసారి ఎన్డీయేకు 400 స్థానాలని నినాదాలు ఇస్తున్నారని, ఎన్డీయేకు 400 స్థానాలు వచ్చే దిశగా బీజేపీ 370 స్థానాలు పైగా గెలుచుకోవాలని ప్రధాని పిలుపు ఇచ్చారు.తాము మెగా స్కామ్‌లు, ఉగ్ర దాడుల నుంచి దేశాన్ని రక్షించామని యావత్ దేశం విశ్వసిస్తోందని అన్నారు. తాము పేదలు, మధ్యతరగతి ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు ప్రయత్నించామని చెప్పారు. అభివద్ధి చెందిన భారత్ ఆవిష్కరణ దిశగా రాబోయే ఐదేండ్లు కీలకమని అన్నారు.

2047 నాటికి భారత్‌ను అభివద్ధి చెందిన దేశంగా మలిచేందుకు అవసరమైన చర్యలను గత పదేండ్లలో చేపట్టామని ప్రధాని మోడీ వివరించారు. మనం అభివద్ధి చెందిన దేశంగా ఎదిగేందుకు ప్రతి ఒక్కరూ కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపు ఇచ్చారు.

అన్నదాతల సమస్యలపై అలసత్వం

ఎంఎస్‌పీపై సర్కారు కుంటిసాకులు

- ఆ మూడు పంటలకే మద్దతు ధరలు పరిమితం
- ఆర్థికంగా నష్టపోతున్న ఇతర పంటల రైతులు



న్యూఢిల్లీ : పోలీసులు, పారా మిలటరీ దళాలు ఎన్ని రకాలుగా నిర్బంధాలు పెడుతున్నప్పటికీ డిమాండ్ల సాధన కోసం దేశ రాజధానిలో ప్రవేశించేందుకు అన్నదాతలు కృతనిశ్చయంతో ప్రయత్నిస్తున్నారు. మూడు సంవత్సరాల క్రితం రైతులు సాగించిన సుదీర్ఘ పోరాటం ఇప్పుడు మళ్లీ గుర్తుకు వస్తోంది. అయితే ప్రస్తుతం రైతులు చేస్తున్న డిమాండ్లలో కొంత తేడా ఉంది. ఆ నాడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలంటూ రైతన్నలు ఆందోళన జరిపిన విషయం తెలిసిందే. ఇప్పుడు మాత్రం పంటల కనీస మద్దతు ధరలకు (ఎంఎస్‌పీ) చట్టపరంగా గ్యారంటీ ఇవ్వాలని వారు ప్రధానంగా కోరుతున్నారు. దీనితో పాటు రుణమాఫీ, పెన్షన్, ఉపాధి హామీ చట్టంలో అదనపు నిబంధనలు వంటి ఇతర డిమాండ్లను కూడా వారు ముందుకు తెస్తున్నారు. గ్రామీణ ఉపాధిని, దేశ ప్రజలకు సంబంధించిన అనేక అంశాలను కూడా వారు తమ నిరసన పరిధిలో చేర్చారు.

అన్నదాతల్లో 85% మంది చిన్న కమతాలు కలిగిన వారే. వీరు అరకొర ఆదాయంతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. వీరికి ఐదు ఎకరాల కంటే తక్కువ భూమే ఉంది. ఇక మిగిలిన రైతులు కూడా కేవలం వ్యవసాయం పైనే ఆధారపడి లేరు. వీరిలో చాలా మంది వ్యవసాయ సంబంధమైన వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీనిని బట్టి అర్థమవుతోంది ఏమంటే రైతులు కేవలం వ్యవసాయ ఆదాయంతోనే మనుగడ సాగించడం లేదు.

ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడం వల్లనే రైతులు రాజధాని వైపు కదిలారు. 2022లో ఇచ్చిన హామీలే అమలుకు నోచుకోకపోవడంతో ప్రభుత్వంపై రైతులకు విశ్వాసం కలగడం లేదు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీకి నేటికీ అతీగతీ లేదు. ఎంఎస్‌పీ, వ్యవసాయ సంస్కరణలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీపై రైతులెవ్వరూ ఆశలు పెట్టుకోవడం లేదు. ఎందుకంటే దానిని బీజేపీ అనుకూల సభ్యులతో నింపేశారు. రైతు సంఘాలన్నీ దానిని బహిష్కరించాయి.

ప్రభుత్వం ఏం చెబుతోంది?

ఉత్పత్తి వ్యయాన్ని పూర్తిగా పరిగణనలోకి తీసుకొని అన్ని పంటలకూ ఎంఎస్‌పీని కల్పించాలన్న రైతుల డిమాండ్‌ను ప్రభుత్వం వ్యతిరేకిస్తోంది. అలా ఇచ్చినప్పుడే తాము నష్టాల బారి నుండి లాభాల బాట పడతామని రైతన్నలు చెబుతున్నారు. అయితే ఈ ప్రధాన డిమాండ్‌ను వ్యతిరేకించడానికి ప్రభుత్వం కొన్ని కారణాలు చూపుతోంది. అవేమిటంటే... దీనివల్ల రూ.10 లక్షల కోట్లు ఖర్చు అవుతుంది. రైతులు పండించిన మొత్తం పంటను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇది పాలనాపరంగా సాధ్యం కాదు. ప్రైవేటు వ్యాపారులు కొనుగోళ్లు ఆపేస్తారు. దీనివల్ల రైతులు నష్టపోతారు. ప్రస్తుతం ధాన్యం, గోధుమలను మాత్రమే ప్రభుత్వం సేకరిస్తోంది. అలాంటప్పుడు ఇతర పంటలకు ఎంఎస్‌పీ ఎలా అమలు చేస్తారు? బడా రైతులకు మాత్రమే ఎంఎస్‌పీ లభిస్తుంది. డబ్ల్యూటీఓలో సమస్యలు ఎదురవుతాయి.....ఇవన్నీ ప్రభుత్వం చెబుతున్న కారణాలు.

ఆ మూడు పంటలపైనే దృష్టి

ఇప్పుడు వాస్తవాలేమిటో పరిశీలిద్దాం. ప్రస్తుతం 23 పంటలకు ఎంఎస్‌పీ వర్తిస్తోంది. కానీ వరి, గోధుమ పంటలకు మాత్రమే అమలవుతోంది. చెరకు పండించే రైతులకు చక్కెర మిల్లులు ధర చెల్లిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో వరి, గోధుమ, చెరకు పంటలకు అక్కడి వాతావరణం అనుకూలంగా లేకపోయినా రైతులు వాటినే సాగు చేస్తున్నారు. ఈ పంటలకే కనీస ధర లభించడం దీనికి కారణం. ఉదాహరణకు మహారాష్ట్రలో నీటి ఎద్దడి అధికంగా ఉండే ప్రాంతాల్లో చెరకును సాగు చేస్తున్నారు. పంజాబ్‌లో వరి పంట పరిస్థితి కూడా అదే. ఫలితంగా వరి, గోధుమ, చెరకు పంటల ఉత్పత్తి అవసరమైన దాని కంటే అధికంగా ఉంటోంది. ప్రభుత్వం వద్ద నిల్వలు పేరుకుపోతున్నాయి. స్టోరేజీ సౌకర్యాలు సరిగా లేకపోవడంతో వృథా జరుగుతోంది. పంట ఉత్పత్తుల సేకరణ, నిల్వ, ప్రజా పంపిణీ వ్యవస్థ కోసం విడుదల చేయడం వంటి పనుల కోసం ఎఫ్‌సీఐకి పెద్ద మొత్తంలో సబ్సిడీ ఇవ్వాల్సి వస్తోంది. ఈ పరిస్థితికి ఏకైక కారణం ఆ మూడు పంటలకు మాత్రమే మద్దతు ధర లభించడం.

> **ప్రభుత్వ సేకరణ ఎప్పుడు?**
>
> ధరలు ఎంఎస్‌పీ కంటే తక్కువగా ఉన్నప్పుడే ప్రభుత్వ సేకరణ అవసరం అవుతుంది. అధిక ఉత్పత్తి జరగకపోయినట్లయితే పంటల ధరలు ఎంఎస్‌పీ కంటే ఎక్కువగా ఉంటాయి. దేశంలో కరువు కాటకాలు సంభవించినప్పుడు, ఆకలి కేకలు వినిపించినప్పుడు, ధరలు ఆకాశాన్ని తాకినప్పుడు ప్రభుత్వం పంట మొత్తాన్నీ కొనుగోలు చేస్తుంది. ఆహార ధరలు తక్కువగా ఉండాలని సర్కారు కోరుకుంటుంది. అప్పుడు కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లించవచ్చు. ఫలితంగా వ్యాపారులకు అధిక లాభాలు వస్తాయి. చౌకగా పనివారు లభించాలని కోరుకునే సంపన్నులు లాభాలు మూటకట్టుకుంటారు

అన్ని పంటలకూ వర్తింపచేస్తే...

అన్ని పంటలకూ ఎంఎస్‌పీని వర్తింపజేస్తే వాతావరణానికి అనుకూలించే పంటలనే రైతులు పండిస్తారు. దీనివల్ల కొన్ని పంటల ఉత్పత్తుల నిల్వలు పేరుకు పోవడాన్ని నివారించవచ్చు. కొన్ని పంట ఉత్పత్తులను పెద్ద ఎత్తున నిల్వ చేయాల్సిన అవసరం ఉండదు. దేశంలో చమురు గింజల సరఫరా తక్కువగా ఉన్నందున ఆ పంటల ఉత్పత్తిని పెంచుకోవచ్చు. కొన్ని పంట ఉత్పత్తులను దిగుమతి చేసుకువాల్సిన అవసరం కూడా ఉండదు. ఫలితంగా విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. పంట ఉత్పత్తులను నిల్వ చేసేందుకు అందుబాటులో ఉన్న స్థలం ఇతర పంటలకు లభిస్తుంది.

డిమాండ్, సరఫరాలే కీలకం


ఎంఎస్‌పీ కంటే వ్యవసాయ ఉత్పత్తుల ధరలు ఎందుకు తక్కువగా ఉంటున్నాయి? వ్యవసాయోత్పత్తుల ధరలను డిమాండ్, సరఫరా నిర్ధారిస్తాయి. ఉదాహరణకు పంట కోతల తర్వాత ఉత్పత్తులు వరదలా మార్కెట్‌లోకి వచ్చి పడతాయి. ఫలితంగా ధరలు పడిపోతాయి. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ప్రభుత్వం ఉచితంగా రేషన్ అందిస్తున్నప్పటికీ దేశంలో 30% మంది మహిళలు, చిన్నారులు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. పేదరికం అధికంగా ఉండడంతో డిమాండ్ తగ్గిపోతోంది. దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. ధరలు తక్కువగా ఉండడంతో 2022లో రైతులు రూ.14 లక్షల కోట్లు నష్టపోయారని ఓ సర్వే చెబుతోంది. రైతులకు అందజేస్తున్న సబ్సిడీకి ఇది మూడున్నర రెట్లు అదనం. అందుకే ఎంఎస్‌పీ, సేకరణ, పంపిణీ అనేవి కీలకంగా మారాయి.

> **వ్యవసాయ సబ్సిడీలు తగ్గించొచ్చు**
>
> జీవనానిని అవసరమైన వేతనాలకు రాజ్యాంగం హామీ ఇస్తోంది. అదే లభిస్తే వ్యవసాయోత్పత్తులు పెరుగుతాయి. వాటి ధరలు ఎంఎస్‌పీ కంటే ఎక్కువగా ఉంటాయి. అప్పుడు రైతన్నలు వ్యవసాయ కార్మికులకు మంచి వేతనాలు అందించగలుగుతారు. అయితే అధిక వేతనాలు, ధరలు ద్రవ్యోల్బణ పెరుగుదలకు కారణమవుతాయి. పరోక్ష పన్నులను తగ్గించి, ప్రత్యక్ష పన్నులను పెంచడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు. అంతా సజావుగా ఉంటే వ్యవసాయ సబ్సిడీలను తగ్గించవచ్చు. ఆ మొత్తాన్ని విద్య, ఆరోగ్యం, ప్రజా పంపిణీ వ్యవస్థ, మౌలిక సదుపాయాలకు మళ్లించవచ్చు.

> **పారిశ్రామిక రంగంపై ప్రేమ**
>
> సబ్సిడీలు అవాంఛనీయమని కొందరు చెబుతారు. కానీ విద్య, ఆరోగ్యం తదితర రంగాలకు అవి ఎంతో అవసరం. కానీ ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఉదాహరణకు పీఎల్ఐ పథకం ద్వారా ప్రభుత్వం బడా కార్పొరేట్ సంస్థలకు సబ్సిడీలు ఇస్తోంది. వాస్తవానికి వాటికి అవి అవసరం లేదు. వీటినే పన్ను వ్యయాలు అంటారు. 2021లో ఈ పద్దు కింద రూ.448 లక్షల కోట్లు ఖర్చు చేశారు. భూమి, నీరు, విద్యుత్‌తో వ్యాపారం చేసే వారికి సబ్సిడీలు ఇస్తున్నారు.
>
> యూరప్‌లో కూడా కార్మికులు డిమాండ్ల సాధన కోసం రోడ్లు, రహదారులను దిగ్బంధిస్తున్నారు. ప్రభుత్వాలు బడా వ్యాపారులు, కార్పొరేట్ సంస్థలపై ప్రేమ కురిపించడానికి బదులు మెజారిటీ వర్గంగా ఉన్న ప్రజల సంక్షేమంపై దృష్టి సారిస్తే సత్ఫలితాలు లభిస్తాయి.
>
> రైతులు వ్యవసాయేతర రంగాల్లో ఉపాధిని వెతుక్కోవాలని ఉచిత సలహాలు ఇస్తున్నారు. అయితే యాంత్రీకరణ, ఆటోమేషన్, ఇప్పుడు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం కారణంగా వ్యవసాయేతర రంగంలో ఉపాధి లభించడం కష్టమైపోతోంది. అసంఘటిత రంగంలో కంటే సంఘటిత రంగంలో పని చేసే కార్మికుడు 19 రెట్లు అధికంగా ఉత్పత్తిని అందిస్తాడు.

పాస్‌వర్డ్ కోసం బలవంతం చేయకూడదు

- ఢిల్లీ హైకోర్ట్ కీలక తీర్పు
- గతంలో భిన్నమైన తీర్పులు ఇచ్చిన కర్నాటక, కేరళ న్యాయస్థానాలు



న్యూఢిల్లీ : డిజిటల్ ఆధారానికి సంబంధించిన పాస్‌వర్డ్‌ను వెల్లడించాల్సిందిగా నిందితుడిని బలవంతం చేయకూడదని ఢిల్లీ హైకోర్టు ఇటీవల తీర్పు చెప్పింది. సంకేత్ భద్రేష్ మోడీ, సీబీఐ మధ్య నడుస్తున్న ఓ కేసులో న్యాయస్థానం ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది. వ్యక్తులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, మానవ హక్కులను ముఖ్యంగా గోప్యతకు సంబంధించిన హక్కును ఈ తీర్పు పరిరక్షించిందని న్యాయ నిపుణులు అభిప్రాయపడ్డారు. మరో కేసులో కర్నాటక హైకోర్టు ఇచ్చిన తీర్పుకు ఇది భిన్నంగా ఉండడం గమనార్హం.

గతంలో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పుకు కూడా ఢిల్లీ కోర్టు తీర్పు భిన్నంగానే ఉంది. నిందితుడి మొబైల్ ఫోన్‌లో ఉన్న సమాచారాన్ని తీసుకునే హక్కు ప్రాసిక్యూషన్‌కు ఉన్నదంటూ కేరళ హైకోర్టు ఓ కేసులో రూలింగ్ ఇచ్చింది. అలా తీసుకోవడం ఆర్టికల్ 20 (3) ప్రకారం రాజ్యాంగపరమైన హక్కును ఉల్లంఘించినట్లు కాదని స్పష్టం చేసింది. ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకునే సమయంలో పాటించాల్సిన మార్గదర్శకాలపై ఆదేశాలు జారీ చేయాలంటూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు ఇప్పటికే పెండింగులో ఉన్నాయి.

ఏమిటీ కేసు ?

ఈ-సంపర్క్ సాఫ్‌టెక్ కంపెనీ, దాని డైరెక్టర్లు భారత్‌లోని మోసపూరిత కాల్ సెంటర్ల నుండి అమెరికా పౌరులకు 20 మిలియన్ డాలర్ల విలువ కలిగిన ఫోన్ కాల్స్ చేసి, కుంభకోణానికి పాల్పడ్డారని సీబీఐ అభియోగాలు మోపింది.

ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ కంపెనీ డైరెక్టర్‌గా ఉన్న సంకేత్ భద్రేష్ మోడీ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిని సీబీఐ వ్యతిరేకించింది. కుంభకోణానికి నిందితుడే సూత్రధారి అని, ఆయన తన ఎలక్ట్రానిక్ పరికరాలు, ఈ-మెయిల్ ఖాతాలు, క్రిప్టో వాలెట్ ఖాతాలకు సంబంధించిన పాస్‌వర్డ్‌లను అందజేయలేదని తెలిపింది. అయితే లాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల చుట్టూనే ఈ కేసు నడుస్తోందని, వాటిని ఇప్పటికే దర్యాప్తు సంస్థ స్వాధీనం చేసుకున్నదని న్యాయమూర్తి బెనర్జీ గుర్తు చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం నిందితుడికి బెయిల్ మంజూరు చేశారు. పౌరులకు ఆర్టికల్ 20 (3) కింద రాజ్యాంగపరంగా లభించిన రక్షణకు దర్యాప్తు సంస్థలు ఆటంకం కలిగించరాదని చురక వేశారు.

అవ్‌దీవ్‌కా నగరం నుంచి ఉక్రెయిన్ ఉపసంహరణ



మాస్కో: అవ్‌దీవ్‌కా నగరం పూర్తిగా రష్యా సైన్యం వశమైందని రష్యా రక్షణ శాఖ శనివారం నాడు ప్రకటించింది. ఉపసంహరించుకునే క్రమంలో ఉక్రెయిన్ సైనికులు తమ ఆయుధాలను,సాయుధ సామాగ్రిని తరలించు కోవటం సాధ్యపడలేదు. ఆ క్రమంలో దాదాపు 1500 మంది ఉక్రెయిన్ సైనికులు తమ ప్రాణాలను కోల్పోయారు. దీనితో యుద్ధ క్షేత్రం డోనెస్క్ నగరానికి మరింత దూరం జరిగినట్టయింది. ఇది ఆ నగర ప్రజలకు ఉక్రెయిన్ బాంబు దాడుల నుంచి ఉపశమనంగా మారనుంది. ఉక్రెయిన్ నూతన సైన్యాధ్యక్షుడు పశ్చిమ దేశాలలో శిక్షణ పొందిన ఎలైట్ సైనికులను పంపినప్పటికీ అవ్‌దీవ్‌కా నగరంపైన పట్టును నిలుపుకోవటం సాధ్యపడలేదని, అందుకే ఉపసంహరణకు ఆదేశించామని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాడీమీర్ జెలెన్‌స్కీ ఒక ప్రకటనలో తెలిపాడు. రష్యా సైన్యం అన్నివైపుల నుంచి చుట్టుముట్టడటంతో ఉపసంహరణ తప్ప మరో మార్గం లేదని ఆయన అన్నాడు.

అవ్‌దీవ్‌కా నగరాన్ని వశపర్చుకున్నాక డోనెస్క్ ప్రాంతాన్ని మరింతగా ఉక్రెయిన్ నుంచి విముక్తం చేసే పనిలో రష్యా సైన్యం ఉంటుందని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అవ్‌దీవ్‌కాను విముక్తంగావించటంలో రష్యా సైనిక దళాలు గొప్ప విజయాన్ని సాధించాయని "సెంటర్" గ్రూపు కమాండర్ జనరల్ అంద్రే మోర్ద్విచేవ్‌కు ఇచ్చిన టెలిగ్రాంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ ప్రశంసించాడు. అవ్‌దీవ్‌కా నగరంలో జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్ ఓడిపోతుందని అనేక వారాలుగా అమెరికా అధికారులు, పశ్చిమ దేశాల జర్నలిస్టులు ఊహిస్తూనే ఉన్నారు. పశ్చిమ దేశాల నుంచి అందవలసిన సహాయం అందకనే ఉక్రెయిన్ అవ్‌దీవ్‌కా నగరాన్ని కోల్పోనున్నదని గత వారారంభంలో అమెరికా అధ్యక్ష భవన జాతీయ భద్రతా మండలి అధికార ప్రతినిధి జాన్ కిర్బీ నిందించాడు. ఈ ఓటమికి కారణం పశ్చిమ దేశాలు సష్టించిన "ఆయుధాల కత్రిమ కొరత" అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా అన్నాడు. అమెరికా అందించవలసిన 60 బిలియన్ డాలర్ల సైనిక సహాయం అందకపోతే అవ్‌దేవ్‌కాలో జరిగినట్టి పరాజయం ఉక్రెయిన్‌కు అనేక చోట్ల ఎదురౌతుందని ఒక అమెరికా రక్షణ శాఖాధికారి మీడియాతో మాట్లాడుతూ చెప్పాడు.

గాజాకు అందే సహాయాన్ని అడ్డుకుంటున్న ఇజ్రాయిల్ : అమెరికా దౌత్యవేత్త



గాజా: గాజాకు అందించే మానవతా సహాయాన్ని కూడా అక్కడి ప్రజలకు చేరకుండా వివిధ రూపాల్లో ఇజ్రాయిల్ అడ్డుకుంటోందని జో బైడెన్ పాలనా యంత్రాంగం ఆరోపిస్తోంది. నిజానికి ఈ విమర్శ అత్యంత అరుదైనదిగా భావించవచ్చు. ఇజ్రాయిలీ వైమానిక దాడుల్లో పాలస్తీనా పోలీసులు చనిపోవటంతో సహాయ సామాగ్రిని తీసుకువచ్చే వాహనాలకు రక్షణ కరువైందని, అవి క్రిమినల్ గుంపుల పాలవుతున్నాయని మానవతా సమస్యల పైన మధ్యప్రాచ్యంలో ప్రత్యేక దౌత్యవేత్తగా వ్యవహరిస్తున్న డేవిడ్ షట్టర్‌ఫీల్డ్ అన్నాడు. ఇదే కాకుండా సరిహద్దు దాటి గాజాలోకి ప్రవేశిస్తున్నప్పుడు ఇజ్రాయిలీలు చేస్తున్న నిరసనలు కూడా గాజా ప్రజలకు సహాయాన్ని అందించటానికి అడ్డంకిగా ఉన్నాయి.

ఇటీవల కాలంలో ఇజ్రాయిల్ పాలస్తీనా పోలీస్ ఉద్యోగుల పైన, వాహనాలకు భద్రతను అందించే మిలిటరీ కమాండర్ పైన కూడా దాడులు చేయటంవలన గాజా ప్రజలకు సహాయాన్ని అందించే ఐక్యరాజ్య సమితి, ఇతర సంస్థలు తమతమ సహాయ కార్యక్రమాలను నిర్వహించటంలో ఇబ్బందుల్లో పడుతున్నాయని షట్టర్‌ఫీల్డ్ తన విచారాన్ని వెలిబుచ్చాడు. ఇప్పటికే గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో 35వేల మంది పాలస్తీనా ప్రజలు తమ ప్రాణాలను కోల్పోయారు. కనీసం ఒక లక్ష మంది గాయపడ్డారు. ఇజ్రాయిల్, హమస్ యుద్ధం పర్యవసానంగా గాజాలో నివసిస్తున్న ప్రజల్లో 85శాతం మంది స్థానభ్రంశం చెందారు. దాదాపు ఆరు లక్షల మంది ఆహారం అందక అలమటిస్తున్నారు.

సహాయ సామాగ్రిని తెచ్చే వాహనాలను దారి మరల్చి హమస్ మిలిటెంట్లు తమ అవసరాలకు వాడుకుంటున్నారని ఇజ్రాయిల్ చేస్తున్న విమర్శకు సాక్ష్యం ఏమీ లేదని ఐక్యరాజ్య సమితి ఏజన్సీలతోపాటు షట్టర్‌ఫీల్డ్ కూడా అన్నాడు. ఇజ్రాయిల్ బాంబు దాడలవల్ల గాజాలో నివసిస్తున్న 14లక్షలమంది పాలస్తీనా ప్రజలు కాందిశీకులుగా మారి అత్యంత ఘోరమైన పరిస్థితులలో దక్షిణ సరిహద్దులోని రఫా నగరంలో నివసిస్తున్నారు. రఫా నగర జనాభా మూడు లక్షలకు లోపే ఉంటుంది. దీనినిబట్టి కాందిశీకులుగా మారిన గాజా ప్రజలు ఎటువంటి జీవన పరిస్థితులలో జీవిస్తున్నారో ఊహించుకోవచ్చు.

జవాన్‌ను గొడ్డలితో నరికి హత్య

- బీజాపూర్ జిల్లాలో మావోయిస్టుల ఘాతుకం



నవతెలంగాణ-చర్ల

సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు ఘాతుకానికి వడిగట్టారు. వారాంతపు సంతలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ జవాన్‌ను ఆదివారం ఉదయం మావోయిస్టులు గొడ్డలితో అత్యంత కిరాతకంగా నరికి హతమార్చారు. బీజాపూర్ జిల్లా ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. సీఏఎఫ్ కంపెనీ కమాండర్ తేజరామ్ భూర్య కుట్రు పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్నారు. అయితే మావోయిస్టులు తమ ఉనికి చాటుకునేందుకే జవాన్లపై దాడి చేయడమే కాక, ఒక జవాన్‌ను అత్యంత కిరాతకంగా గొడ్డలితో నరికి చంపారని ఎస్పీ తెలిపారు. కాగా, ఘటన అనంతరం పోలీసులు అడవిని జల్లెడపడుతున్నారు.

జార్ఖండ్ సంకీర్ణ కూటమిలో లుకలుకలు..

- ఢిల్లీకి కాంగ్రెస్ ఎమ్మెల్యేల పంచాయితీ



రాంచీ : జార్ఖండ్‌లోని సంకీర్ణ కూటమిలో లుకలుకలు ప్రారంభమయ్యాయి. ఎనిమిది మంది అసంతృప్త కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ నిరసన తెలిపేందుకు ఢిల్లీకి చేరుకున్నారు. ఇటీవల జార్ఖండ్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంపాయి సోరెన్ మంత్రిమండలి విస్తరణ చేపట్టారు. గతంలో మంత్రులుగా పనిచేసిన నలుగురు ఎమ్మెల్యేలకు తిరిగి మంత్రి పదవులు అప్పగించడంపై ఆ రాష్ట్ర కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లోని ఓ వర్గం అసంతృప్తి వ్యక్తం చేసింది. 23నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాలను సైతం బహిష్కరిస్తామని అసంతృప్త ఎమ్మెల్యేలు ప్రకటించారు. ఆ నలుగురిని తొలగించకుంటే జైపూర్‌కు వెళతామని బెదిరించారు. ఇప్పటికే ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఢిల్లీకి చేరుకుని కాంగ్రెస్ హైకమాండ్‌కు విన్నవించినట్టు సమాచారం.

81మంది సభ్యుల రాష్ట్ర అసెంబ్లీలో జేఎంఎం నేతృత్వంలోని కూటమికి 47 మంది ఎమ్మెల్యేలు (జేఎంఎం 29, కాంగ్రెస్ 17, ఆర్జేడీకి ఒకరు) ఉన్నారు. ఆలంగీర్ ఆలం, రామేశ్వర్ ఓరాన్, బన్నా గుప్తా, బాదల్ పత్రలేఖ్‌లకు తిరిగి మంత్రి పదవులను కట్టబెట్టడంపై 12 మంది ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో గత శుక్రవారం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని బహిష్కరించేందుకు సిద్ధమయ్యారు. అయితే జార్ఖండ్ కాంగ్రెస్ ఇన్‌చార్జి గులాం అహ్మద్ మీర్, పీసీసీ చీఫ్ రాజేష్ ఠాకూర్‌ల బుజ్జగింపులతో వెనక్కి తగ్గారు. అయితే వారిని తొలగించాల్సిందేనని పట్టుబడుతున్నారు.

రాష్ట్రంలోని ఐదు డివిజన్లకు ఒక్కో డివిజన్ నుంచి ఒక మంత్రిని తీసుకోవాలని కోరుతున్నాం. అలాగే 'ఒకే వ్యక్తి, ఒకే పదవి' అన్న రాహుల్ గాంధీ నిబంధనను కూడా అమలు చేయాలని కోరుతున్నామని అనూప్ సింగ్ అనే ఎమ్మెల్యే తెలిపారు. గడిచిన నాలుగేండ్లుగా మాకు ఇచ్చిన కోటాపై అసంతృప్తితో ఉన్నామని, అయితే చంపాయి సోరెన్ నేతృత్వంలో కొత్త మంత్రి వర్గం ఏర్పాటు కానుండటంతో .. కొత్తవారిని తీసుకుంటారని ఆశించామని అన్నారు.




రేషన్ బస్తాలపై మోడీ చిత్రం కోసం కోట్లు వ్యయం

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద ఆహారధాన్యాల పంపిణీకి ఉపయోగించే బస్తాలపై నరేంద్ర మోడీ చిత్రం ముద్రించేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. మోడీ చిత్రంతో కూడిన ప్రత్యేక సంచులను ముద్రించాలని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ యూనిట్లను ఆదేశించింది. రాజస్థాన్‌లోనే 13.29 కోట్ల సింథటిక్ బ్యాగులను ఆర్డర్ చేశారు. మోడీ చిత్రాన్ని ముద్రించేందుకు ఒక్కో బ్యాగ్‌కు అదనంగా రూ.12.37 కాగా.. నాగాలాండ్ ఒక్కో బ్యాగ్‌కు రూ.9.30 చొప్పున కాంట్రాక్ట్ ఇచ్చింది. తమిళనాడులో 1.14 కోట్ల బస్తాలకు టెండర్ పిలిచారు. రేషన్ షాపుల్లో ప్రధాని నరేంద్ర మోడీ కటౌట్‌తో కూడిన సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను కేరళ తిరస్కరించింది. కోవిడ్-వ్యాక్సినేషన్ సర్టిఫికెట్‌పై ప్రధాని ఫోటోను ముద్రించడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే.

డ్రోన్‌ల లక్ష్యం

రైతుల నిరసన మాత్రమే కాదు

- టియర్ గ్యాస్ షెల్‌ల వినియోగం కూడా
- అన్నదాతల నిరసనల్లో భద్రతా దళాల తీరు



న్యూఢిల్లీ : మంగళవారం నాడు అంబాలాలోని శంభు సరిహద్దులో వేలాది మంది రైతులు తమ డిమాండ్‌ల కోసం ఢిల్లీకి మార్చ్‌కు తరలి వచ్చారు. నిరసనకారులను చెదరగొట్టడానికి భద్రతా దళాలు టియర్ గ్యాస్ షెల్‌లను వదలటానికి డ్రోన్‌లను ఉపయోగించాయి. "డ్రోన్ల నుంచి షెల్స్ జారిపోతున్నాయని మేము మొదట అర్థం చేసుకోలేకపోయాం. చాలా శబ్దం ఉన్నది కాబట్టి మేము డ్రోన్ శబ్దాన్ని కూడా వినలేకపోయాము. కానీ అప్పుడు ఎవరో గుండ్లు మాపై నుంచి విసిరివేస్తున్నారు. ముందు నుంచి కాదు" అని సైట్లో ఉన్న రైతు తేజ్వీర్ సింగ్ చెప్పారు. టియర్ గ్యాస్ షెల్స్‌ను వదలటానికి పోలీసులు డ్రోన్‌లను ఉపయోగించిన భారతదేశంలో మొదటి సంఘటనగా ఇది నివేదించబడింది. అయితే, ఇటీవలి సంవత్సరాలలో భారత్‌లో భద్రతా దళాల ద్వారా డ్రోన్ల వినియోగం పెరిగింది. ఇది పౌరుల గోప్యత గురించి ఆందోళన కలిగిస్తుందని నిపుణులు అంటున్నారు.

డ్రోన్‌ల విస్తృత వినియోగం

శంభు సరిహద్దులో రైతులు డ్రోన్‌లను గుర్తించినప్పుడు, నిరసనకారులను గుర్తించటానికి వాటిని ఏరియల్ కెమెరాలుగా ఉపయోగిస్తున్నారని రైతు నిరసనకారులు తెలిపారు. ప్రభుత్వం డ్రోన్ ఇమేజింగ్ అండ్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ ఆఫ్ హర్యానా లిమిటెడ్ లేదా 2021లో ప్రారంభించబడిన పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ ద్వారా తయారు చేయబడిన డ్రోన్‌లను ఉపయోగించిందని హర్యానా పోలీసు అధికారి ఒకరు చెప్పారు. ఈ డ్రోన్‌లు సాధారణంగా ప్రయోజనం కోసం ఉపయోగించే తుపాకుల కంటే ఎక్కువ శ్రేణి టియర్ గ్యాస్ షెల్‌లను కాల్చే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని హర్యానా పోలీసు అధికారి ఒకరు తెలిపారు. 2019లో, పౌరసత్వ సవరణ చట్టానికి(సీఏఏ) వ్యతిరేకంగా జరిగిన నిరసనల సందర్భంగా నిరసనకారులను గుర్తించటానికి ఢిల్లీ పోలీసులు డ్రోన్‌లపై అమర్చిన కెమెరాలను ఉపయోగించారు. ఫిబ్రవరి 2020లో ఢిల్లీలో జరిగిన హింసాకాండలో డ్రోన్‌లను కూడా ఉపయోగించారు. హింస సమయంలో పోలీసింగ్ కోసం డ్రోన్‌లను ఉపయోగించడంపై సమాచార హక్కు అభ్యర్థనకు ప్రతిస్పందనగా.. ఢిల్లీ పోలీసులు మార్గదర్శకాలు, నియమాలు లేదా ప్రామాణిక కార్యాచరణ విధానాలు ఉన్నాయా అనే దానిపై స్పందించకపోవటం గమనార్హం.

'రామరాజ్యం' అమలు భేష్

- ప్రధాని మోడీని అభినందిస్తూ బీజేపీ తీర్మానం

న్యూఢిల్లీ : గత 10 సంవత్సరాలుగా భారత్‌లో 'రామరాజ్యం' అనే ఆదర్శ వంతమైన పాలనను సమర్థవంతంగా అమలు చేసినందుకు ప్రధాని మోడీని బీజేపీ అభినందించింది. ఈ మేరకు శనివారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. "వికసిత్ భారత్ - మోడీ గ్యారంటీ" పేరుతో రూపొందించిన తీర్మానం.. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రెండు సార్లు ఉన్న సమయంలో భారత ఆర్థిక పురోగతి విషయంలో మోడీని ప్రశంసిం చింది. దేశరాజధాని న్యూఢిల్లీలో జరిగిన బీజేపీ జాతీయ కౌన్సిల్ సమావేశంలో ఈ తీర్మానాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బలపరిచారు. యూపీ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ కూడా తీర్మానానికి మద్దతుగా మాట్లాడారు. మోడీ నాయకత్వంలో, శ్రీరాముని ఆలయాన్ని నిర్మించటమే కాకుండా, అతను గత 10 సంవత్సరాలలో రామ రాజ్య భావనను కూడా సమర్థవంతంగా అమలు చేసాడని తీర్మానం పేర్కొనటం గమనార్హం.

పనులు వేగవంతం చేయాలి


- డాక్టర్ మల్లు రవి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పనులు వేగంగా పూర్తి చేయాలని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఢిల్లీలో ఆయన అధికారులతో సమావేశమై శాఖల వారీగా చర్చించారు. పెండింగ్ పనుల పూర్తిపై ప్రత్యేక కార్యచరణ రూపొందించాలని సూచించారు. నీటిపారుదల, మున్సిపల్, పట్టణాభివృద్ధి తదితర శాఖలతో సమీక్షించిన మల్లు రవి, పెండింగ్ అనుమతులు, తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, క్లియరెన్స్‌లపై ఆరా తీశారు. తగిన సమాచారాన్ని సిద్ధం చేసుకుని కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అనుమతులను వెంటనే సాధించాలని సూచించారు.

ఇమామ్‌పేట గురుకులంలో..

- మరో విద్యార్థిని ఆత్మహత్య



నవతెలంగాణ-మోతె

సూర్యాపేట మండలం ఇమాంపేట గురుకుల పాఠశాలలో ఐదు రోజుల కింద ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మరువకముందే అదే గురుకులంకు చెందిన మరో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని మోతె మండలం బురకచర్ల గ్రామానికి చెందిన ఇరుగు ఆనంద్, జ్యోతిల కుమార్తె హస్మిత(15) ఇమాంపేట గురుకులంలో పదవ తరగతి చదువుతోంది. కాగా, తన తండ్రి మరణించడంతో బతుకుతెరువు కోసం ఆమె తల్లి జ్యోతి హైదరాబాద్‌లో పనిచేసుకుంటూ జీవిస్తోంది. కాగా, ఇమాంపేట గురుకులంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కళాశాలలో ఫేర్వెల్ పార్టీ రోజు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దాంతో విద్యార్థులు భయపడకుండా స్కూల్‌కి కొన్ని రోజులు సెలవులు ప్రకటించడంతో హైదరాబాద్‌లోని తన తల్లి దగ్గరికి అస్మిత వచ్చింది. అస్మిత ఇంటికి వచ్చినప్పటి నుంచి పాఠశాలకు వెళ్లాలంటే భయం వేస్తోందని, వెళ్లనని తల్లితో చెబుతూ వస్తోంది. కాగా, శనివారం తల్లి జ్యోతి పనికి వెళ్లిన సమయంలో అస్మిత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పని నుంచి తిరిగి వచ్చిన జ్యోతి ఇంట్లోకెళ్లి చూడగా.. అస్మిత విగతజీవిగా పడి ఉండటంతో కన్నీరుమున్నీరయింది. సెలవులు ముగియడంతో పాఠశాలకు వెళ్లాల్సిన అస్మిత.. ఇలా ఆత్మహత్య చేసుకోవడం గురుకుల విద్యార్థులను విషాదంతో ముంచింది. కాగా, శనివారం మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి బుర్కచర్ల గ్రామానికి తీసుకొచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియాస్పత్రికి తరలించారు.

పుస్తక జాతరకు భారీ స్పందన

- నేటితో ముగియనున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్
- 7 లక్షల మంది పుస్తక, సాహితీ ప్రియులు, విద్యార్థుల సందర్శన
- యువతీయువకులతో కళకళలాడుతున్న స్టాల్స్
- నేడు మరో లక్షన్నర మంది సందర్శించే అవకాశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో పుస్తక జాతరకు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సాంకేతిక రంగం వేగంగా విస్తరిస్తున్న ఈ సమయంలోనూ.. పుస్తకప్రియులకు కొదవ లేదనేది కండ్లకు కట్టినట్టు కనబడుతున్న సత్యం. ఇంటర్నెట్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి ఇతర సామాజిక మాధ్యమాల్లో కావాల్సిన సమాచారం క్షణాల్లో దొరుకుతున్న ఈ తరుణంలో పుస్తకాల కోసం పుస్తక, సాహితీ ప్రియులు, యువతీయువకులు, విద్యార్థులు, ఇతర అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో బుక్ ఫెయిర్‌ను సందర్శించడం ఆకట్టుకుంటోంది. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 9న ప్రారంభమైన 36వ జాతీయ హైదరాబాద్ పుస్తక ప్రదర్శన నేటితో ముగియనుంది. ఈ పదిరోజుల్లో సుమారు 7లక్షల మంది సందర్శకులు బుక్ ఫెయిర్‌కు తరలివచ్చారు. వారిలో 2లక్షలకుపైగా చిన్నారులు, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కాలేజీల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర ప్రముఖులు ఉన్నారు. వీరందరికి ఉచిత ప్రవేశం కల్పించారు. ఇక పదో రోజు ఆదివారం సెలవు దినం కావడంతో పండుగ వాతావారణం కనిపించింది

'యువత' జోరు

బుక్‌ఫెయిర్‌లో ప్రధానంగా విద్యార్థులు, యువకులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇక్కడ ఏర్పాటు చేసిన దాదాపు 369 గ్రంథ విక్రయ కేంద్రాలను కలియతిరుగుతూ ఆద్యంతం సేదతీరారు. టెక్నాలజీ యుగంలో ఏదో తెలియని ఒత్తిడికి గురవుతున్న వారు ఇక్కడి రావడంతో మరో కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినంత ఆనందంలో మునిగిపోయారు. చాలా మంది తల్లిదండ్రులు వారి పిల్లలకు కావాల్సిన పుస్తకాలను కొనిచ్చారు. ప్రధానంగా పోటీపరీక్షల పుస్తక స్టాళ్లన్నీ యువతతో రద్దీగా కనపడుతున్నాయి. అలాగే కెరీర్, అకడమిక్, వ్యక్తిత్వవికాస పుస్తకాలతోపాటు ఫిక్షన్, నాన్‌ఫిక్షన్ పుస్తకాల కొనుగోలుకు మక్కువ చూపిస్తున్నారు. వీటితో పాటు ఇతర విక్రయ కేంద్రాల్లోని పలు పుస్తకాలకు మంచి ఆదరణ లభిస్తోంది. ఇందులో నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ స్టాల్‌లో ఉంచిన పుస్తకాల్లో చరిత్ర, అలిశెట్టి ప్రభాకర్, అమ్మ, ఇంగ్లీష్ టీచర్ వంటి పుస్తకాలకు మంచి ఆదరణ లభిస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఇతర పుస్తక ప్రచురణ సంస్థలు విభిన్న అంశాలపై వెలువరించిన పుస్తకాలకు గిరాకీ ఉందని చెబుతున్నారు. అలాగే పుస్తక ప్రదర్శన జరగుతున్న తీరు పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేసిన నిర్వాహకులను అభినందించారు.

మౌలిక సదుపాయల కల్పనలో లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేశాం

కె. బాల్ రెడ్డి, ఎం. సూరి బాబు, ఎగ్జిక్యూటీవ్ మెంబర్, హైదరాబాద్ బుక్ ఫెయిర్



హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో ఈ ఏడాది మౌలిక సదుపాయాల కల్పన, నిర్వహణ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఎప్పటికప్పుడు పకడ్బందీగా చర్యలు తీసుకుంటూ వచ్చాం. గతంలో కంటే ఈసారి 7 మరుగుదొడ్లు, 12 మూత్రశాలలు ఏర్పాటు చేశాం. స్టాల్స్‌కు స్టాల్స్ మధ్యలో గ్యాప్ 30 ఫీట్ల నుంచి 40 ఫీట్లకు పెంచాం. సందర్శకులు అన్ని స్టాల్స్ తిరిగేలా బారికేడ్లు ఏర్పాటు చేశాం. ఎండల తీవ్రత నేపథ్యంలో అందరికి చల్లటి నీరు అందిస్తున్నాం. రోజూ సాయంత్రం స్టాల్స్ నిర్వహకులకు స్నాక్స్ ఇస్తున్నాం. బుక్ ఫెయిర్‌లో మౌలిక సౌకర్యాలు, నిర్వహణకు సంబంధించి షాప్ హెూల్డర్స్ దగ్గర నుంచి సందర్శకుల వరకు సంతోషం వ్యక్తం చేశారు. నూతన కార్యదర్శి వాసు ఆధ్వర్యంలో బుక్ ఫెయిర్ అద్భుతంగా సాగుతోంది.

పారదర్శకంగా ప్రవేశ రుసుము టికెట్ల జారీ :

బి.శోభన్ బాబు, జాయింట్ సెక్రటరీ, హైదరాబాద్ బుక్ ఫెయిర్



బుక్ ఫెయిర్ ప్రవేశ టికెట్ల విషయంలో పారదర్శకంగా ఉండేలా ఎలక్ట్రానిక్ మెషిన్స్ ఉపయోగించాం. మూడు కౌంటర్లు ఏర్పాటు చేసి ఎలక్ట్రానిక్ పద్ధతిలో టికెట్లు జారీ చేశాం. క్యూ లైన్‌లో నిల్చుని టికెట్లు తీసుకునే వారికోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాం. టికెట్ల అమ్మకాలు బాగున్నాయి. పదేండ్ల లోపు పిల్లలకు, స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులకు ఎలాంటి రుసుము తీసుకోకుండా ఉచిత ప్రవేశం కల్పించాం. పెద్దసంఖ్యలో ఉచిత పాస్‌లు పంపిణీ చేశాం.

షెడ్యూల్ ప్రకారమే అన్ని కార్యక్రమాలు :

పి.నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు, హైదరాబాద్ బుక్ ఫెయిర్



హైదరాబాద్ నేషనల్ బుక్ ఫెయిర్‌లో రవ్వా శ్రీహరి వేదిక ఎంతో కీలకం. ఈ వేదికపై 11 రోజుల పాటు ప్రతిరోజూ జరిగే నూతన పుస్తకావిష్కరణలు, సాహిత్య, సంస్కృత, బాల వికాస్ కార్యక్రమాలు, రచయితల చర్చా గోష్టి, ఇతర కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాల్సి ఉంటుంది. అందరితో సమన్వయం చేసుకుంటూ ప్రోగ్రామ్స్ చేయాలి. ఈ వేదికపై ప్రతిరోజూ ఎనిమిది కార్యక్రమాలు జరుగుతున్నాయి. గెస్టులకు శాలువాలు, మెమొంట్‌లతో బుక్ ఫెయిర్ తరపున సన్మానిస్తాం.

ప్రమాదంలో రిజర్వేషన్లు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో రిజర్వేషన్లు ప్రమాదంలో పడ్డాయని, దళిత వర్గాలకు అన్యాయం యూజీసీ మాజీ చైర్మెన్ సుఖదేవ్ థోరాట్ విమర్శించారు. డీవైఎఫ్ఐ అఖిల భారత కమిటీ ఆధ్వర్యంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆదివారం పంజాబ్‌లోని చండీగఢ్ లో బాబా సోహన్ సింగ్ భక్న భవన్ లో జరిగిన దళిత యువ జాతీయ సదస్సులో సుఖదేవ్ థోరాట్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో దళిత వర్గాలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. రిజర్వేషన్లు ప్రమాదంలో పడ్డాయని పేర్కొన్నారు. అందులో భాగంగానే ఇటీవలి యూజీసీ ఎస్సీ, ఎస్టీ రిజర్వ్ పోస్టులు భర్తీకాకపోతే, వాటిని జనరల్ కేటగిరీలో కలిపివేయాలని నిర్ణయం తీసుకుందని విమర్శించారు. దీనిపై ప్రతిఘటన రావడంతో వెనక్కి తగ్గిందని పేర్కొన్నారు. మోడీ అనుసరిస్తూ మనువాద చర్యలు దళిత వర్గాలకు నష్టం చేస్తాయని పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం వంటి విధానాలతో దళిత విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని, దీన్ని తిప్పికొట్టాలని పిలుపు ఇచ్చారు. ఉపాధి రంగంలో కూడా దళితులకు ఆశించిన అవకాశాలు లేవని అన్నారు. వీటన్నింటి డీవైఎఫ్ఐ తిప్పికొట్టాలని పిలుపు ఇచ్చారు. డీవైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ ఎ రహీం, హిమెగ్నా రాజ్ భట్టాచార్య వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. మోడీ పాలనలో దళిత యువకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. దేశ వ్యాప్తంగా నిరుద్యోగం పెరిగిందని, దళిత యువతలో అది మరింత పెరిగిందని అన్నారు. ఇప్పటికి అనేక రూపాల్లో దళితుల పట్ల వివక్షత చూపుతున్నారని అన్నారు. అనేక రాష్ట్రాల్లో భౌతిక దాడులు చేసి హత్యలు చేస్తున్నారని విమర్శించారు. దేశంలో ప్రతి 18 నిమిషాలకు ఒక దాడి జరుగుతోందని పేర్కొన్నారు. ప్రతి వారానికి ఆరుగురు హత్యకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజూ ముగ్గురు దళిత మహిళలు హత్యాచారానికి గురవుతున్నారని అన్నారు. రోజుకు 27 చోట్ల దళితులపై దాడులు చేస్తున్నారని విమర్శించారు. దళిత యువతకు డీవైఎఫ్ఐ అండగా ఉంటుందని తెలిపారు. ప్రతి రాష్ట్రంలో టీం ఏర్పాటుచేయాలని, దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి చర్చల్లో పాల్గొన్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ దేశంలో మోడీ అధికారంలోకి వచ్చాక, మనువాద గుండాలు పెట్రేగి పోతున్నారని అన్నారు. మోడీ ప్రభుత్వాన్ని దళిత యువత ఓడించడంతోపాటు దళితుల పట్ల వివక్ష వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతం చేయాలని తీర్మానాన్ని డీవైఎఫ్ఐ అఖిల భారత ఉపాధ్యక్షులు జాక్ సీ థామస్ పెట్టారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రతినిధులు తిరుపతి,కృష్ణ వివిధ రాష్ట్రాల ప్రతినిధులు ,ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు రమణ, బాబు, పిచ్చయ్య, పాల్గొన్నారు.

రైతులపై దమనకాండ సరికాదు

(మొదటిపేజీ తరువాయి)

అన్ని స్వతంత్ర ప్రభుత్వ వ్యవస్థలనూ భ్రష్టు పట్టించారని వివరించారు. దేశంలో పత్రికా వ్యవస్థ అంబానీ గుప్పెట్లోకి వెళ్లి పోయిందన్నారు. పంజాబ్ మొత్తం జీడీపీ కన్నా అంబానీ సంపద ఎక్కువని, హర్యానా జీడీపీ కన్నా అదానీ ఆస్తులే ఎక్కువని వివరించారు. సుప్రీంకోర్టులో చాలాకాలం తరువాత మంచి తీర్పు వచ్చిందంటూ ఎలక్టోరల్ బాండ్ల రద్దు తీర్పును ప్రస్తావించారు. అయితే, తీర్పులో తీవ్ర జాప్యం జరిగిందన్నారు. ప్రతిపక్షాలకు ఎవరి నుంచీ విరాళాలు అందకుండా కట్టడి చేయడంలో భాగంగానే ఎలక్టోరల్ బాండ్లను మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. గత ఐదేండ్లలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుల్లో కేంద్రానికి అనుకూలంగా ఉన్నవే ఎక్కువగా వస్తున్నాయని, దీంతో, వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఏర్పడిందని పేర్కొన్నారు. కరోనా సమయంలో కేంద్రం కోర్టులో అనేక తప్పుడు అఫిడవిట్‌లు దాఖలు చేసిందన్నారు. 2020 మార్చి 31న వలసదారులు ఎవ్వరూ రోడ్లపై నడిచి వెళ్లడంలేదని తప్పుడు సమాచారం ఇచ్చిందని తెలిపారు.

లక్షలాది మంది రోడ్లపై వెళ్తున్నా చాలా తక్కువగా చూపే ప్రయత్నం కేంద్రం చేసిందన్నారు. కరోనా వల్ల 2022 మార్చి నాటికి 5.22 లక్షల మంది మాత్రమే చనిపోయారని ప్రధాని మోడీ ప్రకటించగా, ఇంతకంటే పది రెట్లు ఎక్కువగా మరణాలు సంభవించారని అంతర్జాతీయ జర్నల్స్, డబ్ల్యూహెచ్ఓ వెల్లడించాయని గుర్తు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని కాశీ, సరయూ నదుల్లో వేలాది మంది మృతదేహాలు కొట్టుకొచ్చినా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు. దైనిక్ భాస్కర్ పత్రిక వాస్తవాలు ప్రచురిస్తే, వెంటనే ఆ పత్రికపై ఈడీ, సీబీఐ, ఇన్‌కంట్యాక్సు దాడులు జరిగాయని తెలిపారు.

అనంతరం సుప్రసిద్ధ సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు పురస్కారాన్ని పి.సాయినాథ్‌కు మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, బీసీకే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు జయసుధ, ఎండి అక్బర్‌బాబు, ప్రముఖ గాంధేయవాది అనిల్ నౌరియా తదితరులు పాల్గొన్నారు.

మానవత్వమే ఆయన ఇజం

- ప్రకృతిని అర్థం చేసుకున్న వ్యక్తి : నలుగురికి విజ్ఞానాన్ని అందించేందుకు కృషి
- జేవీవీకి ఆయనో గుండెకాయ
- ఆ వేదిక కాగడా పట్టుకుని పనిచేశారు : ప్రొఫెసర్ ఆదినారాయణ సంస్మరణ సభలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జనవిజ్ఞాన వేదిక నాయకులు ప్రొఫెసర్ ఆదినారాయణ మానవత్వమే ఇజంగా చివరికంటూ బతికారని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదినారాయణ సంస్మరణ సభను జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) అధ్యక్షులు కోయ వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహిం చారు. సభలో ఆయన కుమారుడు అశోక్, వారి కుటుంబ సభ్యులు, జేవీవీ గౌరవా ధ్యక్షులు డాక్టర్ దాసరి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ తిర్మల్‌రావు, వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ జయప్రకాశ్, శాస్త్రవేత్త రాధ, జేవీవీ రాష్ట్ర నాయకులు బీఎన్‌రెడ్డి, వరప్రసాద్, రాజా, జితేంద్ర, హైదరాబాద్ నగర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రావు, ఎస్వీ లింగస్వామి తదితరులు సభలో పాల్గొన్నారు.

ఆదినారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన ఆశయాలను కొనసాగి స్తామంటూ ప్రతినబూనారు. అనంతరం కోయ వెంకటే శ్వరరావు మాట్లాడుతూ ఆయనో సముద్రంలాంటి వాడైతే..మనం ఒక నీటిబొట్టులాంటోళ్లమేనని ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

అనంతమైన వ్యక్తిత్వం ఆయన సొంతమన్నారు. సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చి ఆధునిక ఆలోచనల విస్తరణకు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆయనకు ఏ ఇజమూ లేదనీ, హ్యూ మనిజమే శ్వాసగా జీవించారని స్మరించుకున్నారు. ప్రకృతిని పూర్తిగా అర్థం చేసుకున్నారన్నారు. జీవ పరిణామాన్ని, రసాయనక చర్యల పర్యవసనాన్ని తెలుసుకోవటమే కాక, శాస్త్రీయత విశిష్టతను విస్తృత పరిచారన్నారు. సమాజంలో సరైన ఆలోచనా విధానాన్ని పెంపొందించే లక్ష్యంతో వేల మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వటంలో ఆయన ముందు వరసలో ఉన్నారని తెలిపారు.

ప్రొఫెసర్ రామచంద్రయ్య మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదికకు ప్రొఫెసర్ ఆదినారాయణ మోడల్ అన్నారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని చెప్పారు. 'మా నాన్న చనిపోయినప్పుడు ఏడ్చానో లేదో తెల్వదు కానీ..ఆదినారాయణ చనిపోయినప్పుడు కన్నీల్లు తన్నుకొచ్చాయని' గుర్తు చేసుకున్నారు. సైన్సు ద్వారా వాస్తవాలు ప్రజలకు చేరవేసేందుకు ఆయన చేసి కృషి ఎంత చెప్పినా తక్కువేనన్నారు. జేవీవీ కాగడా పట్టుకుని పనిచేశారని చెప్పారు. ఆదినారాయణ జీవితం వ్యక్తిగతమైంది కాదనీ, సంస్థాగతమైందని వివరించారు. నిమ్స్ మాజీ డైరెక్టర్ దాసరి ప్రసాదరావు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఒక ప్రజా శాస్త్రవేత్తను కోల్పోయిందని చెప్పారు. సైన్సు ఫలాలు అట్టడుగు వర్గాలకు, పేద పిల్లలకు అందాలని జీవితాంతం పనిచేశారన్నారు. ఆయన నిగర్వీ, అజాతశత్రువుని కొనియాడారు. శ్రీనాథ్ మాట్లాడుతూ మూడు తరాలకు పైగా క్లిష్టతర మనుకునే రసాయన శాస్త్రాన్ని యూనివర్సిటీలో బోధించిన ప్రొఫెసర్ ఆదినారాయణ లేడనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. కొనసాగించటమే ఆయనకిచ్చే నివాళి ని చెప్పారు.

డీహెచ్ రవీందర్ నాయక్ పై తప్పుడు ఆరోపణలు ఆపాలి

- బానోత్ నెహ్రూ చంద్ నాయక్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్‌పై తప్పుడు ఆరోపణలు ఆపాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ హెచ్చరించింది. ఈ మేరకు ఆదివారం ఆ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ నెహ్రూ చంద్ నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ ఆరోపణలు నిరాధారమైనవనీ, బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సీనియర్ అయిన రవీందర్ నాయక్‌కు డీహెచ్ పోస్ట్ ఏడేండ్ల క్రితమే రావాల్సి ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ ప్రభుత్వం జూనియర్‌ను నియమించిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీనియర్ అయిన డాక్టర్ బానోత్ రవీందర్ నాయక్‌ను నియమించిందని చెప్పారు.

బీఆర్ఎస్ హయాంలో డీహెచ్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ గడల శ్రీనివాసరావు సమయంలో వక్రమార్గంలో సంపదకు అలవాటు పడిన కొంత మంది అధికారుల ఆటలకు ప్రస్తుతం అడ్డుకట్ట పడిందని చెప్పారు. దీంతో అలాంటి వారు నీతి, నిజాయితీతో పని చేస్తున్న రవీందర్ నాయక్‌ను అప్రతిష్టపాలు చేసి బదిలీ చేయించే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఆరోపణలను ఇప్పటికైనా ఆపకపోతే ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లతో కలిసి వారి కుట్రలను తేటతెల్లం చెస్తామని హెచ్చరించారు.

డబుల్ ఇంజిన్ ప్రభుత్వమంటే

- నిరుద్యోగులకు రెండింతల కష్టాలు : రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ ఆదివారం బిజెపిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం మంటే 'నిరుద్యోగులకు రెండింత కష్టాలు' అని అర్థమని విమర్శించారు. ఈ మేరకు ఆదివారం తన సోషల్ మీడియాలో హిందీలో ఒక పోస్టు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో ప్రతీ మూడో యువకుడు 'నిరుద్యోగం అనే వ్యాధి'తో బాధపడుతున్నారని రాహుల్ తెలిపారు. 'ఉత్తరప్రదేశ్‌లో 1.5 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్న భర్తీ చేయడం లేదు. దీంతో కనీస విద్యార్హతతో భర్తీ చేసే పోస్టులకు కూడా గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, పిహెచ్‌డి హోల్డర్లు లైన్‌లో నిలబడి ఉన్నారు' అని రాహుల్ తన పోస్టులో తెలిపారు. 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వమంటే నిరుద్యోగులకు రెండింతల కష్టాలు' అని విమర్శించారు. 'రిక్రూట్‌మెంట్ ప్రకటనలకోసం నిరుద్యోగులు వేచి చూడ్డం మొదటిది. రెండోది రిక్రూట్‌మెంట్ ప్రకటన వచ్చి పరీక్ష జరిగినా ఆ పేపర్ లీకవుతుంది. దీంతో ఆ పరీక్షల ఫలితాలు విడుదల కావు' అని రాహుల్ వివరించారు. ఒకవేళ ఫలితం వచ్చినా సుదీర్ఘకాలం వేచి వుండాలని. జాయినింగ్‌లపై భరోసా కోసం కోర్టులకు తరుచూ వెళుతూ ఉండాలని రాహుల్ తెలిపారు. ఆర్మీ నుంచి రైల్వే వరకూ.. ఉపాధ్యాయ పోస్టుల నుంచి పోలీసు రిక్రూట్‌మెంట్లు కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తూ లక్షలాది మంది నిరుద్యోగులు వయోపరిమితి దాటిపోయారని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి నిరాశలతో విద్యార్థులు డిప్రెషన్‌కు గురై కుంగిపోతున్నారని, తమ డిమాండ్లతో వీధుల్లోకి వస్తే పోలీసుల చేత లాఠీ దెబ్బలు ఎదుర్కొంటున్నారని రాహుల్ తెలిపారు. ఒక విద్యార్థికి ఉద్యోగం అంటే కేవలం ఒక ఆదాయ వనరు మాత్రమే కాదని, అతని కుటుంబ జీవితాన్ని మార్చే కలని, ఉత్తరప్రదేశ్‌లో ఈ కలలు చెదిరిపోతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ విధానాలు మాత్రమే యువత కలలకు న్యాయం చేస్తాయని, యువకుల తపస్సును వృథా కానివ్వమని రాహుల్ తన పోస్టులో తెలిపారు.

నాజర్ ఆస్పత్రిలో స్థంభించిన సేవలు



జెరూసలేం : గాజా స్ట్రిప్‌లో రెండో అతిపెద్ద ఆస్పత్రిగా పేరు గాంచిన నాజర్ ఆస్పత్రి లో సేవలు పూర్తిగా స్థంభించాయని అధికారులు వెల్లడించారు. గాజాలోని ఖాన్ యూనిస్ పట్టణంలో ఉన్న ఈ ఆస్పత్రి నెల రోజుల నుంచి ఇజ్రాయిల్ సైన్యం ఆధీనంలోనే ఉంది. ఈ ఆస్పత్రి లో సుమారు 200 రోగుల ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల వెల్లడించింది. ఉగ్రవాదులు ఉన్నారనే అనుమానంతో ఈ ఆస్పత్రిని ఇజ్రాయిల్ సైన్యం స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి కూడా ఇక్కడ వైద్య సేవలు క్షీణిస్తూ వచ్చాయి. తాజాగా ఆస్పత్రి లో సేవలు పూర్తిగా స్థంభించిపోయినట్లు గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది.

కాల్పుల విరమణలో పురోగతి లేదు : ఖతార్ ప్రధాని

గాజాలో కాల్పుల విరమణ అమలు దిశగా ఏ విధమైన పురోగతి లేదని కతార్ ప్రధానమంత్రి షేక్ మహ్మద్ బిన్ అబ్దుల్ రహ్మాన్ బిన్ జాసిమ్ అల్ థానీ తెలిపారు. విదేశాంగ మంత్రి కూడా అయిన అల్ థాని శనివారం విలేకరులతో మాట్లాడుతూ గాజాలో కాల్పుల విరమణ అమల్లోకి రావాలని ఖతార్ కోరుకుంటుందని చెప్పారు. కాల్పుల విరమణ అమలులోకి వస్తే గాజాకు చెందిన ప్రజలు తిరిగి తమ ఇండ్లకు వెళ్లడానికి అవకాశం కలుగుతుందని అన్నారు.

రఫా వద్ద బఫర్ జోన్ నిర్మిస్తున్న ఈజిప్టు

గాజా సరిహద్దుల్లో ఉన్న రఫా పట్టణానికి సమీపంలో భారీ సిమెంట్ కంచెను నిర్మిస్తున్నట్లు ఈజిప్టు వెల్లడించింది. ఇది గాజాకు మరింత సహాయాన్ని అందించడానికి ఏర్పాటు చేస్తున్న 'బఫర్ జోన్'గా పేర్కొంది. ఇక్కడ ట్రక్కుల కోసం పార్కింగ్ ప్రాంతాలు, గిడ్డంగులు, అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాలు, డ్రైవర్లకు వసతి కోసం గృహాలు నిర్మిస్తున్నట్లు తెలిపింది. ఇజ్రాయిల్ దాడుల భయంతో వలస వచ్చే పాలస్తీనీయుల కోసం వసతి గృహాలను నిర్మిస్తున్నామని, గాజా సరిహద్దు వెంబడి కంచె నిర్మిస్తున్నామని వస్తున్న వార్తలు పూర్తిగా ఊహాజనితమని ఈజిప్టు మరోసారి స్పష్టం చేసింది. పాలస్తీనాను ఒక దేశంగా గుర్తించడానికి జరుగుతున్న చర్యలను ఇజ్రాయిల్ వ్యతిరేకించింది. ఇలాంటి 'ఏకపక్ష గుర్తింపు'ను ఖండిస్తున్నామంటూ ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశం ఒక ప్రకటన విడుదల చేసింది.

మహేశ్వరం డివిజన్ ఏసీపీగా ఉమా మహేశ్వర్ రావు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం డివిజన్ ఏ.సీ.పి.గా ఉమా మహేశ్వర్ రావు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏ.సీ.పి.గా పనిచేస్తున్న ఏ.సీ.పి శ్రీనివాస్ నాగర్ కర్నూల్ డీఎస్పీగా బదిలీ కావటంతో ఆయన స్థానంలో శంషాబాద్ ట్రాఫిక్ ఏ.సీ.పిగా పనిచేస్తున్న సి.ఉమా మహేశ్వర్ రావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. మహేశ్వరం డివిజన్ పరిధిలో మహేశ్వరం,కందుకూర్, పహాడి షరీఫ్, బాలాపూర్ పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.శాంతి భద్రతలకు ఎంతటి వారైనా సరే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

కందుకూరు సీఐకు శుభాకాంక్షలు



నవతెలంగాణ - చైతన్యపురి

కందుకూరు ఇన్‌స్పెక్టర్ ఎం. జానీని ఆదివారం ఆర్కే పురం లో నివాసం ఉండే రంగారెడ్డి జిల్లా సీనియర్ మైనార్టీ నాయకులు ఎస్కే మహమ్మద్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. విధి నిర్వహణలో నిక్కచ్చిగా ఉండి పేదలకు సమయానికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఆయన వెంట మహమ్మద్ హైమద్, జి వి సోమేశ్వరరావు లు ఉన్నారు.

చంపాపేట్‌లో దొంగ హల్‌చల్..

నవతెలంగాణ-సంతోష్ నగర్



చంపాపేట్ పరిసర ప్రాంతాల్లో రాత్రి సమయంలో దొంగలు ఇండ్లలోనికి చొరబడి చోరీలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తాజాగా శనివారం రాత్రి చంపాపేట్ పరిధి దుర్గ భవాని నగర్ రోడ్ నెంబర్ 7 పరిధిలో ఓ గుర్తు తెలియని దొంగ గేట్ దూకి రెండో అంతస్తు పైకి ఎక్కి ఇంట్లోకి చొరబడి చోరీ చేసేందుకు ప్రయత్నించాడు. ఇంట్లో నిద్రిస్తున్న వారు డోర్ తీసి చూసి పట్టుకునే ప్రయత్నించగా దొంగ పారిపోయాడు. చోరీలు ఎక్కువవుతున్నాయని పోలీసులు స్పందించి బస్తీలలో రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

డీసీసీ ప్రధాన కార్యదర్శిగా వక్కలంక



నవతెలంగాణ - చైతన్యపురి

సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వక్కలంక శ్రీనివాస్ రావు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. రంగారెడ్డి డీసీసీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి వీఎస్ఎన్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కషి చేయాలని సూచించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దష్టిలో పెట్టుకుని అందుకు అనుగుణంగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలన్నారు. పార్టీ కోసం 40 ఏండ్లుగా పనిచేసిన మీ అనుభవంతో పార్టీని ముందుకు తీసుకు వెళ్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ 40 ఏండ్లుగా పార్టీ బలోపేతం కోసం పనిచేస్తున్నానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తనకు తల్లి తండ్రి లాంటిదని పార్టీకి గానీ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గము ఇన్‌చార్జ్ కిచ్చెనగారి లక్ష్మారెడ్డి, మాజీ ఎంపి మధయాష్కీలకు ఆయన కతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కషి చేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఆర్కే పురం నాయకుడు నెప్పలి శశి పాల్గొన్నారు.

శాంతి భద్రతల విషయంలో రాజీవద్దు

- కిచ్చేనగారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్



శాంతి భద్రతల విషయంలో పోలీస్ శాఖలో రాజీ పడాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి,మాజీ ఎమ్మె ల్యే కిచ్చన గారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం డివిజన్ ఏ.సి.పిగా నూతనం గా బాధ్యతలు స్వీకరించిన ఉమామహేశ్వరరావు మర్యాదపూర్వకంగా చేవెళ్ల పార్లమెంట్ నాయకులు, మహేశ్వరం నియోజక వర్గం ఇన్‌చార్జ్ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని తుక్కుగూడలోనీ ఆయన నివాసంలో కలిసి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థ మెరుగు కోసం కృషి చేయాలని సూచించారు.శాంతి భద్రతల విషయంలో రాజీ పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.



'విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం'

నవతెలంగాణ-సంతోష్ నగర్

సమాజ అభివృద్ధి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు విద్యతోనే సాధ్యమని టీఆర్ఎస్ఎంఏ రాష్ట్ర అడ్వైజర్ శ్రీపతి శేఖర్ రెడ్డి అన్నారు. చంపాపేట్ డివిజన్ మంద యాదవ రెడ్డి గార్డెన్‌లో శ్రీ వెంకటేశ్వర గ్రూప్ ఆఫ్ కాలేజస్ సహకారంతో సరూర్ నగర్ మండల టీఆర్ఎస్ఎంఏ ఆధ్వర్యంలో ఎయిమ్ టు విన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలపై కోచ్ మల్లేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీపతి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ కూడా ఉత్తమ ప్రతిభ కనబరచాలన్నారు. టి.ఆర్.ఎస్.ఎం.ఏ అధ్యక్షులు జి.నారాయణ్ రెడ్డి, జిల్లా ట్రెజరర్ సిహెచ్. మహేందర్ రావు, అసోసియేట్ అధ్యక్షులు టి. బుచ్చిరెడ్డి, అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ దేవేందర్ గౌడ్ ట్రెజరర్ మధుసూ దన్ రెడ్డి విద్యార్థులు ఉపాధ్యాయుల సిబ్బంది పాల్గొన్నారు



వాహనదారులతో ప్రతిజ్ఞ

నవతెలంగాణ-సంతోష్ నగర్

ట్రాఫిక్ సౌత్ ఈస్ట్ జోన్ ఏసీపీ సత్యనారాయణ, సీఐ నరసింహ నాయక్ ఆదేశం అనుసారంగా ఎస్సైలు సత్యనారాయణ వెంకటప్పలు సంతోష్ నగర్ చౌరస్తాలో వాణిజ్య వ్యాపారస్తులు, వాహనదారులతో రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు.



ఎంపీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కనుమరుగు

- కాంగ్రెస్ 'మహేశ్వరం' ఇన్‌చార్జి కిచ్చెనగారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ - మీర్ పేట్

రాబోయే పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ కనుమరుగు కావడం ఖాయమని కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ మొక్క నరేందర్ కుమార్(నందు) తన అనుచరులతో కలిసి కేఎల్ఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ లో చేరి వారి ప్రాంతాల అభివృద్ధికి పాటు పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బడంగ్ పేట కార్పొరేషన్ నాయకులు చిగురింత నర్సింహారెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి సహా మీర్ పేట్, బడంగ్పేట్ కార్పొరేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామంగా మజీద్‌పూర్

'ఇంటికి వంద బడికి చందా'కు మంచి స్పందన

- ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి రూ. 15 లక్షల విరాళం సేకరణ
- మాజీ సర్పంచ్ సుధాకర్ రెడ్డిని అభినందించిన కలెక్టర్ శశాంక్



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్



సమాజానికి చదివే వెలుగని నమ్మిన ఆ గ్రామ స్తులు అందరికీ ఆదర్శంగా తన వంతు బాధ్యతగా " ఇంటికి వంద బడికి చందా " అన్న నినాదంతో రూ. 15 లక్షల విరాళాన్ని సేకరించి పాఠశాల అభివృద్ధి కోసం చేయూతనందించారు. ఈ నెల 11న గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బడి పండుగను కూడా ఘనంగా నిర్వహించారు. పడిపండుగతో విద్యార్థుల్లో ఉత్సాహం రెట్టింపు కాగా, విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.డీఈవో సుశీందర్ రావు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై విద్యార్థుల ప్రతిభను అలకించారు, దాంతో పాఠశాల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ కూడా హాజరు కావాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల రాలేదు. దాంతో గ్రామ మాజీ సర్పంచ్ పోచంపల్లి సుధాకర్ రెడ్డి, గ్రామస్తులు శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివద్ధి కోసం గ్రామస్తుల సహకారంతో ఇక ముందు కూడా ముందుకు వెళ్తామని తెలిపారు. అత్యధిక పేద పిల్లలు చదుకొనే ప్రభుత్వ పాఠశాల బలోపేతం కోసం ఒక నూతన కార్యక్రమాన్ని గ్రామంలో చేపట్టడం జరిగిందని అన్నారు.దీనికి మంచి స్పందన వచ్చిందని, అందులో భాగంగానే బడి పండుగ చేశామని చెప్పారు. ఈ కార్యక్ర మాలతో విద్యార్థుల్లో మానసిక ఉత్సాహాన్ని మరింత రెట్టింపు చేసిందని అన్నారు.ఇలాంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేయడానికి అవగాహన ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. గ్రామస్తులు చేస్తున్న పాఠశాల అభివద్ధి కషికి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ హర్షం వ్యక్తం చేస్తూ గ్రామస్తులను అభినందించాడని తెలిపారు. అలాగే పాఠశాలకు సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా సహాయం అందిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ భాస్కర్ రెడ్డి , వందేమాతరం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు రవీంద్ర, మాజీ వార్డు సభ్యులు దూసరి గణేష్, మద్ది చైతన్య రెడ్డి,గ్రామస్తులు తాళ్ల వెంకటేష్, పాండాల కష్ణ , కుతాటి కష్ణ, పాలపాటి సుదర్శన్ తదితరులు ఉన్నారు.



ఘనంగా శ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ - మీర్ పేట్

మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 285 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. బంజారా సోదర, సోదరీమణులందరికీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. శాసనసభ ఎన్నికల్లో పెద్ద ఎత్తున ఆశీర్వదించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కొత్తగా నిర్మాణం చేస్తున్న శ్రీ సంత్ సేవాలాల్ ఆలయ నిర్మాణ భూమి పూజలో పాల్గొన్నారు. శ్రీ సంత్ సేవాలాల్ ఆశయసాధన కోసం ప్రతీ ఒక్కరు కషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, అర్కల భూపాల్ రెడ్డి, కార్పొరేటర్లు రవి నాయక్, అనిల్ యాదవ్, రాజేందర్ రెడ్డి, ధనలక్ష్మి రాజు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి, సిద్దాల బీరప్ప, గడ్డమీది లక్ష్మణ్, మేకల రవీందర్ రెడ్డి, జటావత్ శీను నాయక్, జటావత్ రవి నాయక్, మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ యువజన విభాగం అధ్యక్షుడు నాగరాజు, బంజారా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



టిమ్స్ హాస్పిటల్‌ను త్వరగా పూర్తి చేయాలి

- ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ-ఎల్‌బీనగర్

ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని చైతన్యపురి డివిజన్‌లో నూతనంగా నిర్మిస్తున్న టిమ్స్ హాస్పిటల్ పనులను ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హాస్పిటల్ దాదాపు 26 అంతస్తులతో నిర్మాణం జరుగుతుందని తెలిపారు. అలాగే హాస్పిటల్ స్థల పరిసరాల్లో ప్రస్తుత భావితరాలను దష్టిలో పెట్టుకొని భవిష్యత్తు నందు స్థలాలు దొరకడం కష్టంగా భావించి మాజీ సీఎం కేసీఆర్‌ను ఒప్పించి పోలీస్ స్టేషన్,చిల్డ్రన్ పార్క్,సబ్ స్టేషన్, వాటర్ ట్యాంక్, ఒక అద్భుతమైన కమ్యూనిటి హాల్ కూడా ఇప్పటికే నిర్మించ తలపెట్టినట్టు చెప్పారు. అలాగే గుడి, మసీదు కూడా నిర్మించడం జరుగుతుందన్నారు. హాస్పిటల్‌కు వచ్చే వారు సేదతిరడానికి పక్కనే అయిదు అంతస్థుల భవనం కూడా నిర్మిస్తామన్నారు. ప్రస్తుతం 4 స్లాబుల నిర్మాణం జరిగిందని తెలిపారు. ప్రతీ 25 నుంచి 30 రోజులకు ఒకసారి ఒక్కో స్లాబ్ నిర్మాణం జరుగుతుంది అని పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాలు, తగిన భద్రత చర్యలు పాటిస్తూ పనులు చేయాలని కోరారు. సీనియర్ నాయకులు ఆనంతుల రాజిరెడ్డి, చిరంజీవి, మధుసాగర్, కిరణ్,బంటి,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ పోటీ పరీక్షల అభ్యర్థులకు పుస్తకాల వితరణ

నవతెలంగాణ-బడంగ్‌పేట్



పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కీ.శే పి. శ్రీరాములు, కీ.శే. పి. తులసి రత్నం జ్ఞాపకార్థం వారి కుమారుడు, తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ రిటైర్డ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి. దేవేంద్రరావు పోటీ పరీక్షల పుస్తకాలు వితరణ చేశారు. మంచి వాతావరణంలో ఉన్న ఈ గ్రంథాలయంలో విద్యార్థులు చదువుకొని ఉద్యోగాలు పొందాలని ఉన్నత స్థాయికి చేరాలని వారు అభ్యర్థులను కోరారు. ఈ కార్యక్రమంలో పోటీ పరీక్షల నిపుణులు, గ్రూప్-1 అధికారుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రెటరీ జిల్లా ఆడిట్ అధికారి నూతనగంటి వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లైబ్రేరియన్ జైహింద్, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మంచి ఉద్దేశంతో పోటీ పరీక్షల అభ్యర్థులను ప్రోత్సహిస్తున్న పి. దేవేంద్రరావుకు రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థినులకు మలబార్ గోల్డ్, డైమండ్స్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ



నవతెలంగాణ - చైతన్యపురి

దేశంలో అతిపెద్ద బంగారు, వజ్రాభరణాల వ్యాపార సంస్థల్లో ఒకటైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సామాజిక సేవా కార్యక్రమాలు అందించడం అభినందనీయం అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి అన్నారు. శనివారం లింగా రెడ్డి గార్డెన్స్ హైదరాబాద్ జోనల్ హెడ్ మొహమ్మద్ షరీజ్, ఎ ఎస్ రావు నగర్ స్టోర్ హెడ్ షిహాబు, దిల్‌సుఖ్‌నగర్ స్టోర్ హెడ్ రదీష్, హబ్సిగూడ స్టోర్ హెడ్ మొహమ్మద్ అహ్మద్ సోఫీ, మలబార్ గ్రూప్ మేనేజ్మెంట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రతిభ ఆధారంగా 726 మంది విద్యార్థికి స్కాలర్‌షిప్పులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరం నలుమూలల నుండి విచ్చేసిన విద్యార్థులు మలబార్ గ్రూప్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఈ స్కాలర్‌షిప్పులు అందించినట్టు తెలిపారు. ఒక్కొక్కరికి రూ 8,000/- నుండి రూ.10,000/- చొప్పున స్కాలర్‌షిప్ రూ. 55,70,000/- మొత్తాన్ని అందించినట్టు వెల్లడించారు. గత 20 సంవత్సరాలలో మలబార్ గ్రూప్ వారి 'మలబార్ ఛారిటబుల్ ట్రస్ట్' రూ. 52.26 కోట్లకు పైగా వైద్య సహాయంగా వెచ్చించిందని మలబార్ గోల్డ్ ప్రతినిధులు ఈ సందర్భంగా తెలిపారు.

కర్మన్‌ఘాట్ శ్రీ చైతన్యలో ఘనంగా 'ఫ్యామిలీ ఫెస్ట్ - ఫ్యామిలీ ఫస్ట్'





నవతెలంగాణ-సంతోష్ నగర్

ఎల్బీనగర్ డివిజన్ లింగోజీగూడ పరిధిలోని కర్మన్ ఘాట్ శ్రీ చైతన్య హై స్కూల్లో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా "ఫ్యామిలీ ఫెస్ట్ - ఫ్యామిలీ ఫస్ట్" అనే కార్యక్రమం ఘనంగా జరిగిందని ప్రిన్సిపల్ సయ్యద్ ఖాసిం అలీ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఏజీఎం సతీష్ మాట్లాడుతూ సమాజంలో కుటుంబ విలువలు పెంపొం దించి, విద్యార్థులను అన్ని రంగాలలో అభివృద్ధి చేసే విధం గా అకాడమిక్ కరిక్యులం రూపొందించిందని తెలిపారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాదపూజ చేసి వారి ఆశీర్వాదాన్ని ఉపాధ్యాయుల సమక్షంలో తీసుకోవటం ఈ కార్యక్రమంలో ప్రధాన ఉద్దేశం అని ఆర్. ఐ. రవీందర్ రెడ్డి, కో-ఆర్డినేటర్ రఘువంశీ, అకాడమిక్ డీన్ వెంకటరమణ తెలిపారు. తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల విలువలను విద్యార్థులకు అర్థమయ్యే విధంగా కన్నుల పండగలా జరిగిన ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు భావోద్వేగానికి, మధురా నుభూతికి లోనయ్యారు. అందరినీ అలరించిన ఈ నైతిక విలు విలువల కార్యక్రమంలో వైస్-ప్రిన్సిపల్ సుందర్ సింగ్ నంబూరి, ఇన్చార్జులు సంధ్య, సతీష్, సత్యనారాయణ, పి ఈ టిలు అశోక్ రఘు పాల్గొన్నారు

అభివృద్ధిలో దూసుకుపోతున్న 'బడంగ్ పేట్'



నవతెలంగాణ-బడంగ్‌పేట్

ప్రజా ప్రతినిధుల, అధికారుల సహకారంతో రాష్ట్రంలోనే బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి పథంలో దూసుక పోతున్నట్టు మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శనివారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో మేయర్ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించటంలో రాష్ట్రంలోనే బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. గత ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కారం చేయటంలో పూర్తిగా విఫలమైనట్టు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్లకు కేటాయించిన నిధులను మేనేజర్ నగేష్ బాబు సమావేశంలో ప్రవేశ పెట్టగా సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం నూతనంగా భాద్యతలు స్వీకరించిన మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జీ.రఘుకు మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ తో పాటు కార్పొరేటర్లు పూల మాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి. రఘు, డీఈఈ జ్యోతి, ఏఈ వినీల్ గౌడ్,వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్లు అందజేత



నవతెలంగాణ - చైతన్యపురి

మహిళలు సొంతంగా వారి కాళ్ళ మీద నిలబడి ఆర్థికంగా నిలబెట్టుకోవాలనే ఉద్దేశంతోనే మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేశామని డిస్ట్రిక్ట్ గవర్నర్ హరీష్ రెడ్డి అన్నారు. ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ హయత్ నగర్ 320 సి ఆధ్వర్యంలో శంఖేశ్వర్ బజార్ చౌరస్తా రోడ్ సరూర్ నగర్ లో గల పర్మనెంట్ ప్రాజెక్టు వద్ద ముఖ్యఅతిథిగా డిస్ట్రిక్ట్ గవర్నర్ హరీష్ రెడ్డి హాజరై కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అనంతరం కుట్టు మిషన్ల ద్వారా టైలరింగ్, ఎంబ్రాయిడరీ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్‌లు అందించారు. ఎమ్.ఎస్ రెడ్డి ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం ఉచిత కంటి పరీక్షలు , హయత్ నగర్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత షుగర్, బీపీ పరీక్షలు జరుపుతున్న వారితో మాట్లాడారు. ఇప్పటికే 200 పైగా ఉచితం గా కాట్రాక్ట్ ఆపరేషన్లు చేయించడం జరిగిందన్నారు. కంటి పరీక్షలు చేసుకున్న వారికి కండ్లద్దాలు ఉచితం గా అందజేశారు. ప్రతీ ఆదివారం అష్టలక్ష్మి దేవాలయం సౌజన్యంతో భవాని శంకర్ ఆలయం సహకారంతో పేదలకు అన్న ప్రసాద వితరణ చేయడం ఎంతో మంచి కార్యక్రమం అని కొనియాడారు.

పర్యావరణం గురించి ఎన్నో క్లాత్ బ్యాగులను అందించి పర్యావరణం కాపాడడం తోడ్పడుతున్న రాష్ట్రపతి అవార్డు గ్రహీత డా. పెండెం కృష్ణ కుమార్‌ను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కె. చంద్రశేఖర్ రెడ్డి, పీడీజీ గార్లపాటి జితేందర్ కుమార్, జెడ్. సి. డా,, పెండెం కృష్ణ కుమార్, ఎలెక్ట్ ప్రెసిడెంట్ గట్ల రవీంద్ర,భార్గవ రాజు, శంకర్, పూర్ణచందర్, విజయలక్మి, గట్ల భావన, శైలజ, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి ఎల్బీనగర్ కోర్టులో హైకోర్టు న్యాయమూర్తికి సన్మానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

రంగారెడ్డి కోర్టు ఎల్బీనగర్ లో హైకోర్టు న్యాయమూర్తికి అభినంద్ కుమార్ సావళి (ఫోర్ట్ పోలియో జడ్జి రంగారెడ్డి డిస్ట్రిక్ట్ జడ్జి) ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శశిధర్ రెడ్డి క్యాబిన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు పాల్గొని ఘనంగా స్వాగతం పలికారు. హైకోర్టు న్యాయమూర్తికి వారి సమస్యలను వివరించారు. ఈ మేరకు న్యాయమూర్తి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ శశిధర్ రెడ్డి, మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ డాక్టర్ పట్టాభి రామారావు, ఇతర న్యాయమూర్తులు పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి కొండ రవీందర్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల మాధవరెడ్డి, ఉపాధ్యక్షులు సల్లా వినోద్ కుమార్, సంయుక్త కార్యదర్శి రామచందర్ చక్రాల, ఇతర అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే.రామస్వామి

నవతెలంగాణ-చేవెళ్ల

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే.రామస్వామి అన్నారు. ఆదివారం చేవెళ్లలోని సీపీఐ కాలనీ పేస్ టూలో హైదరాబాద్ సోమాజిగూడలో ఉన్న సీఎస్‌సీ హెల్త్ కేర్ వారి ఆధ్వర్యంలో రంగారెడ్డి డిస్ట్రిక్ట్ హెల్త్ ఆఫీసర్ నిహాల్ అహ్మద్ హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను అలవర్చుకోని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. అదే విధంగా పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. గుడిసె లు వేసుకున్న నిరుపేదలకు 32 మందికి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు మహమ్మద్, మస్తాన్, సాయి తేజ, రాజశ్రీ, అబూ సోఫియాన్, సందీ ప్, పార్టీ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వడ్ల మంజుల, సుగుణమ్మ, వెంకటమ్మ, భాగ్యమ్మ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ ఈకేవైసీ తప్పనిసరి చేయించుకోవాలి

- మండల వ్యవసాయ అధికారి తులసి

నవతెలంగాణ-చేవెళ్ల

పట్టాదారు పాసుపుస్తకం ఉండి పీఎం కిసాన్ డబ్బులు ఖాతాలో పడుతున్న రైతులు ఈకేవైసీ అప్‌డేట్ ప్రక్రియను తప్పనిసరిగా చేయిం చుకోవాలని మండల వ్యవసాయ అధికారి తులసి తెలిపారు. చేవెళ్ల మం డల పరిధిలోని గుండాల గ్రామంలో ఆదివారం ఏవో తులసి పర్యటించి మండల వ్యవసాయ విస్తరణాధికారులు నిర్వహిస్తున్న పీఎం కిసాన్ ఈకేవైసీ అప్‌డేట్ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధానమంత్రి కిసాన్ యోజన ద్వారా రైతు లకు పంట పెట్టుబడి సాయం అందుతున్న క్రమంలో ప్రభుత్వం ఈకేవైసీ అప్‌డేట్ ప్రక్రియను తప్పనిసరి చేసిందన్నారు. ఇప్పటి వరకు చేవెళ్ల మండలంలో 92 శాతం పీఎం కిసాన్ ఈకేవైసీ అప్‌డేట్ ప్రక్రియ పూర్తయిందని, మితగా 8శాతం మంది రైతులు విధిగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈకేవైసీ అప్‌డేట్ ప్రక్రియను పూర్తి చేసుకోలేని యెడల తదుపరి విడత ఖాతాలో పంట పెట్టుబడి సాయం పడదని తెలిపారు. బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం లేని రైతులు కూడా తప్పని సరిగా లింక్ చేయించుకోవాలన్నారు.

కుల గణనతో బీసీలకు న్యాయం

- మాజీ ఎంపీ వి.హనుమంతరావు



నవతెలంగాణ- అంబర్‌పేట:

ఓబీసీ ఎంపీఫోరం కన్వీనర్, మాజీ పీసీసీ అధ్యక్షుడు వి.హనుమంతరావు ఆధ్వర్యంలో అలీ కేఫ్ చౌరస్తాలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వి. హనుమంతరావు మాట్లాడుతూ బీసీ కులగణన ద్వారా బీసీలకు న్యాయం జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి తర్వగా కులగణన చేయవలసిందిగా ఆదేశించినందుకు హర్షం వ్యక్తం చేశారు. బీసీ కులాలు ఎంత శాతం ఉన్నారో తెలుస్తుందని, దాని ద్వారా వారికి సంబంధించిన అన్ని రకాల సంక్షేమ పథకాలు వారికే అందుతాయని తెలియజేశారు. రాష్ట్రంలోనే కాకుండా యావత్ భారత దేశం అంతట కూడా బీసీ కులగణన జరగాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పంజాల జ్ఞానేశ్వర్ గౌడ్, పి. నారాయణస్వామి, పులి జగన్ గరిగంటి రమేష్, దిడ్డి రాంబాబు, టీపీసీసీ సెక్రటరీ శంబుల శ్రీకాంత్ గౌడ్, పొలేనేని రామ్మోహన్ రావు, యాసిన్, ప్రభాకర్, కోటం అనిల్ కుమార్, రాజేశ్వరరావు, హరి, తిలక్ సింగ్, డివిజన్ ప్రెసిడెంట్లు శ్రీధర్ గౌడ్, ఫరీద్, లక్ష్మణ్, శ్రీనివాస్ రెడ్డి, మహేష్ గౌడ్, సుధాకర్, కిషోర్, శశిధర్, వీరన్న, నాయక్, అఫ్జల్, కోట్ల కిరణ్, మణికాంత్, సునీత రెడ్డి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

'బీసీ కులగణన తీర్మానం చారిత్రాత్మకం'

- బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్
- సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం చిత్రపటాలకు పాలాభిషేకం



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

బీసీ కులగణన తీర్మానం చారిత్రాత్మకమైందని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్ అన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో బీసీ సమగ్ర కులగణన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందిన సందర్భంగా జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్ పార్క్ లోని అమరవీరుల స్తూపం వద్ద రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్ర పటాలకు జేఏసీ నేతలతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన కోసం బీసీలు ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నారని, బీసీలు గత 93 ఏళ్లుగా ఎదురు చూస్తున్న కల సాకారం అయ్యేందుకు సీఎం ఎ.రేవంత్ రెడ్డి ముందడుగు వేసి బడుగులకు బాటసారిగా నిలిచారని కొనియాడారు. దేశ ప్రధాని బీసీ కులస్తుడై ఉండి కూడా బీసీలను పట్టించుకున్న పాపన పోలేదని విమర్శించారు. 2014లో కేసీఆర్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేసి ఆ లెక్కలు వెల్లడించకపోవడమే గాక, స్థానిక సంస్థలు, పంచాయతీరాజ్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను తగ్గించి, రాజకీయంగా అణచి వేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ మాత్రం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగానే రాష్ట్రంలో కుల గణనకు అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు. రేవంత్ రెడ్డి రాష్ట్ర సీఎంగా పదవీ స్వీకారం చేసిన మొదటి రోజే ప్రగతి భవన్‌కు పేరు మార్చి మహాత్మ జ్యోతిరావు పూలే పేరు పెట్టడమే గాక, బీసీ విద్యార్థులు చదువులో ముందుకు రావాలని ప్రతి నియోజకవర్గంలో గురుకుల పాఠశాల ఏర్పాటు చేసేలా చర్యలు ప్రారంభించడం చూస్తుంటే బీసీల పట్ల తనకు ఎంత చిత్తశుద్ధి ఉందో తెలుస్తుందన్నారు. ఎన్నో ఏళ్లుగా బీసీ వర్గాలకు సరైన న్యాయం జరగడం లేదని, బీసీలు విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అత్యంత వెనుకబడి ఉన్నారని, కులగణనతో న్యాయం జరిగే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల అభివృద్ధికి తోడ్పడుతున్నందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దేశవ్యాప్తంగా బీసీ కులగణన చేయాలంటే కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని ఆకాంక్షించారు.రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలు కాంగ్రెస్‌కి అండగా ఉండి గెలిపించుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులు సోమ య్య, సైదులు, అనిల్ కుమార్, రవికుమార్, భాస్కర్, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనాథలు, నిరాశ్రయులకు దుస్తుల పంపిణీ



నవతెలంగాణ-ముషీరాబాద్

అనాథలకు నిరాశ్రయులకు ఫుట్‌పాత్‌పై నివసిస్తున్న వారికి స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్ర మంలో ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పావని పాల్గొన్నారు.

ఘనంగా ఉమర్ ఖాన్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-సీటీబ్యూరో

టీఎన్జీవో యూనియన్, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు ఉమర్ ఖాన్ 58వ పుట్టిన రోజు సందర్భంగా జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్) జిల్లా కార్యాలయం నాంపల్లిలో ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ అనంతరం ఉమర్ ఖాన్ ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర సంఘ నాయకులు టి.పర్వతాలు, జి.రమణ రెడ్డి, జిల్లా సభ్యులు కె.ఆర్.రాజ్ కుమార్, కుర్రాడి శ్రీనివాస్, నరేష్ కుమార్, బొల్లిగిద్ద శంకర్, వైదీక్ శస్త్ర, శ్రీధర్ నాయుడు, ముహమ్మద్ అబ్దుల్ వహీద్, మిత్రులు రామకృష్ణారెడ్డి, సైద్ ముహమ్మద్ కామ్రాన్, ఇతర నాయకులు పాల్గొన్నారు. టీఎన్జీయోస్ యూనియన్, హైదరాబాద్ జిల్లా ఎల్లప్పుడు ఉద్యోగుల శ్రేయస్సు గురించి పనిచేస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు.



అంతరంగపు ముచ్చట్లు పుస్తకావిష్కరణ



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ సూర్యదేవర రాధా రాణి కవిత్వంలో మానవతా విలువలు లలిత కళల పట్ల మమకారం స్పష్టంగా కనిపిస్తుందని రచయిత్రి రాధా రాణి రచించిన అంతరంగపు ముచ్చట్లు పుస్తకావిష్కరణలో వక్తలు తెలిపారు. ప్రముఖ స్త్రీవాద రచయిత్రి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఓల్గా అధ్యక్షతన ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రచయిత్రి సూర్యదేవర రాధా రాణి రచించిన అంతరంగపు ముచ్చట్లు పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగు యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎన్ గోపి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుపట్ల అమితమైన ప్రేమతో విలువైన వ్యక్తిత్వం గల రాధా రాణి వైద్య వృత్తి కొనసాగిస్తూనే రచయిత్రిగా ముందుకు రావడం చాలా సంతోషకరమన్నారు. తొలి సంపుటిలోనే అపారమైన ప్రతిభతో చాలా అనుభవం ఉన్న రచయితలను తలపింపజేసే తన సంపుటిలో తెలిపారన్నారు. రాధా రాణి కవిత నిర్మాణం ఆమె మంచి మనసు లలిత కళల పట్ల మమకారం సహజమైన మానవ సంస్కరణం స్నేహం అనుబంధం సమాజం మరింత మానవీయంగా మారాలని ఆకాంక్ష మెండుగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విప్లవ కవి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నిఖిలేశ్వర్ ఆత్మీయ సందేశం అందించారు, అసిస్టెంట్ ప్రొఫెసర్ తెలుగు విభాగం ఉస్మానియా యూనివర్సిటీ డాక్టర్ ఎస్ రఘు, ఆర్థోపెడిక్ సర్జన్ జనహిత హాస్పిటల్ డాక్టర్ ఎస్ జతిన్ కుమార్ పుస్తక సమీక్ష నిర్వహించారు.

'ఈవీఎంలను తొలగించి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి'



- రైతులపై డ్రోన్లతో టియర్ గ్యాస్ షెల్స్ కాల్చడం దుర్మార్గం
- తెలంగాణ ఇంక్విలాబ్ సేన

నవతెలంగాణ-హిమాయత్ నగర్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఈవీఎంలను తొలగించి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ ఇంక్విలాబ్ సేన జాతీయ ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేసింది.ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇంక్విలాబ్ సేన రాష్ట్ర అధ్యక్షులు జానీ, ప్రధాన కార్య దర్శి ఎం.ఎం.హుస్సేన్, మహమ్మద్ సలీం తదితరులు మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఇంక్విలాబ్ సేన పని చేస్తుందన్నారు. కేంద్రంలో ఉన్నది రైతు విద్రోహ ప్రభుత్వమని, రైతులేమైనా టెర్రరిస్టులా వారిపై డ్రోన్లతో టియర్ గ్యాస్ షెల్స్ కాల్చడం దుర్మార్గమైన చర్యగా వారు అభివర్ణించా రు. రైతులు ఒక వైపు వారి న్యాయమైన డిమాండ్లపై ఉద్యమిస్తుంటే ప్రధాని మోడీ విదేశాలకు వెళ్లి రామాలయాలు ప్రారంభిస్తున్నారని విమర్శించారు. ఎలక్టోరల్ బ్రాండ్లను రద్దు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తాము స్వాగతిస్తున్నామన్నారు. ఢిల్లీలో రైతుల ఉద్యమంపై కేంద్ర ప్రభుత్వ ధమన కాండకు నిరసనగా తెలంగాణ శాసన సభ తీర్మానం చేయాలని కోరారు. 10 ఏళ్లుగా రెండు తెలుగు రాష్ట్రాలకు ఇచ్చిన విభజన హామీలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నేటికీ అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. రైతుల డిమాండ్లపై కేంద్రం చర్చలకు ఆహ్వానించాలని కోరారు. కనీస మద్దతు ధర (ఎం.ఎస్.పి)కి హామీ ఇచ్చేలా చట్టం చేయాలని, రుణమాఫీ సహా ఇతర వ్యవసాయ సంస్కరణలకు చట్టపరమైన హామీని ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అమాయక ప్రజల భక్తిని ఆసరాగా చేసు కుని, మతం పేరుతో మోడీ ప్రభుత్వం మోసం చేస్తుందని ఆరోపించారు.ఈ సమావేశంలో ఇంక్విలాబ్ సేన ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రాజేష్, నాయకులు వినోద్, యాదయ్య, నరేష్, లక్ష్మి, ఫర్జానా, ఆషియా రుక్సేనా తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన చట్టాన్ని తీసుకురావాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సమగ్ర కులగణన తీర్మానాన్ని స్వాగతిస్తున్నా మని ఇదే సమయంలో అన్ని రాజకీయ పార్టీలు ఈ తీర్మానానికి మద్దతు తెలుపడం హర్షనీయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం తెలిపారు.. ఆదివారం విద్య నగర్‌లో ఏర్పాటు చేసిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం కేంద్ర కోర్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానం అస్పష్టంగా ఉందని తీర్మానం కాకుండా దీనికి జ్యుడిషల్ కమిషన్ లేదా ప్రత్యేకమైన బిల్లు ప్రవేశపెడితే తెలంగాణ ప్రజానీకానికి మరింత ఉపయోగంగా ఉండేదన్నారు.. తెలంగాణలో ప్రభుత్వం మారినా నేటికీ బీసీలపై అవకాశాలపరంగా వివక్ష కొనసాగుతూనే ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో బీసీలకు నాలుగు మంత్రి పదవులు దక్కగా కాంగ్రెస్ పాలనలో నేడు కేవలం రెండు మంత్రి పదవులు మాత్రమే బీసీల చేతుల్లో ఉన్నాయన్నారు. బీసీలకు కూడా ఉప ముఖ్యమంత్రి పదవి దక్కాలని ఆకాంక్షి స్తున్నామన్నారు. అసెంబ్లీ తీర్మానం కంటే సమగ్ర కులగణనను చట్టం చేయడం మరింత మెరుగైన విధానమని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌటుపల్లి సురేశ్, తెలంగాణ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ జలపల్లి కిరణ్, గ్రేటర్ ఉపాధ్యక్షుడు పండరినాథ్ ,తదితరులు పాల్గొన్నారు.

మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందించాలి

- ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రయివేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకునే స్తోమత లేక సుదూర ప్రాంతాల నుండి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన పేద రోగులకు మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందించాలని ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ సూచించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసిన నర్సింగ్ ఆఫీసర్ల నియామకాలతో ఉస్మానియా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న 137 నర్సింగ్ ఆఫీసర్ల పోస్టులకు 115 మంది నర్సింగ్ ఆఫీసర్లు ఆసుపత్రిలో కొత్తగా విధుల్లో చేరారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయం కాన్ఫరెన్స్‌లో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఎంతో ఓర్పుతో వ్యవహరించాలన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు అక్కున చేర్చుకుని, సేవలు అందించాలన్నారు. రోగి సహాయకులను చీటికి మాటికి కసురుకోకుండా సమయ స్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. నర్సింగ్ ఆఫీసర్లు క్రమ శిక్షణ, సమయ పాలన పాటి స్తూ, ఉస్మానియా ఆసుపత్రి కల్చర్ను అలవర్చుకోవాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, సమయ పాలన పాటించక పోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. నూతనంగా విధుల్లో చేరిన నర్సింగ్ ఆఫీసర్లకు డాక్టర్ నాగేందర్ శుభాకాంక్షలు తెలియజేసి, సహచర సిబ్బందితో స్నేహ పూర్వక వాతావరణం సమన్వయంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ సాయిశోభ, ఆర్ఎంవో అనురాధ, గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ సుజాత రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆటోలకు డాక్యుమెంట్స్ నిబంధనను సడలించాలి'

- అఖిల భారత అసంఘటిత కార్మికులు, కర్షకుల కాంగ్రెస్ (కేకేసీ)



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఆటోలకు డాక్యుమెంట్స్ (ఫిట్‌నెస్) రెన్యువల్‌కు ఎల్పీజీ, సీఎన్జీ ట్యాంకులు రీ-టెస్ట్ నిబంధనను వెంటనే సడలించాలని అఖిల భారత అసంఘటిత కార్మికులు, కర్షకుల కాంగ్రెస్ (కేకేసీ) చైర్మెన్ కౌశల్ సమీర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమీషనర్ (జేటీసీ)ని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా చైర్మెన్ కౌశల్ సమీర్‌తో కలిసి కేకేసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పింగిలి సంపత్ రెడ్డి, ఆటో విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ మాట్లాడుతూ ఆటో పర్మిట్ కు ఉన్న రిప్లేస్మెంట్ అడ్రస్ నిబంధనను తెలంగాణ రాష్ట్రంలో ఉండేటట్లు చూడాలని కోరారు. ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ విషయంపై ఇటీవల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సైతం కలిసి విజ్ఞప్తి చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేకేసీ నాయకులు సత్యనారాయణ, మహ్మద్ ఫరూక్, శరత్ కుమార్, హైమద్ షరీఫ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'మార్చి 5న రవీంద్రభారతిలో ఇంటర్నేషనల్ జాతీయ శాంతి సదస్సు'



- గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ చైర్మెన్ డాక్టర్ హెచ్.ఆర్.రహమాన్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఎలక్ట్రానిక్ వ్యర్థ పదార్థాలపై నిపుణులతో మార్చి 5వ తేదీన రవీంద్రభారతిలో "ఇంటర్నేషనల్ జాతీయ శాంతి అవగాహన సదస్సు" నిర్వహిస్తున్నట్లు గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ హెచ్.ఆర్.రహమాన్ వెల్లడించారు.ఈ మేరకు ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ రెహమాన్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ జాతీయ శాంతి అవగాహన సదస్సుకు 18 రాష్ట్రాల్లోని ప్రతినిధులు పాల్గొంటారని, తాము ఇప్పటికే జమ్మూలో 180 పాఠశాల్లో 3.5 లక్షల విద్యార్థులకు, అధ్యాపకులకు ఎలక్ట్రానిక్స్ వ్యర్థ పదార్థాలపై అవగాహన కల్పించామని, రాజస్థాన్‌లో కూడా అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. ఈ సంవత్సరం హైదరాబాద్ లో నిర్వహించడానికి కమిటీ వేశామని తెలిపారు. గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నైనంపల్లి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా ఫాతిమా, మహిళా సాధికారత విభాగం అధ్యక్షురాలుగా డాక్టర్ శివపావని నియమితులైయ్యారని ఆయన వెల్లడించారు.

సీఎం రేవంత్ రెడ్డి మరొక పదేండ్లు సీఎంగా ఉండాలని పాదయాత్ర



నవతెలంగాణ-ఓయూ

సీఎం రేవంత్ రెడ్డి మరొక పదేళ్లు సీఎం గా ఉండాలని, దానికి వాతావరణం సహక రించాలని కోరుతూ సమ్మక్క సారక్కల వరకు యాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత ఓయూ జేఏసీ చైర్మన్ ఒరుగంటి కృష్ణ అన్నారు. ఆదివారం సాయంత్రం ఓయూ నుండి సమ్మక్క సారక్క వరకు ఒరుగంటి కృష్ణ ఆధ్వర్యంలో పాదయాత్రను ఆర్ట్స్ కళాశాల వద్ద నుండి ప్రారంభించారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఖజాన మొత్తం ఖాళీ చేసి కుటుంబం మొత్తం ఆస్తులు సంపాదించుకొని ఆర్థిక వ్యవస్థను దివాళా తీయించిన గొప్ప కుటుంబం కేసీఆర్ దేన్నారు. నేడు గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తు ఎన్నికల్లో హామీ ఇచ్చిన 6 గ్యారెంటీలు చిత్తశుద్ధితో అమలు చేస్తున్న దూరదృష్టి గల సీఎం రేవంత్ రెడ్డి పై విమర్శలు మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, లాల్, యాదగిరి, నరసింహ, సురేష్, సాయి, యాదగిరి, నగేష్, వంశీ, తో పాటు ఓయూ విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక వికాస ఉద్యమాలకు ఆద్యుడు భాగ్యరెడ్డి వర్మ



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

సామాజిక, ఆర్థిక, ఆత్మగౌరవ ఉద్యమాలకు భాగ్యరెడ్డి వర్మ ఆద్యుడని ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె శ్రీనివాస్ అన్నారు. ఆదివారం చాదర్ ఘాట్‌లోని ఆది హిందూ భవన్‌లో నిర్వహించిన భాగ్యరెడ్డి వర్మ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సమాజంలో ముఖ్యంగా దక్షిణ భారతదేశంలోని దక్కన్ పీఠభూమి కేంద్రంగా ఎన్నో సామాజిక సంస్కరణలకు బాధ్యుడిగా భాగ్యరెడ్డి వర్మ నిలిచారని పేర్కొన్నారు. చీకటి నుంచి వెలుగులు పంచిన జ్ఞాన యోధుడిగా భాగ్యరెడ్డి వర్మను అభివర్ణించారు. ప్రథమ ఆంధ్ర మహాసభ, తెలంగాణ సాయుధ పోరాటం, నిజాం వ్యతిరేక ఉద్యమానికి భాగ్యరెడ్డి వర్మ మొదలుపెట్టిన ఆది హిందూ ఉద్యమమే పునాదిగా అభిప్రాయ పడ్డారు. తెలంగాణగా నిలిచినటువంటి భాగ్యరెడ్డి వర్మను, ఆయన ఆలోచన విధానం, ఆచరణ, కార్యచరణను నేటి సమాజం అనుసరించాల్సిన అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. కేంద్ర బిందువుగా నిలిచిన భాగ్యరెడ్డి వర్మ 1930లో ప్రథమ ఆంధ్ర మహాసభ కు హాజరై అణగారిన వర్గాల పట్ల అణిచివేతను నిరసించారని పేర్కొన్నారు. ఆర్య సమాజం బ్రహ్మ సమాజంతో కలిసి పనిచేస్తూనే 1917లో విజయవాడలో జరిగిన పంచమం మహాసభకు వక్తగా వెళ్లి సమాజాన్ని చైతన్యవంతం చేసిన నేతగా ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారని చెప్పారు 1912లో ముంబై నుంచి వెలువడే ఆంధ్ర పత్రికలో భాగ్యరెడ్డి వర్మ హైదరాబాదులో ప్లేగు వ్యాధిపై చేపట్టిన అంశాలను రిపోర్టు చేస్తూ రాసిన ఆర్టికల్ అందరినీ ఆలోచింపజేసిందని చెప్పారు. ఇట్లా దక్షిణ భారతదేశంలో అనేక ప్రాంతాలను పర్యటించి దక్కన్ పీఠభూమిలో తెలంగాణ వైతాళికుల్లో అగ్రగన్యుడుగా పేరుందిన భాగ్యరెడ్డి వర్మ ఆశయాలను కొనసాగించాలని గుర్తు చేశారు. తెలంగాణ వికాస ఉద్యమానికి పునాదులు వేశాడని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు అంబేద్కర్ కంటే ముందే రాముడు కృష్ణుడు పురాణాలు వేదాలను ప్రశ్నించాలని పేర్కొన్న సంస్కరణ వాది భాగ్యరెడ్డివర్మ గా కీర్తించారు. ఈ కార్యక్రమంలో భాగ్యరెడ్డి వర్మ మెమోరియల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బాల నరసింహ ట్రస్టీ బియ్యం జ్ఞాన ప్రకాష్ వైస్ ప్రెసిడెంట్ బాల నరసింహ సత్యనారాయణ సెక్రటరీ అజయ్ గౌతమ్ కరస్పాండెంట్ శ్రీలత గౌతమ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బి సుధాకర్ జ్ఞానేశ్వర్ విజయ్, గద్దర్ కుమారుడు సూర్య కిరణ్, సీనియర్ జర్నలిస్టు ఆశ శ్రీరాములు సీనియర్ అధ్యాపకులు జాకబ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన చేయడం చారిత్రాత్మక నిర్ణయం



- టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్

నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం బీసీ కులగణన చేయడం చారిత్రాత్మక నిర్ణయమని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కులగణన చేపడతానని నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని బీసీ కులాలలో రాజకీయ చైతన్యం రావడానికి జనాభా దామాషా ప్రకారం ప్రాధాన్యత కల్పించడానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేస్తున్నటువంటి కుల గణన ఎంతో దోహద పడుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో గత పది సంవత్సరాలుగా బీసీలను తమ స్వార్థ ప్రయోజనాలకు వాడుకున్నారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ చిత్తశుద్ధితో బీసీ కులగనన చేపట్టడంతో రాష్ట్రంలో ఉన్నటు వంటి 17 పార్లమెంట్ స్థానాలను కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టడానికి ప్రజలు కంకణ బద్ధులై ఉన్నారన్నారు. ఈ సమావేశంలో టీపీ సీసీ అధికార ప్రతినిధులు దామోదర్ ఆవేల్లి, దయాకర్ గౌడ్, రామ చందర్ తదితరులు పాల్గొన్నారు

కర్పూర ఠాకూర్‌కు నివాళి



నవతెలంగాణ-ముషీరాబాద్

ఎన్టీఆర్ స్టేడియం హైదరాబాద్ నేషనల్ బుక్ ఫెయిర్‌లో జన నాయక్ కర్పూర ఠాకూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారతరత్న జననాయక్ కర్పూర ఠాకూర్ వర్ధంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి మాజీ హోంమంత్రి దేవేందర్ గౌడ్, సూర్యనారాయణ, బేబీ రాజు, గోపాల్ సింగ్, దామోదర్ రెడ్డి, బాలకిషన్ రావు, సోషలిస్టులు, పాశం.యాదగిరి, సీనియర్ జర్నలిస్టు, ప్రొఫెసర్ గట్టు సత్యనారాయణ, ప్రొఫెసర్ తిరుమలి, ప్రొఫెసర్ వెంకటేశం, డాక్టర్ జానయ్య, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

20న ఓయూ గేటు వద్ద సిరిపురం యాదయ్య వర్ధంతి

నవతెలంగాణ-అంబర్‌పేట:



తెలంగాణ స్వ రాష్ట్ర సాధన కోసం ఆత్మబలి దానం చేసుకున్న దివంగత సిరిపురం యాదయ్య వర్ధంతిని 20న మంగళవారం నిర్వహిస్తున్నట్లు సిరిపురం యాదయ్య స్మారక సమితి కన్వీనర్ ప్రొ.డాక్టర్ తాటికొండ వెంకటరాజయ్య తెలిపారు. ఉస్మానియా యూనివర్శిటీ ఎన్సీసీ గేటు వద్ద ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ కార్య క్రమానికి తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాప్రతిని ధులు, యాదయ్య అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆ త్యాగధనుడికి నివాళులర్పించాలని కోరారు. తెలంగాణలోని అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాల్లో కూడా సిరిపురం యాదయ్య స్మారక సభలు నిర్వహించాలని విన్నవించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
9
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
సోమవారం | ఫిబ్రవరి 19, 2024 | www.navatelangana.com

బాలానగర్‌లో యువకుడు అదృశ్యం



నవతెలంగాణ-బాలానగర్

ఇంట్లో నుంచి ఇప్పుడే వస్తానని చెప్పి వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలానగర్ రాజుకాలనీ రోడ్డులోని విజయ్ మెడికల్ షాప్ సమీపంలో నివాసం ఉంటున్న షాహిదాఖాన్ శ్రీకాంత్ ఏజెన్సీలో డెలవరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 12న రాత్రి 7 గంటల సమయంలో ఇప్పుడే వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన షాహిదా ఖాన్ తిరిగి ఇంటికి రాలేదు. మరుసటి రోజు అతడికి ఫోన్ చేయగా, మళ్లీ ఫోన్ చేస్తానని చెప్పి కాల్ కట్ చేశాడు. అనంతరం ఫోన్ స్విచ్ రావడంతో ఆచూకీ కోసం స్నేహితుల ఇండ్ల వద్ద విచారించినా ఫలితం లేకపోయింది. దాంతో కుటుంబ సభ్యులు బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేపట్టారు.

పుస్తె, మెట్టెలు బహూకరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

కళ్ళెం గ్రామంలో తిప్పారపు పద్మ-పరశురాములు ప్రథమ పుత్రిక లావణ్య పెండ్లి సందర్భంగా ప్రభుత్వ అధ్యాపకులు, దళిత రత్న అవార్డు గ్రహీత మబ్బు పరశురాం పుస్తె, మెట్టెలు బహుకరణగా అందించారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ ఫౌండేషన్ యూత్ అధ్యక్షుడు మబ్బు రాజు, సలహాదారులు మబ్బు నాగేష్, మబ్బు కరుణాకర్, జీడికంటి పరశురాం, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సంజీవరెడ్డిని సన్మానించిన కార్మికులు



నవతెలంగాణ-బాలానగర్

జాతీయ ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు డాక్టర్ జి.సంజీవరెడ్డి 94వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఉస్మానియా మెడికల్ కాలేజీ ఆడిటోరియం లో జరిగిన కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి, డిఫెన్స్ ప్రభుత్వ రంగ సంస్థల ఐఎన్‌టీయూసీ ఇన్‌చార్జి, బీడీఎల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు అహ్మదుల్లాహ్ ఆహ్వానం మేరకు హెచ్.ఏ.ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) కార్యవర్గ సభ్యులు అహ్మదుల్లాహ్ ఆధ్వర్యంలో పాల్గొని సంజీవరెడ్డిను శాలువాతో సన్మానించి పూల బొకేతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఏ.ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్.టీయూసీ) అధ్యక్షులు మహమ్మద్ సబ్బతుల్లాహ్, ప్రధాన కార్యదర్శి కర్కనాగరాజ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి పోలేపల్లి శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీ మజహార్, ఆర్గనైసింగ్ సెక్రటరీ అబ్దుల్ షకూర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ సత్తయ్య సేవలు మరువలేనివి



- మాజీ కౌన్సిలర్ పి.నరసయ్య

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత, గిరినగర్ ప్రాంత వ్యవస్థాపకులు, అమరజీవి కామ్రేడ్ వంగాల సత్తయ్య సేవలు మరువలేనివని మాజీ కౌన్సిలర్ పి.నరసయ్య పేర్కొన్నారు. ఆదివారం కామ్రేడ్ సత్తయ్య ఆరవ వర్ధంతి వేడుకలు సీనియర్ సీపీఐ నాయకులు, ప్రజానాట్య మండలి సభ్యులు బాల నరసయ్య అధ్యక్షతన రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి గుబురుగుట్ట స్మశాన వాటిక వద్ద ఉన్న స్మారకస్తూపం వద్ద నిర్వహించారు. ముందుగా ఆయన స్మారక స్తూపానికి కుటుంబ సభ్యులు, సీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ సత్తయ్య నేతృత్వంలో గతంలో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ప్రాగాటూల్స్ కంపెనీకి చెందిన స్థలంలో భూపోరాటం చేసి గిరినగర్ బస్తీని ఏర్పాటు చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. పేద ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి నిస్వార్థంగా సేవ చేయడంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కోసం జరిగిన ప్రజా పోరాటాలలో మడమ తిప్పని నాయకునిగా కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శిగా, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులుగా పార్టీలో చురుకుగా సేవలు అందించారని కొనియాడారు. ప్రస్తుత గుబురుగుట్ట స్మశాన వాటిక కూడా ఆయన ఆధ్వర్యంలో అప్పటి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి అప్పటికప్పుడు స్మశాన వాటికను వ్యవస్థీకరించారన్నారు. కామ్రేడ్ సత్తయ్య సేవలు పార్టీకి, స్థానిక ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని ఆయన ఆశ సాధన కోసం మనమందరం పని చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ కౌన్సిలర్ వంగాల చంద్రమ్మ, కుమారులు ఏఐటీయూసీ జిల్లా నాయకులు వంగాల శ్రీనివాస్, జీహెచ్ఎంసీ ఎస్. ఎఫ్.ఏ.వంగాల గణేష్, సీపీఐ శాఖ కార్యదర్శి ఎండి.యాకూబ్, సీనియర్ నాయకులు దయ్యా యాదగిరి, నాయకులు సంతోష్, రంగస్వామి, వెంకటేష్, చంద్రమోహన్, స్థానిక బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



- ఎస్.పి.ఆర్ గ్లోబల్ పాఠశాల చైర్మెన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్.పి.ఆర్ గ్లోబల్ పాఠశాల చైర్మెన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజుల రామారం డివిజన్ పరిధి బాలాజీ లేఅవుట్‌లో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమాన్ని బాధ్యుడిగా వ్యవహరిస్తూ ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశనుండే విద్యార్థులు ఏ రంగాల్లో రాణిస్తారో దానిపై శిక్షణ పొందాలని అప్పుడే వారు అనుకున్న గమ్యాన్ని అవలీలగా సాధిస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థులతో పాటు సరదాగా ఆయన క్రికెట్‌ను ఆడారు. ఇటువంటి కార్యక్రమాన్ని ప్రోత్సహించిన బాలాజీ లేఅవుట్ సభ్యులకి, ముఖ్యంగా ఈ పోటీలను బాధ్యతగా వ్యవహరిస్తున్న కృష్ణకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు ప్రతిభ కనబరిచిన రంగంలో తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే వారు ఉన్నత శిఖరాల అధిరోహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, అనూప్ కుమార్, అష్రఫ్, మహేష్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో శివ స్వాములకు అన్నదానం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

శ్రీ ఉమామహేశ్వర ఆలయం శైవ క్షేత్రం సూరారం ఎక్స్ రోడ్ హైదరాబాదు నందు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వందలాదిమంది శివ భక్తులకు శివ పూజ నిర్వర్తించారు. అనంతరం అందరికీ తీర్థప్రసాదాలు, స్వామివారి ప్రసాదంగా భావించిన అన్నదానము, పెద్ద ఎత్తున భజన కార్యక్రమాలు చందు గురుస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఇంత పెద్ద ఎత్తున ఈ ఉమామహేశ్వర టెంపుల్‌లో తప్ప ఇంతమంది శివ స్వాములు ఆలయం కొచ్చి ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వర్తించినందుకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ముద్దాపురం మదన్ గౌడ్ శివ స్వాములందరికీ పాదాభివందనం చేశారు. కార్పొరేటర్ సురేష్ రెడ్డి,బీజేపీ నాయకులు మల్లేష్, సుభాష్ డివిజన్ కార్యదర్శి శివాజీ, శ్రీరామ్ పరశురాం పంతులు రవి పంతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యను పరిష్కరిస్తాం



- మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

అండర్ గ్రాండ్ డ్రయినేజీ సమస్యలు పరిష్కరిస్తాం అని, సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన ఏకైక లక్ష్యమని 130 డివిజన్ మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి అన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఆదివారం సుభాష్ నగర్ డివిజన్ పరిధి సూరారం రాజీవ్ గృహకల్పలోని 101,102,103 బిల్డింగ్‌లలో నెలకొన్న అండర్ గ్రౌండ్ డ్రయినేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీ ప్రెసిడెంట్ శివ గౌడ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు, మాజీ కార్పొరేటర్‌ను కలిసి, సమస్యను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యపై స్పందిస్తూ.. త్వరితగతిన చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు మాజీ కార్పొరేటర్ ఆదేశించారు. వీలైనంత త్వరగా అండర్ గ్రౌండ్ డ్రయినేజీ వ్యవస్థను మెరుగుపరచి రోడ్డును వెంటనే పునరుద్ధించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గృహకల్ప వాసులు, సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ నగరానికి చెందిన ప్రముఖ నాట్య సంస్థ నటరాజ నత్య సమితి అధినేత తరంగిణి తన శిష్య బందం రాధ, సంధ్య, ఋషిత, షష్మికలతో కలిసి తిరుమల శ్రీ వెంటేశ్వర ఆలయ ప్రాంగణ మాడ వీధుల్లో నర్తించారు.

నవతెలంగాణ-కల్చరల్

సమస్యల పరిష్కారానికి కృషి



- చెకుపల్లి భరత సింహారెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

132 జీడిమెట్ల డివిజన్ ప్రజల సమస్యలు డివిజన్ కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి అన్నారు. ఆదివారం 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలో జీడిమెట్ల గ్రామంలో స్థానికులతో కలిసి పర్యటించి స్థానికులు పడుతున్న ఇబ్బందులును అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్నవంటి డ్రయినేజీ, రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ వాటర్ వర్క్స్ అధికారులను చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో డి.కుమార్ స్వామి, మహిపాల్ రెడ్డి, యశ్వంత్, అరవింద్, సతీష్, కృష్ణ, సత్యనారాయణ, భవాని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు సమస్యలు లేకుండా చూడాలి



నవతెలంగాణ-సంతోష్ నగర్

కర్మన్ ఘాట్ ఆలయంలో భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆలయ ఈవో శ్రీనివాస్ శర్మ, చైర్మెన్ నల్ల రఘు మారెడ్డి అన్నారు. ఆదివారం కర్మన్‌ఘాట్ శ్రీ ధ్యాన ఆంజనేస్వామి దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు, టీన్స్ షెడ్లు, ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంటుకు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు బబ్బురి ఆనంద్ గౌడ్, చాతిరి మధు సాగర్, సతీష్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, బి. అంజిరెడ్డి, శ్రీమతి శైలజ, చేగొని సురేష్ గౌడ్, మేకల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బడంగ్ పెట్ మునిసిపల్ కార్పొరేషన్ 27వ డివిజన్ ప్లాటినం 1లో వినాయకుడి గుడి భూమి పూజ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, స్థానిక కార్పొరేటర్ తోట శ్రీధర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేవాలయాల అభివద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. ప్రజలు దైవభక్తి కల్గి ఉన్నపుడే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తోట శ్రీధర్ రెడ్డి, మాజీ ఎం.పి.టి.సి శ్రీరామ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుబాన్ యాదవ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

దయానందుని బోధనలు నేటి సమాజానికి అవసరం



- హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

నవతెలంగాణ-కల్చరల్

కులం, మతం వారీగా మనుషులు విడిపోతున్న నేటి సమాజంలో దయానంద సరస్వతి బోధనలు అవసరం ఉందని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మనుషులందరినీ ఐక్య పరిచేది ధర్మం ధార్మిక జీవనం అని దయానందుడు బోధించారనీ వివరించారు. కేంద్ర సాంస్కతిక శాఖ నిర్వహణలో మహర్షి దయానంద సరస్వతి 200 జయంతి ఉత్సవ కమిటీ నిర్వహణలో నిజాం కళాశాల నుంచి రవీంద్ర భారతి వరకు శోభ యాత్ర ఆదివారం సాగింది. యాత్రను ప్రారంభించిన బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ దయానంద మూఢ ఆచారాలు, వైదిక కర్మ కాండలు వ్యతిరేకించి కులాల అడ్డుగోడలు తొలగించే అధ్యాత్మిక ఉద్యమం చేపట్టి ప్రగతికి బాటలు వేశారని అన్నారు. అనంతరం రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై జరిగిన సభలో ముఖ్య అతిథిగా ఢిల్లీ ఆర్య ప్రతినిధి సభ మహా మంత్రి వినయ్ ఆర్య హాజరై మాట్లాడుతూ నేటి దేశ సమస్యలు పరిష్కారం దయానందుని ఆర్య సమాజమే మార్గమని తెలిపారు. స్వాగతం పలికిన కేంద్ర కమిటీ సభ్యుడు ధర్మ తేజ మాట్లాడుతూ అజ్ఞానం, అభద్రతా భావం, అవివేకంలను పారద్రోలే వెలుగు దయానందుని బోధనలు ఆచరణ అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భారత్, ఉదయన్, నళిని, రామ్ చంద్ర, రాజు, ప్రదీప్, రాజు తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మకు నివాళులు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

అందరికీ విద్యనందించెందుకు అలుపెరుగని కృషి చేసిన సామాజిక విప్లవకారుడు భాగ్యరెడ్డి వర్మ అని ప్రముఖ సంఘసంస్కర్త మ్యాదరి భాగ్యరెడ్డి వర్మ 85వ వర్ధంతినీ పురస్కరించుకుని, గ్రేటర్ హైదరాబాద్ అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కర్క నాగరాజు ఆధ్వర్యంలో, మూసాపేట్ గూడ్స్ షెడ్ రోడ్ వద్ద నున్న అంబేద్కర్ విగ్రహం దగ్గర భాగ్యరెడ్డి వర్మ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర దళిత నాయకులు కర్క పెంటయ్య ముఖ్య అతిథిగా హాజరై అయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అణిచివేతకు, అన్యాయానికి, సామాజిక అసమానతలకు, వివక్షతకు వ్యతిరేకంగా అందరికీ విద్య అందించడానికి అలుపెరుగని కృషి చేసిన సామాజిక విప్లవకారుడు భాగ్య రెడ్డి వర్మ అని, హైదరాబాద్ చాదర్ఘాట్ ప్రాంతం లో 26 బాలికల పాఠశాలలు ఏర్పాటు చేసి పేద బడుగు బలహీనవర్గాలకు విద్య నందించారు అని తెలిపారు. యువకుల కోసం జగన్ మిత్రమండలి స్థాపించి దళితుల సమస్యల పై పోరాటం చేసారు. దేశంలో దళితుల సమస్యలపై మాట్లాడడానికి రౌండటేబుల్ సమావేశంలో తనకు పాల్గొనే అవకాశం ఉన్న బాబాసాహెబ్ అంబేద్కర్ పేరును ప్రతిపదించిన గొప్ప నాయకుడు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పటోళ్ల నాగిరెడ్డి, శారదారెడ్డి, అంబేద్కర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కర్కడాకయ్య, కర్క రవీందర్, బీసీ నాయకులు భాశెట్టి నర్సింగరావు, భాషీపాక యాదగిరి, ఖాన్, బాషా, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ అసోసియేషన్ చేయూత



- స్నేహితుడి కూతురు పెండ్లికి మేము సైతం అన్న ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

స్నేహానికన్నా మిన్న లోకాన లేదురా.. కడదాక నీడలాగా నినువీడి పోదురా...అన్న నానుడిని జగద్గిరిగుట్ట ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు నిజం చేసారు. సామాజిక సేవలతో పాటు పలు రకాల స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మేము సైతం అంటూ వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్టకు చెందిన ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సంఘ సభ్యులు స్నేహానికి పుట్టినిల్లుగా విరాజిల్లుతోంది. ఆదివారం తోటి స్నేహితుడైన కీ.శే.మల్లెపు ప్రవీణ్ కుమార్ ముదిరాజ్ (సంఘ సేవకులు)ఆయన కుమార్తె మల్లెపు తరుణి, రాహుల్ ముదిరాజ్‌ల వివాహానికి తమ వంతు బాధ్యతగా మనోధైర్యాన్నిస్తూ సహాయ సహకారాలు అందజేశారు. ఈ సందర్భం గా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రవీణ్ ముదిరాజ్ లాంటి గొప్ప వ్యక్తిని కోల్పోవడం బాధాకరమని వారు విచారం వ్యక్తం చేశారు. గత మూడున్నర దశాబ్దాలుగా ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ స్థాపించిన నాటినుండి సభ్యులు పేద విద్యార్థులకు,పేద ప్రజలకు చేయూతనందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అండగా నిలబడుతున్నామన్నారు. భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్, జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్, సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, వివేకానంద నగర్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించా రు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శబరిమలలోని హరిహరపుత్రుడు అయ్యప్ప స్వామి వారిని ఆదివారం, సాయం సంధ్యా వేళ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దర్శించుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, దొడ్ల వెంకటేష్ గౌడ్, తూము శ్రవణ్ కుమార్, నాయినేని తులసిరావు, గోనె శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి



చీరలో మగువల అందం రెట్టింపు

● డాక్టర్ తేజస్విని



నవతెలంగాణ-బంజారాహిల్స్

సాంప్రదాయ చీరకట్టుతో మగువల అందం రెట్టింపు అవుతుందని ప్రముఖ వైద్యురాలు, యోగా ట్రైనర్ తేజస్విని మనోజ్ఞ అన్నారు. ఆదివారం అమీర్‌పేట ధరంకరం రోడ్డులో ఏర్పా టు చేసిన వధు సిల్క్స్‌ను ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి ఆమె మాట్లాడారు. ఆధునిక దుస్తులు ఎన్ని ఉన్నా మగువలు మెచ్చే వస్త్రాలు చీరలేనని అన్నారు. భారతీయ సాంప్రదాయ చీరకట్టు యావత్ ప్రపంచాన్ని ఆకట్టుకుంటుందన్నారు. అభివృద్ధి చెందిన దేశాల మహిళల సైతం ఇక్కడి చేనేత కళాకారుల రూపొందించే వస్త్రాలను ధరించి సంతోషిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సునీత త్రివేణి వాణి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ మాజీ ఎంపీ రాజయ్య ప్రమాణ స్వీకారోత్సవం చేశారు. ఈ సందర్భం గా ఆయన కార్యాలయంలో ఆది వారం సోమాజిగూడ కార్పొరేటర్ అభ్యర్థి నరికెళ్ళ నరేష్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకముందు ఆయన ఎల్లారెడ్డి గూడ ఎల్లమ్మ గుడి లో కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.
నవతెలంగాణ-బంజారాహిల్స్

అంగన్వాడీలకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

● అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) హైదరాబాద్ నగర నాయకులు టి.మహేందర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు వేతనాలు దాదాపు 3నెలల నుంచి రాక పోవడంతో అనేక ఇబ్బందులు పడు తున్నారని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) హైదరాబాద్ నగర నాయకులు టి.మహేందర్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. పెండింగ్ వేతనాలు విడుదల చెయ్యాలని డిమాండ్ చేశారు. అలాగే అంతకు ముందు సమ్మె కాలానికి రావాల్సిన వేతన బకాయిలు కూడా పెండింగ్ లోనే ఉన్నాయని.. వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ అధికారులకు ఎంత విన్నవించుకున్నా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. అంగన్వాడీ టీచర్స్,హెల్పర్స్‌కు పతినెలా ఒకటవ తేదీన గౌరవ వేతనం చెల్లించాలి కానీ అలా చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గం అని అన్నారు. వెంటనే 3 నెలలు బకాయిలు ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అందరినీ సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అఖిల భారత విద్యార్థి సదస్సు పోస్టర్స్ విడుదల



నవతెలంగాణ-ఓయూ

ఎన్ఈపీ-2020 ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25, 26 వ తేదీల్లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించబోయే అఖిల భారత విద్యార్థి సదస్సును జయప్రదం చేయాలని విద్యార్థి నేతలు కోరారు. తెలంగాణలో అన్ని జిల్లాల్లో కాంపెయిన్ కోసం ఓయూ ఎన్ఆర్ఎస్ హాస్టల్ నుంచి బయలు దేరారు. ఈ కార్యక్రమాన్ని భారత్ బచావో నేషనల్ వైస్ చైర్మెన్ డా. గోపీనాథ్, నేషనల్ కమిటీ సభ్యులు సోమయ్య, జంజెర్ల రమేష్‌ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఓయూ రీసెర్చ్ స్కాలర్స్ ఆజాద్, యాదగిరి, లక్ష్మణ్, తల్లా అజయ్, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

గ్లామ్ వాక్.. డ్రోన్ షో..



● సీఎంఆర్ ఫ్యామిలీ మాల్ ఆధ్వర్యంలో వినూత్న ప్రదర్శన

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఒకటి కాదు.. రెండు కాదు.. వందల సంఖ్యలో డ్రోన్స్ వీక్షకుల కండ్ల ముందు ఆకాశాన్ని చుట్టేశాయి. నగరవాసుల్ని ఆశ్చర్యానుభూతులను అందించాయి. నగరానికి చెందిన ప్రముఖ వస్త్రాభరణాల సంస్థ సీఎంఆర్ ఫ్యామిలీ మాల్ ఆధ్వర్యంలో కుకట్‌పల్లిలోని కైత్లాపూర్ గ్రౌండ్‌లో నిర్వహించిన సీఎంఆర్ మెగా డ్రోన్ షో పేరిట వందల సంఖ్యలో డ్రోన్లు వందల అడుగుల ఎత్తున చిత్ర విచిత్ర విన్యాసాలు చేయడం నగరవాసుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది. ఈ షోలో సీఎంఆర్ సంస్థకు సంబంధించిన విశేషాలు, విభిన్న రకాల ఉత్పత్తులు, ప్రత్యేకతలను వివరించింది. ఈ ప్రదర్శన కొత్త పుంతలు తొక్కుతున్న సిటీ బిజినెస్ ట్రెండ్స్‌కు నిదర్శనంగా సాగింది. మరోవైపు సీఎంఆర్ లెగసీ ఆఫ్ జ్యూయలరీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లామ్ వాక్ కూడా కండ్లు జిగేల్ అనిపించింది. సీఎంఆర్‌కు మాత్రమే ప్రత్యేకించిన ఆభరణాల విశిష్టతలకు ఈ ప్రదర్శన అద్దం పట్టింది. బిగ్ బాస్ ఫేం జెస్సీ సారథ్యంలో జరిగిన ఈ ర్యాంప్ వాక్‌లో అందమైన మోడల్స్ ఆభరణాల అందాలను మేనిపై మెరిపిస్తూ జ్యూయలరీ ప్రియులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సీఎంఆర్ చైర్మెన్ ఎండీ సత్యనారాయణ మాట్లాడుతూ నగరవాసులకు వైవిధ్యభరిత అనుభూతిని అందించడానికే వ్యయప్రయాసలను పట్టించుకోకుండా డ్రోన్ షో నిర్వహించామన్నారు. కనీసం 3 నెలల ముందు నుంచే ఈ ప్రదర్శన ఏర్పాట్లు ప్రారంభించామని, ఈ షో నిర్వాహణ కోసం సాంకేతిక నిపుణులు ప్రత్యేకంగా ఢిల్లీ నుంచి తరలి వచ్చారని వివరించారు. ఉత్పత్తుల్లో మాత్రమే కాదు ప్రమోషన్, ఈవెంట్స్‌ల్లో కూడా తమదైన విశిష్టతను ప్రదర్శించారంటూ ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన అతిథులు, ఆహుతుల్లో పలువురు సీఎంఆర్ నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు.

అజహరుద్దీన్ తనయుడు మహ్మద్ అసదుద్దీన్

యూత్ కాంగ్రెస్ స్పోర్ట్స్ సెల్ చైర్మన్‌గా నియామకం



నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలంగాణ ప్రదేశ్ యూత్ కాంగ్రెస్ స్పోర్ట్స్ సెల్ చైర్మన్‌గా సీనియర్ కాంగ్రెస్ నేత, జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ అజహరుద్దీన్ తనయుడు మహ్మద్ అసదుద్దీన్ నియమితుల య్యారు. ఈ మేరకు ఆయనకు ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీవీ.శ్రీనివాస నియామక పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసే కార్యకర్తలను పార్టీ తప్పకుండా గుర్తిస్తుందని తనను పార్టీ గుర్తించి ఈ పదవిని అప్పగించడం సంతోషంగా ఉందని అన్నారు. తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని అసదుద్దీన్ అన్నారు. తనకు ఈ పదవిని ఇచ్చినందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు, సోనియాగాంధీకి, రాహుల్ గాంధీకి, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మెరుగైన సమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

● ప్రముఖ మెజీషియన్ సామల వేణు



నవతెలంగాణ-బంజారాహిల్స్

జర్నలిస్టులు మెరుగైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రముఖ మెజీషియన్ సామల వేణు తెలిపారు. తెలంగాణ మున్నూరుకాపుల జర్నలిస్టు ఫోరం నూతన సంవత్సరం క్యాలెండర్, మున్నూరు కాపు యూత్ ఫోర్స్ స్టిక్కర్లను ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో రాష్ట్ర అధ్యక్షులు కొత్త లక్ష్మణ్ పటేల్తో కలిసి ఆవిష్కరించారు. సామ ల వేణు మాట్లాడుతూ ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిగా జర్నలిస్టులు పనిచేస్తున్నారని, ప్రజా సమస్యలను భుజాన వేసుకొని కుటంబాలను సైతం మరిచిపోయి పనిచేస్తారన్నారు. జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా ఉంటే మరింత మెరుగైన సమాజ నిర్మాణానికి పాటు పడుతారన్నారు.మూన్నూరుకాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్రంలోని జర్నలిస్టుల పక్షాన నిలబడి వారి సమస్యలు తీర్చేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో 5వేల మంది సభ్యత్వం ఉండడం సంతోషకరమని, అదే తరుణంలో పేద, మధ్యతరగతి జర్నలిస్టులకు సైతం అండగా నిలబ డాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్నూరుకాపు సంఘం మహిళా అధ్యక్షురాలు బండి పద్మ, సీనియర్ జర్నలిస్టులు తులైల శ్రీని వాస్, డాక్టర్ పీఎల్ఎన్ పటేల్, టీఎంకేజేఎఫ్ హైదరాబాద్, నల్గొండ, కరీంనగర్, సూర్యపేట జిల్లాల అధ్యక్షులు పగడాల అరుణ్ కుమార్, తుడి జనార్ధన్, వేల్పుల శ్రీనివాస్, వీరాంజనేయులు, మున్నూరుకాపు (కాపు) విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు మేనేజింగ్ ట్రస్టీ ఆకుల వి. పాండురంగారావు, ట్రస్టీలు మందసూర్యప్రకాశ్, నిమ్మశంకర్, చంద్ర శేఖర్, ఉద్యోగుల సంఘం అధ్య క్షులు బాలశ్రీనివాస్, సుంకరి రామూ ర్తి, ఆకుల రవీందర్, రంజిత్, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంక టరమణ, ఉపాధ్యక్షులు అభూతి శ్రీనివాస్, ఇప్ప రకేశ్ పటేల్, యూత్ ఫోర్స్ నాయకులు తోట సాయిచరణ్, అభిషేక్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నిధులు పేద విద్యార్థులకే చెందాలి

● మున్నూరు కాపు వసతి గృహం ట్రస్టి ఆకుల పాండు రంగారావు



నవతెలంగాణ-బంజారాహిల్స్

మున్నూరు కాపు వసతి గృహం నిరుపేదల కోసం నిర్మించిందని, దాని నిధుల విషయంలో అవకతవకలు జరుగు తున్నాయన్న అనుమానాన్ని మున్నూరు కాపు వసతి గృహం ట్రస్టీ ఆకుల పాండు రంగారావు వ్యక్తం చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాండు రంగారావు మాట్లాడుతూ వసతి గృహం 1965లో మున్నూరు కాపు కులంలో పేద విద్యార్థుల కోసం నిర్మించారని, సేవా దృక్పదంతో నిర్మితమైన ఆవసతి గృహంలో నేడు కొంతమంది ట్రస్టీల వల్ల విద్యార్థులకు అన్యాయం జరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. వాసవి గృహానికి సంబంధం లేని బ్యాంక్ అకౌంట్ ద్వారా లావాదేవీలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగం జరిగాయన్న అనుమానం వ్యక్తం చేశారు. తాము కూడా ట్రస్టీలమే అయినా మమ్మల్ని సంప్రదించకుండానే అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. అవి పిల్లల డబ్బులు అని వాటిని వసతి గృహం అభివృద్ధి కొరకు మాత్రమే వినియోగించాలని ఈ విషయమై తాము ఆయనను ప్రశ్నిస్తే మీకు మెజారిటీ లేదని, మీకు అడిగే అధికారం లేదని అంటున్నాడని వాపోయారు. ఆయన తన ఇష్టారాజ్యాంగ కొత్తగా ముగ్గురిని ట్రస్ట్ సభ్యులుగా తీసు కున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ట్రస్టీలు సూర్య ప్రకాష్, నిమ్మశంకర్, రాఘవేందర్ పాల్గొన్నారు.

ఓయూ పూర్వ విద్యార్థులారా..! సమస్యలపై దృష్టి పెట్టండి..!



ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య

నవతెలంగాణ-ఓయూ

ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీలో ఓయూ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అనేక సన్మానాలు, సదస్సులను నిర్వహిస్తున్నారు.ఆ కార్యక్రమాలను స్వాగతిస్తున్నామని ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య ఆదివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సన్మానాలు సదస్సులతోపాటు ఓయూలో దీర్ఘ కాలంగా నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఓయూ వీసీతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ఓయూలో గత 15 సంవత్సరాలుగా నియామకాలు లేక తీవ్రమైన అధ్యాపకుల కొరత ఉండే విద్యార్థులు నాణ్యమైన విద్య పొందలేకపోతున్నారని. దీనికి తోడు గడిచిన రెండు సంవత్సరాల కాలంలో ఓయూ వీసీ ప్రొ. రవీందర్ ఏక పక్షంగా డిగ్రీ, పీజీ, పిహెచ్డి, లా, ఇంజనీరింగ్ తదితర కోర్సులకు వేల రెట్లు ఫీజులను పెంచారు. ప్రస్తుతం ఓయూలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీలలో పేద విద్యార్థులు మాత్రమే చదువుతున్నారు ఫీజులు పెంచడం వల్ల వాళ్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు కానీ పూర్వ విద్యార్థులు ఏమాత్రం పట్టించుకోలేదు. కేంద్ర ప్రభుత్వం ఫెలోషిపులను తగ్గించిన రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌ల నిధులను మంజూరు చేయక వందలాది మంది విద్యార్థులు తమ సర్టిఫికెట్లను తీసుకోలేకపోతున్నారు. పూర్వ విద్యార్థుల నుంచి కోట్లాది రూపాయలను విరాళాలుగా వసూలు చేసి వివిధ అభివృద్ధి పనులు చేస్తున్నామని, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు ప్రస్తుత విద్యార్థుల పేదరికం కూడా గుర్తించి పూర్వ విద్యార్థుల సంఘం నిధుల నుంచి పేద విద్యార్థులకు నెలకు పదిహేను వేల చొప్పున పరిశోధక విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

భవ్య,వైష్ణవి మరణాలపై ప్రభుత్వం స్పందించాలి



-భవ్య వైష్ణవి న్యాయ పోరాట కమిటీ

నవతెలంగాణ-బంజారాహిల్స్...

ఫిబ్రవరి 2వ తేదీన భువనగిరి పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో పదవ తరగతి చదువుతున్న భవ్య, వైష్ణవిల అనుమానాస్పద మృతి రాష్ట్ర ప్రజలను కలచివేసిందని పలు మహిళా సంఘాలు తెలిపింది. ఈ మేరకు ఆదివారం సోమాజి గూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళా సంఘాల నాయకులు, వక్తలు పాల్గొని ప్రసంగించారు. వారు మాట్లాడుతూ భువనగిరి పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో పదవ తరగతి చదువుతున్న భవ్య, వైష్ణవిల అనుమానాస్పద మృతి చాలా బాధకరమని, ఈ ఘటనతో వారి కుటుంబ సభ్యుల తల్లిదండ్రులు బంధుమిత్రులు కన్నీరు మున్నీరై విలపించారన్నారు. వీరిద్దరూ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాళ్ళు కాదని, హాస్టల్లో, ఆటో డ్రైవర్, కుక్ ల అసభ్య ప్రవర్తనలను,వార్డెన్‌ను నిరంతరం ప్రశ్నించడం,అధికారులకు ఫిర్యాదు లు చేయడం తదితర పలు విషయాలు జరిగాయన్నారు. అదేవిధంగా వారు మాట్లాడుతూ అన్ని గురుకుల హాస్టళ్లలో సీసీ కెమెరా లను అమార్చాలని, ప్రతి హాస్టల్లో పోలీస్ సిబ్బందితో భద్రత కల్పించాలన్నారు. వార్డెన్ శైలజను,ఆటో డ్రైవర్ ఆంజనేయులను వెంటనే అరెస్టు చేయాలని భవ్య వైష్ణవిల న్యాయ పోరాట కమిటీ నుండి డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగస్వామ్య సం ఘాలు మద్దతు చైతన్య మహిళా సంఘ రాష్ట్ర కన్వీనర్,జ్యోతి, ప్రగతిశీల మహిళా సంఘ సభ్యులు స్వరూప, బహుజన సేన వాసు కె యాదవ్, పౌర హక్కుల,మానవ హక్కుల వేదిక, పి.యు.సి.ఎల్, తెలంగాణ ప్రజాఫ్రంట్-రాంబాబు,విప్లవ రచయితల, తెలం గాణ జర్నలిస్టు ఫోరమ్ మేకల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు

మీ సొంతింటి భోజనాలయం ఉడిపి



నవతెలంగాణ-బంజారాహిల్స్

గత 24 సంవత్సరాలనుండి హెూటల్ రంగంలో విశేష సేవలందిస్తున్న ఉడిపి హెూటల్ వారు సంజీవ రెడ్డినగర్‌లో నూతన హెూటల్‌ను నిర్వాహకులు పి.గణేష్ ప్రసాద్ భట్, పి.మనోహర్ భట్, పి.గిరీష్ భట్ ముగ్గురు సోదరులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న నాగరికతకు సరిపడేలా ప్రజలందరికి రుచికరమైన శాఖహార వంటకాలను అందించాలనే సత్సం కల్పంతో ఆదివారం సంజీవ రెడ్డి నగర్లో తమ నూతన హెూటల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. వారు మాట్లాడుతూ హెూటల్ ఉడిపి హెూమ్ స్వచ్ఛ తకు, శుభ్రతకు మారుపేరైన ఉడిపి హెూటల్స్, శాఖహారంతో కూడిన రుచికరమైన వంటకాలు, టిఫిన్‌లను అందిస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ హెూటల్ వివిధ రంగంలో పలు రాష్ట్రాలలో ఇప్పటికే ప్రసిద్ధిగాంచిందన్నారు.

భాగ్యరెడ్డివర్మ 85వ వర్ధంతి



నవ తెలంగాణ-ఓయూ

భాగ్యరెడ్డి వర్మ వర్ధంతిని ఆల్‌మాల స్టూడెంట్స్ అసోసియేషన్, హంస అధ్యక్షులు నామ సైదులు ఆధ్వర్యంలో ఓ యూలో ఆదివారం ఆర్ట్స్ కళాశాల వద్ద నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘసంస్కర్త, దళిత ఆత్మగౌరవ పతాక, దళిత ఉద్యమ, తొలిపొద్దు భాగ్యరెడ్డి వర్మ హైదరాబాద్ సంస్థానంలో దళిత బాలికల కోసం 26 పాఠ శాలు స్థాపించి వారి అభ్యున్నతి కోసం కృషి చేశారు అన్నారు. యావత్ విద్యార్థులోకం భాగ్యరెడ్డి వర్మ విశ్వసించిన లక్ష్యాలు ఆశయాలు కోసం పనిచేయాలని సమ సమాజ స్థాపనకు అడుగులు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు నెల్లి సత్య, దుర్గం వినోద్, కరుణాకర్, గోవర్ధన్, హరికృష్ణ, నగేష్ , విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

సీఎం నిర్ణయం హర్షణీయం



నవతెలంగాణ-ఓయూ

శాసనసభలో బీసీ సమగ్ర కులగణన తీర్మా నాన్ని ఏకగ్రీవంగా ఆమోదం పొందడంతో శాసన సభ ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్ర మార్కలను టీపీసీసీ అధికార ప్రతినిధి లోకేష్ యాదవ్ కలిసి ధన్యవాదాలు చెప్పారు. వారు మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటామని, లోక్‌సభ ఎన్నికల్లో 17 స్థానాలు గెలిచే విధంగా ప్రయత్ని స్తామన్నారు. ఇది బీసీలు పట్ల ప్రభుత్వం తన ప్రేమను చాటుకుందని ఈ సందర్భంగా తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-బంజారాహిల్స్

గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీ సులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బంజారాహిల్స్ రోడ్‌నెంబర్14 బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి సమీ పంలోని ఫుత్‌పాత్‌పై గత కొన్ని ఏండ్లుగా ఒక వ్యక్తి (50 నుండి 55 సంవత్సరాల వయసు) భిక్షాటన చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. అతడు రాత్రి మృతిచెందినట్లు పలువురు స్థానికులు తెలిపారు. అనంతర శుక్రవారం ఉదయం బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అనాధ శవంగా గుర్తించినట్లు తెలిపారు.

మహంకాళి దేవాలయ స్థలాన్ని కాపాడండి

● ఆలయ పరిరక్షణ కమిటీ డిమాండ్

● బోర్డు బీఆర్ఎస్ మాజీ సభ్యుడు కబ్జా చేస్తున్నాడని ఆరోపణ



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని తిరుమలగిరి లాల్ బజార్‌లో చారిత్రాత్మక మైన వందల సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ స్థలాన్ని కబ్జాల నుండి కాపాడాలని ఆలయ పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. అధ్యక్షుడు మురళీధర్‌రావు అధ్యక్షతన కమిటీ శనివారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఈనెల 21న ర్యాలీ నిర్వహించినట్లు తీర్మానించినట్లు తెలిపారు. కాగా చారిత్రాత్మకమైన ఈ ఆలయ స్థలాన్ని కబ్జాల నుండి కాపాడాలని రక్షణ కమిటీ ప్రతినిధులు హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను దేవాదాయశాఖ కోరుతున్నారు. బోర్డు స్థానిక మాజీ సభ్యులు ఒకరు ఈ ఆలయ స్థలాన్ని కబ్జా చేశారని ఆరోపించారు. కానీ ఆ సభ్యుడు ఆ స్థలానికి వేరొకరి దగ్గర డబ్బులిచ్చి కొన్నట్లు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులను రానేకుండా చెత్తాచెదారాలు, కూల్చివేసిన వ్యర్థ మట్టిని ఇటుకలను, ఆలయ పక్కకే వేస్తున్నాడని, ఆలయానికి వచ్చ భక్తులు తీవ్ర ఇబ్బందికి గురి కావాల్సి వస్తుందని పరిరక్షణ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. స్థలాన్ని కాపాడుకునేందుకు కమిటీ ద్వారా ఈనెల 21వ తేదీన శాంతియుత ర్యాలీని చేపడుతున్నట్లు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఇంకా భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమం చేసేందుకు కూడా పరిరక్షణ కమిటీ ప్రణాళిక సిద్ధం చేస్తోందన్నారుజకాగా దేవాదాయ శాఖలో ఉన్న కొంతమంది అధికారులు కూడా మాజీ బోర్డు సభ్యునికి సహకరించడం వల్లనే ఆ సభ్యుడు ఆ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని కూడా భక్తులు తీవ్రంగా ఆరోపణలు చేస్తున్నారు.

ఉద్యోగాల్లో సత్తాచాటిన ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థులు

● పిన్సిపాల్ ప్రొ.వి.సత్యనారాయణ హర్షం



నవ తెలంగాణ, ఓయూ:

ఓయూలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థులు ఉద్యోగాల్లో సత్తాచాటిన సందర్భంగా కళశాల ప్రిన్సిపాల్ ప్రొ.వి. సత్య నారాయణ హర్షం వ్యక్తం చేశారు. సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి గురుకుల ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫిజికల్ డైరెక్టర్స్ , లైబ్రేరియన్స్ పోస్టులు, పీజీటీ, టీజీటీ పోస్టులలో ఓయూ విద్యార్థులు ముందు వరసలో ఉండి విజయం సాధించి ఉద్యోగాలు పొందారు. వారిలో ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళశాల విద్యార్థులు స్కూల్స్‌లాలో 100, జూనియర్ కళశాలాలో 18, డిగ్రీ కళశాలాలో 19 పోస్టు లలో ఉద్యోగం సాధించారు. ఇది ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళశాల చరిత్రలోనే మొట్ట మొదటి సారిగా ఇంతమంది విద్యార్థులు ఉద్యోగం పొందటం పట్ల కళశాల ప్రిన్సి పాల్ ప్రొ.వి.సత్య నారాయణ, ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజేష్ కుమార్‌లు హర్షం వ్యక్తం చేశారు.

ఇక పిజిటీ, పోస్టులలో ఓయూ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ విద్యార్థులు 59 మంది ఉద్యోగాలు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ ప్రొ.రవీందర్‌నాథ్ కె.మూర్తి, ఎన్‌సిటిఈ సభ్యులు ప్రొ.పారేపల్లి. శంకర్‌లు ప్రత్యేకంగా కలసి అభినం దించారు. వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

రెండో విడత గొర్రెల పంపిణీ చేయాలి

- జీఎంపీఎస్ నాయకులు రావుల ప్రవీణ్



నవతెలంగాణ-మంచాల

రెండో విడత గొర్రెల పంపిణీ చేయాలని గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం నాయకులు రావుల ప్రవీణ్ ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. గొర్రెల యూనిట్ల కోసం చాల మందిగొల్ల, కురుమలు బ్యాంకుల్లో డిపాజిట్లు కట్టారని, వారికి గొర్రెల యూనిట్లను ఇవ్వలేదని అందువల్ల గొల్ల, కురుమలు ఇబ్బందులు ఎదు ర్కొంటు న్నారని, వారికి త్వరగా గొర్రెల పంపిణీ చేస్తే వారు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రెండో విడత గొర్రెల పంపిణీ వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

జన్వాడలో కొనసాగుతున్న 144 సెక్షన్

నవతెలంగాణ-శంకర్‌పల్లి

జన్వాడ గ్రామంలో 144 సెక్షన్ ఇంకా కొనసాగుతూనే ఉంది. గ్రామంలో పోలీస్ పహారా కొనసాగుతూనే ఉంది. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం సీసీరోడ్డు విషయంలో తలెత్తిన వివాదంలో పరస్పరం దాడులు చేసుకున్న విషయం తెలిసిందే. 144 సెక్షన్ విధించడంతో గ్రామంలో వ్యక్తులు గుంపులు గుంపులుగా ఉండకుండా కొత్త వ్యక్తులను గ్రామంలోకి అనుమతించకుండా పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఈ నెల 21వ తేదీ వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఇప్పటికే ఓ వర్గానికి చెందిన 30 మందిపై కేసు నమోదైనట్టు సమాచారం. మరో వర్గం చెందిన 26 మందిపై కేసులు పెట్టినట్టు సమాచారం. గురువారం సాయంత్రం 11మందిని రిమాండ్‌కు తరలించగా మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. వీహెచ్పీ, బజరంగ్ దళ్ సభ్యులు శుక్రవారం మో కిలా పోలీస్ స్టేషన్ ముట్టడికి పిలుపునిచ్చారని సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ కుమారి సాధన రష్మీ పెరుమాళ్ గ్రామంలో ప్రశాంత వాతావరణం ఉండే విధంగా చూడాలన్నారు.

బుక్ ఫేయిర్‌లో పెయింటింగ్ పోటీలు







నవతెలంగాణ-ముషీరాబాద్

ఎన్టీఆర్ స్టేడియంలో హైదరాబాద్ నేషనల్ బుక్ ఫెయిర్ లో బాలవికాస్ కార్యక్రమాల్లో భాగంగా రవ్వా శ్రీహరి వేదికపై ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన పెయింటింగ్ పోటీలకు విశేష స్పందన లభించింది. సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ మూడు కేటగిరీలో నిర్వహించిన పెయింటింగ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు ప్రముఖ బాల సాహితీవేత్త చొక్కాపు వెంకట రమణ, వి.ఆర్ శర్మ , బుక్ ఫెయిర్ సెక్రటరీ ఆర్ వాసు ఉపాధ్యక్షులు కోయా చంద్రమోహన్, పి నారాయణ రెడ్డి బహుమ తులను అందజేశారు.

ఈ కార్యక్రమంలో సిరి స్వామి, సమీర్, అనీల తదితరులు పాల్గొన్నారు. సీనియర్ కేటగిరీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలు వరుసగా డి. వైష్ణవ్, బి శ్రెయాన్ష్, సాయి గణేష్ లు... జూనియర్ కేటగిరీలో ప్రథమ ద్వితీయ తృతీయ విజేతలు వరుసగా కె. సంమ్రిత, నివేదిత, అస్నా హయత్ లు... సబ్ జూనియర్ కేటగిరీలో ప్రథమ ద్వితీయ తృతీయ విజేతలు వరుసగా యస్విక అరూషి, ఎస్ దీప్తి, ఆద్విక కు బహుమతులు ప్రదానం చేశారు.

డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి కవిత్వాలు తెలంగాణ సాహిత్య చరిత్రకు పెద్దబాలశిక్ష లాంటివి

- హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో వక్తలు
- డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి రచించిన పలు గ్రంథాలు ఆవిష్కరణ



నవతెలంగాణ-ముషీరాబాద్

డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి కవిత్వాలు తెలంగాణ సాహిత్య చరిత్రకు పెద్దబాలశిక్ష లాంటివి అని హైదరాబాద్ బుక్ ఫెయిర్ లో వక్తలు తెలిపారు. డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి రచించిన వి నిర్మాణం, తెలుగు కవిత్వ పరిణామం గ్రంథాలను ఎన్టీఆర్ స్టేడియంలోని హైదరాబాద్ నేషనల్ బుక్ ఫెయిర్ లో రవ్వ శ్రీహరి వేదికపై ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆంధ్రజ్యోతి పత్రిక ఎడిటర్ కే శ్రీనివాస్, వీక్షణం వేణుగోపాల్, ఆచార్య ఎన్ గోపి, సాహితివేత్త పసునూరి రవీందర్ పుస్తక సమీక్షలో భాగంగా మాట్లాడారు. రచయితలు తమ గ్రంథాలను లోతుగా అన్వేషించి రచించాలన్నారు. డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి రచించిన గ్రంథాలు తెలంగాణ సాహిత్య చరిత్రకు పెద్దబాలశిక్ష లాంటివని కొనియాడారు. తెలంగాణ పునర్నిర్మాణానికి ఉపయోగపడే దిక్సూచి లాంటివన్నారు. తెలంగాణ ఉద్యమంపై కొత్తగా పుణ్య అధ్యయనం చేయడం పరిశీలించడం కొత్త అమరికతో వ్యాఖ్యానం చేయడం జరిగిందని వ్యాఖ్యానించారు. డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గుడిపాటి, కాసుల ప్రతాపరెడ్డి, డాక్టర్ ఎస్ రఘు, ఉప్పాల శ్రీరామ్ తదితరులు పుస్తకంపై మాట్లాడారు.

ముగిసిన నాంపల్లి ఎగ్జిబిషన్

- చివరి రోజు 70 వేల మంది సందర్శకులు......
- మొత్తంగా ఎగ్జిబిషన్‌ను సందర్శించిన దాదాపు 22 లక్షల మంది సందర్శకులు



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

నాంపల్లి ఎగ్జిబిషన్ (నుమాయిష్) ఆదివారంతో ముగిసింది. 83వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనశాల జనవరి 1వ తేదీన ప్రారంభమై ఫిబ్రవరి 18వ తేదీ రాత్రి వరకు కొనసాగింది. ప్రతీ సంవత్సరం 46 రోజులు కొనసాగే ఎగ్జిబిషన్ ఈ సంవత్సరం 49 రోజులు పాటు కొనసాగింది. ముగింపు రోజు ఆదివారం మధ్యాహ్నం నుంచే నగరంతో పాటు పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తు న సందర్శకులు తరలివచ్చారు. ఆదివారం రోజు దాదాపు 70 వేల మంది సందర్శకులు సందర్శించినట్లు బుకింగ్ కన్వీనర్ చంద్రశేఖర్ తెలిపారు. 49 రోజుల్లో శనివారం వరకు 21.30 లక్షల సందర్శకులు సందర్శించగా చివరిరోజుతో 22 లక్షలకు చేరుకుంది. ఈ సంవత్సవరం ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఎగ్జిబిషన్ ను జనవరి 1వ తేదీన ప్రారంభించగా ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షులుగా నియమి తులైన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి డి.శ్రీధర్ బాబు ఎగ్జిబిషన్ నిర్వహణకు పలు రకాల సహకారాలు అందిం చారు. 2400 స్టాళ్లతో సందర్శకులకు కనువిందు చేసే విధంగా ఎగ్జిబిషన్ సొసైటీ తరపున పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామని సొసైటీ ఉపాధ్యక్షులు వనం సత్తేందర్, కార్యదర్శి హన్మంతరావు, జాయింట్ సెక్రెటరి స్వర్ణజిత్ సింగ్, కోశాధికారి రాజేంద్రకుమార్ లు తెలిపారు. సందర్శకులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా సొసైటీ తరపునా సకల ఏర్పాట్లు చేశామన్నారు. పోలీస్ శాఖ తరపున బేగంబజార్ ఇన్స్పెక్టర్ శంకర్, ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసుల తరపునా గోషామహాల్ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున బందోబస్తును పర్యావేక్షించారు

శివశంకర్ జీవితం పాఠ్యాంశాల్లో చేర్చాలి



- జస్టిస్ ఈశ్వరయ్య
- బుక్ ఫెయిర్‌లో పి.శివశంకర్ ఆత్మకథ 'అదొక్కటే ముగింపు' పుస్తకంపై చర్చ గోష్టి

నవతెలంగాణ-ముషీరాబాద్

శివశంకర్ జీవితం అనేక పాఠాలను చెబుతోందని, ఆయన జీవితం-పోరాటం ఈ తరానికి ఎంతో అవసర మని, అందుకే ఆయన జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాలలో సిలబస్‌గా చేర్చాలని రిటైర్డ్ జస్టిస్ బి ఈశ్వరయ్య తెలిపారు. ఆయన తెలుగు నేలపై జన్మించిన పూలే వారసుడని పేర్కొన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ లో ఆదివారం పి. శివశంకర్ ఆత్మకథ 'అదొక్కటే ముగింపు' అన్న పుస్తకంపై చర్చ గోష్టి జరిగింది. ఈ చర్చ గోష్టిలో జస్టిస్ ఈశ్వరయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ. శివశంకర్ భారత రత్నకు అర్హుడని పేర్కొన్నారు. దేశంలో సామాజిక న్యాయం, వెనుకబడిన తరగతుల కోసం పోరాటం చేసిన మహా న్నతుడుగా అభివర్ణించారు. శివశంకర్ అంటే సామాజిక న్యాయానికి సిలబస్ అని చెప్పారు. ఆయన జీవితం రేపటి బహుజన ఉద్యమాలకు ఒక దిశా నిర్దేశమని తెలిపారు. ఈ చర్చ గోష్టిలో పాల్గొన్న ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కే లక్ష్మణ్, శివశంకర్ తనయుడు డాక్టర్ వినయ్ కుమార్, హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు జూలూరు గౌరీ శంకర్ లు ప్రసంగిస్తూ కష్టపడితే జీవితంలో దేనినైనా సాధించవచ్చు అనడానికి శివశంకర్ జీవితం ఒక ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఈనాడు తెలుగు రాష్ట్రాల్లో బీసీలకు సంబంధిం చిన రిజర్వేషన్లు లభించటానికి తొలి పోరాటం చేసింది శివ శంకర్ అని వారు పేర్కొన్నారు.

కళను ఎప్పుడూ ఆశీర్వదించాలి



- ప్రముఖ సినీ నటుడు పృథ్వీరాజ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

కళాకారులకు గొప్పతనం ఉందని.. కళలను ఎప్పుడూ ఆశీర్వదించాలని ప్రముఖ సినీ నటుడు పృథ్వీరాజ్ కోరారు. కళామ్మ తల్లి అందరిని నడిపిస్తుందని.. సర్వీస్ చేస్తూ సేవ చేస్తేనే పేరు ప్రఖ్యాతలు వస్తాయని తెలిపారు. జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహనీయుల అవార్డ్స్ మహెూత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి సముద్రాల వేణుగోపాల చారి, దైవజ్ఞ శర్మ, సినీ నటుడు పృథ్వీరాజ్ హాజరై అవార్డ్సును పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సేవ చేయాలని, వారు చేశారా... వీరు చేశారా.. అని చూడకుండా తోసిన కాడికి సేవ చేస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. ఎక్కడున్నా పక్కన వారిని ఆదుకోవాలి తప్ప.. ప్రభుత్వాన్ని నిందించ కుండా మన సేవా కృషి ఉండాలన్నారు. అవార్డ్స్ ఇవ్వడం గొప్ప విషయమని ఈ అవార్డు మరింత బాధ్యత పెంచుతాయని, అవార్డును కొనుక్కోవద్దు టాలెంట్ ద్వారా రావాలన్నారు

నకిలీ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌తో అమ్మాయిలతో పరిచయాలు..

- నకిలీ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌తో అమ్మాయిలతో పరిచయాలు
- పార్ట్‌టైమ్ జాబ్స్ ఇప్పిస్తానంటూ దగ్గరయ్యేవాడు
- మాయమాటలతో వీడియోకాల్స్ వరకూ తీసుకెళ్లేవాడు
- రికార్డుచేసిన వీడియోలు, ఫోటోలను మార్ఫింగ్ చేసి బెదిరింపులు
- నిందితున్ని అరెస్టు చేసిన సీసీఎస్ పోలీసులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

నకిలీ ఇన్‌స్టాగ్రామ్‌తో న్యూడ్ కాల్స్ చేసి, వాటిని రికార్డు చేసి అమ్మాయిలను వేధింపులకు గురిచేస్తూ అందిన కాడికి దండుకుంటున్న నిందితుడిని హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం జాయింట్‌సీపీ ఏవీ రంగనాథ్ తెలిపిన వివరాల మేరకు కొత్తగూడెంకు చెందిన 35ఏండ్ల ఓ నిందితుడు తప్పుడు అడ్రస్‌తో నకిలీ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను సృష్టించాడు. అమ్మాయిలా పలువురికి ఫ్రెండ్ రెక్వెస్ట్ పెట్టి పరిచయాలు చేసుకుని చాటింగ్ చేసేవాడు. అనంతరం మాయమాటలతో చనువు పెంచుకునేవాడు. వారి పరిస్థితులను అంచనా వేసి పార్ట్‌టైమ్ ఉద్యోగాలిపిస్తానంటూ వీడియోకాల్స్ వరకు తీసుకెళ్లేవాడు. తనపై పూర్తిగా నమ్మకం కలిగించి న్యూడ్ వీడికాల్స్ చేసి బాధితులకు తెలియకుండానే వాటిని రికార్డుచేసేవాడు. ఆ తర్వాత వారికి స్క్రీన్ షార్ట్ పంపించేవాడు. మార్ఫింగ్ చేసిన ఫోటోలను సైతం పంపించి తానుచెప్పినట్టు వినాలని లేకుంటే వాటిని మీ కుటుంబసభ్యులకు, సోషల్‌మీడియాలో పోస్టుచేస్తానంటూ బెదిరించి డబ్బులు దండుకునే వాడు. ఇదే తరహాలో నగరానికి చెందిన ఓ అమ్మాయితో పరిచయం పెంచుకున్న నిందితుడు వేధింపులకు పాల్పడ్డాడు. వేధింపులు అధికం కావడంతో బాధితురాలు విషయాన్ని ఇంట్లో చెప్పింది. సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. డీసీపీ డీ.కవిత ఆదేశాలతో, ఏసీపీ చాంద్ భాషా సూచనలతో సీఐ సైదులు విచారణ చేపట్టారు. ఖమ్మం జిల్లా, కొత్తగూడెంకు చెందిన వ్యక్తిగా గుర్తించి అరెస్టు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపిచే ఫ్రెండ్ రెక్వెస్ట్‌లను క్లిక్‌చేయోద్దని జాయింట్ సీపీ ఏవీ రంగనాథ్ నగరవాసులకు సూచించారు. ఎవరికికూడా వ్యక్తిగత సమాచారంగానీ, ఫోటలను గానీ పంపించొద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ఆర్.జీ.శివ మారుతీ, ఎస్ఐ ఆర్.పీ రెడ్డి, కానిస్టేబుళ్లు ఇ.విజయ్‌కుమార్, బీ.నరేష్ తదితరులు పాల్గొన్నారు.



టేస్టీ ఫైర్ రెస్టారెంట్ హెూటల్ ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి

నవతెలంగాణ-కాప్రా

ఎల్ఐజీ, ఏపీఐఐసీ, కాలనీ కుషాయిగూడ, ఈసీఐఎల్‌లో టేస్టీ ఫైర్ రెస్టారెంట్ హెూటల్‌ను ముఖ్య అతిథి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో,శ్రీహరి ,లితున్ మనోహర్ ,జంపాల్ ,మహేష్ గౌడ్ ,అజిత్ తదితరులు పాల్గొన్నారు .

'ఓయాసిస్ కిడ్స్ కార్నివాల్'

- డాన్సులు, నాటకాలతో అలరించిన పేరెంట్స్ చిల్డ్రన్



నవతెలంగాణ-శంషాబాద్

తల్లిదండ్రులు, పిల్లల మధ్య ఉండాల్సిన మానవ సంబంధాలు సజీవంగా కండ్లకు కట్టినట్టుగా ప్రదర్శించారు. సాంకేతిక యుగంలో బిజీ లైఫ్‌కు అలవాటు పడిన మనుషుల మధ్య అనుబం ధాలు దూరమైతున్న వాటిని డ్రామా రూపంలో ప్రదర్శిం చిన చూసిన తల్లిదండ్రులు భావోద్వేగానికి గుర య్యారు.

ఆదివారం శంషాబాద్ మండల పరిధిలోని అమ్మపల్లి ఒయాసిస్ స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్‌లో నిర్వహించిన 'ఒయాసిస్ కిడ్స్ కార్నివాల్' ఆహుతు లను విశేషంగా ఆకర్షించింది. తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి డ్రామాలు, డాన్సులు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, మ్యాజిక్ షో, మ్యూజిక్, తపాలా, ఎల్ఐసీలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. ఉమాదేవి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల సంబంధాలతో పాటు నూతన ఆలోచన, మానవ సంబంధాల గురించి అవగాహన కల్పించడం కోసం ఒయాసిస్ కిడ్స్ కార్నివాల్ ఏర్పాటు చేయడం చేశా మన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. కిడ్స్ కార్నివాల్‌లో పాల్గొన్న తల్లిదండ్రులు తమ అనుభూతులను మీడియాతో పంచుకున్నారు.

పాత లే అవుట్‌లో భూముల రిజిస్ట్రేషన్ నిలుపుదల

- అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్ దత్తు

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

గతంలో చేపట్టిన లేఅవుట్ లో ఇకనుంచి భూ రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయనున్నట్టు తహసీల్దార్ రవీందర్ దత్తు ఓ ప్రకటన లో తెలిపారు. ధరణి రికార్డుల సాకుతో భూముల పట్టాదార్ పాస్ పుస్తకాలు రిజిస్ట్రేషన్ చేయాలని వచ్చే వారిపై కఠిన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి వినియోగదారులు అధికారుల సూచనలు పాటించి సహకరించాలని కోరారు.

మేయర్ పీఠానికి నేడే అవిశ్వాస పరీక్ష

- అమలులో144 సెక్షన్
- పోలీసులకు సహకరించాలి : సీఐ సీతారాం

నవతెలంగాణ-జవహర్‌నగర్

మున్సిపల్ కార్యాలయంలో నేడు అవిశ్వాస తీర్మానం ఉన్నందున మున్సిపల్ కార్యాలయం చుట్టూ ఒక కిలోమీటర్ మేర 144 సెక్షన్ అమల్లో ఉంటుందని జవహర్ నగర్ సీఐ సీతారాం తెలిపారు. జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్‌లో ఉదయం 11గంటల 30 నిమిషాలకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌పైన అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 144 సీఆర్‌పీసీ సెక్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. జవహర్ నగర్ కార్పొరేటర్లు, స్థానిక ప్రజలు, పోలీసులకు సహకరించాలని కోరారు.

సీపీఐ(ఎం) నాయకుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని రావల్‌కోల్ గ్రామంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నరేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ శిబిరంలో పాల్గొన్న రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లుగా తెలిపారు. ప్రముఖ వైద్యులు శంకర్ రావు, సన్‌మెడ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ చైర్మెన్ శ్రీకాంత్‌రావు మాట్లాడుతూ తమ ఆస్పత్రి ద్వారా రావల్‌కోల్‌లో వైద్య శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరెన్నో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, డాక్టర్ రోహిత్, డాక్టర్ అవినాష్, డాక్టర్ జితేంద్ర కుమార్, పూర్ణ చంద్, కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజకీయం రసవత్తరం

- ఆయా పార్టీలతో నాయకుల మంతనాలు
- అభ్యర్థుల కోసం పార్టీల వెతుకులాట
- ఎంపీ టికెట్ కోసం ఆశావహుల ప్రయత్నాలు
- లోక్‌సభ ఎన్నికలకు ముందే కండువా మార్పు



నవతెలంగాణ-సిటీబ్యూరో

లోక్‌సభ ఎన్నికలకు ముందే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రాజకీయం రసవత్తరంగా మారుతోంది. కొందరు నాయకులు ఇప్పటికే పార్టీ మరగా.. మరికొందరు సైతం కండువా మార్చడం ఖాయంగా కనిపిస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ రాని ఆశావహులు కండువాలు మార్చిన సంగతి తెలిసిందే. తాజాగా పార్లమెంట్ ఎన్నికల్లో నూ లోక్‌సభ స్థానానికి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న వారు వారి అనుకూల పార్టీ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆయా పార్టీల్లో కీలకంగా ఉండే నాయకులతో టచ్‌లో ఉంటున్నారు. దీంతో ఎవరెవరు ఏ పార్టీలో ఉంటారో.. ఏ పార్టీలో చేరుతారోనని ఆసక్తిగా మారింది. మరికొన్ని రోజుల్లో జరిగే ఎన్నికల కోసం రాజకీయ పార్టీలు సైతం బరిలో దింపేందుకు సరైన అభ్యర్థులను వెతికే పనిలో పడ్డాయి. ఇందుకోసం క్షేత్రస్థాయిలో సర్వేలు, అభిప్రాయాల సేకరణలు, టికెట్ల కోసం దరఖాస్తుల ప్రక్రియ చేపట్టాయి. ప్రజల్లో ఆదరణ ఉండి.. సరైన అభ్యర్థిగా భావిస్తున్న వారిని సైతం తమ పార్టీలోకి రావాల్సిందిగా ఆహ్వానిస్తున్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధి, జీహెచ్ఎంసీ మాజీ మేయర్, చర్లపల్లి కార్పొరేటర్ ఇప్పటికే పార్టీ మారారు. మరికొంత మంది నాయకులు పరిస్థితులను గమనిస్తూ పార్టీ మారాలా..? వద్దా..? అనే ఆలోచనలు చేస్తున్నట్టు సమాచారం.

నాయకుల చూపు కాంగ్రెస్ వైపు..

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ వైపే నాయకులు తమ మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆశావహులు ఉవ్విళ్లూరుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఓ బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధి కాంగ్రెస్ వైపు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. మల్కాజిగిరి ఎంపీ టికెట్ ఇస్తే పోటీ చేసేందుకు సిద్ధపడినట్టు సమాచారం. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఒకరు ఇప్పటికే రహస్య మంతనాలు జరిపినట్టు ఆ మాజీ ప్రజాప్రతినిధే స్వయంగా చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ఓటమి చెందిన కాంగ్రెస్ బలహీనపడింది. ఏడు సెగ్మెంట్ల పరిధిలో అన్నింటా బీఆర్ఎస్ జెండా ఎగరేసింది. అయినా రాష్ట్రంలో అధికారంలో ఉండి బలంగా ఉన్న హస్తం వైపే ఆశావహులు చూస్తున్నారు.

పోటా పోటీ..

మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్ నుంచి పోటీ చేసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నుంచి ఆశావహుల పోటీ ఎక్కువగా ఉంది. రోజు రోజుకూ వీరి సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే ఒక్కో పార్టీ నుంచి మూడు నుంచి ఐదుగురి పేర్లు వినిపిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. బీఆర్ఎస్ నుంచి ఓ ఎమ్మెల్యే కుమారుడు టికెట్ ఆశిస్తుండంతో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ దంపతులు పార్టీ మారారు. ప్రస్తుత డిప్యూటీ మేయర్ దంపతులు సైతం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. వీరు కూడా ఎంపీ టికెట్ ఆశిస్తున్నారు. ఇక బీజేపీలో లోకల్ వర్సెస్ నాన్ లోకల్ ఫైట్ నడుస్తోంది. లోకల్ నాయకులకే టికెట్ ఇవ్వాలంటూ స్థానికులు డిమాండ్ చేస్తుంటే.. పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకులు ఈ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రచారం షురూ..

లోక్‌సభ ఎన్నికల కోడ్ రాలేదు.. ఆయా పార్టీలు అభ్యర్థులను ప్రకటించనే లేదు. కానీ కొందరు ఆశావహుల అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. టికెట్ తమకే కన్ఫమ్ అయిందంటూ అప్పుడే ప్రచారం మొదలు పెట్టేశారు. వాల్ రైటింగ్స్, వాల్ పోస్టర్స్, ఉచిత మెడికల్ క్యాంపులతో పేరుతో లోక్‌సభ సెగ్మెంట్‌ను చుట్టేస్తున్నారు. పార్టీ శ్రేణులు, ముఖ్య నాయకులు, డివిజన్ నాయకులను కలుస్తున్నారు. కాగా.. మల్కాజిగిరి బరిలో ఉంటారో తెలియాలంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే..!

పరిశుభ్రతపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-ఘట్కేసర్

పోచారం మున్సిపాల్టీ పరిధిలోని మూడో వార్డు ఎల్ఐజీ కాలనీలో పరిశుభ్రతపై స్థానిక కౌన్సిలర్ చింతల రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఐజీ కాలనీలో శుభ్రత పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేసి శుభ్రతలో ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాల ని కోరారు. ఎవరైనా చెత్తను బహిరంగ ప్రదేశాలలో వేస్తే జరిమానా విధిస్తామ ని హెచ్చరించారు. మున్సిపల్ సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి కాలనీని పూర్తిగా శుభ్రపరుస్తున్నట్లు తెలిపారు. చెత్తను జనావాసల మధ్య వేస్తే చర్యలు తప్పవని కౌన్సిలర్ రాజశేఖర్ హెచ్చరించారు. మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వాణి మాట్లాడుతూ.. ప్రతి ఒక్క బ్లాక్ కింద తడి, పొడి చెత్త వేయడానికి రెండు డ్రమ్ములను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చెత్తను సేకరించే ఏజెన్సీ వారికి నెలకు ప్రతీ ఇంటికి రూ.50 చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు అర్జున్ యాదవ్, కాశీనాథ్ యాదవ్, ఆంజనేయులు గౌడ్, ప్రకాష్ గౌడ్, బుచ్చయ్య, రాజు యాదవ్, మున్సిపాలిటీ సిబ్బంది సాయితేజ, సూపర్‌వైజర్ నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క సారలమ్మ జాతరకు ప్రభుత్వం సెలవు ప్రకటించాలి : పాపారావు



నవతెలంగాణ-కాప్రా

ఆదివాసి ప్రజల ఆరాధ్య దైవం మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు ప్రభుత్వం సెలవు ప్రకటించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాగబోయిన పాపారావు తెలిపారు. ఆసియాలోనే అతిపెద్ద ఆదివాసుల జాతరైన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాతరకు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, ఒడిశా రాష్ట్రాల ఆదివాసీ ప్రజలు సమ్మక్క సారలమ్మలను దర్శించుకుంటారని పేర్కొన్నారు. పుష్యమాగా మాసంలో ఆదివాసుల ఇలవేల్పుల జాతరలను వారి సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలను పరిరక్షిస్తూ ప్రతి రెండేండ్లకోసారి ఈ జాతరను నిర్వహిస్తారని తెలిపారు. ప్రభుత్వం లాభాపేక్ష కోసం కాకుండా ఆదివాసి ప్రజల ఆత్మగౌరవాన్ని, సాంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించే విధంగా కృషి చేయాలన్నారు. జాతర పర్యవేక్షణ కమిటీలో ఆదివాసులతో పాటు గిరిజనేతరులకు అవకాశం కల్పించే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. సమ్మక్క సారలమ్మ ట్రస్టు బోర్డులో సమ్మక్క వడ్డెలు పూజారులు, తలపతులు వంశస్థులు తోపాటు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు, నాగులమ్మ, జంపన్న, వనం పోతురాజు ఒక్కొక్కరి చొప్పున ఆదివాసీ గ్రామాల్లో ఉండే పరిపాలన పద్ధతి సాంప్రదాయం గోత్ర వ్యవస్థ అనుసరించి గోత్రానికి ఒక్కరి చొప్పున 12 మందితో పాటు కోఆప్షన్ సభ్యుడు కలిపి 13 మందితో శాశ్వతంగా ట్రస్ట్ బోర్డు పాలక మండలిని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను సాధించాలి



నవతెలంగాణ-కీసర

అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని 108 సిబ్బంది చిత్రం రవి, ఆంజనేయులు, మహేందర్, కుమార స్వామిలు అన్నారు. ఆదివారం జ్ఞానమాల 108 వ వారం కార్యక్రమాన్ని కీసర మండలం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో జ్ఞానమాల అధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్యర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 108 సిబ్బంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కీసర మండల అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు కుమార్, వేణుగోపాల్, కోశాధికారి శ్యామ్, సంయుక్త కార్యదర్శు లు సంతోష్, నవీన్, ఆంజనేయులు, సుధాకర్, శంకరయ్య, ఐలయ్య, కీసర మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌రెడ్డి, రవీందర్, శ్రీనివాస్, కృష్ణ, మల్లేష్, కీసర గుట్ట ట్రస్ట్ బోర్డ్ మెంబర్ శ్రీనివాస్, స్వచ్ఛ భారత్ కన్వీనర్ సుధాకర్, గణేష్ , బీఆర్ఎస్ అధ్యక్షుడు బాలరాజ్, బీజేపీ కీసర గ్రామ శాఖ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షుడు ప్రవీణ్, రమేష్, ఆగమయ్య, సుమన్, బన్నీ, రాజలింగం, సాయిలు, బాలకృష్ణ, ప్రకాష్, పవన్ పాల్గొన్నారు.

ఘనంగా సీడీకే గ్లోబల్ ఇండియా 9వ ఫ్యామిలీ డే వేడుకలు



నవతెలంగాణ-శామీర్‌పేట

మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని లియోనియా రిసార్ట్‌లో శనివారం రాత్రి ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ సీడీకే గ్లోబల్ ఇండియా ఆధ్వర్యంలో 9వ ఫ్యామిలీ డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సెలబ్రేటింగ్ ది కల్చర్ ఆఫ్ టుగెదర్ నెస్ పేరుతో ఈ కార్యక్రమం కన్నులపండువగా జరిగింది. ఈ సందర్భంగా సీడీకే గ్లోబల్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, మేనేడజింగ్ డైరెక్టర్ అరవింద్ చతుర్వేది మాట్లాడుతూ.. సీడీకే బృందం సమన్వయంతో సాధించిన విజయాలు మైలురాళ్లను సెలబ్రేటింగ్ జర్నీలో ప్రదర్శిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీడీకే గ్లోబల్ ఇండియా సీనియర్ డైరెక్టర్ హ్యూమన్ రిసోర్సెస్ హెడ్ జాయ్ జార్జ, సీడీకే బృందం సభ్యులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన జగదీశ్వర్ గుప్తా



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రముఖ వ్యాపారి రంగం శెట్టి రామ సుబ్బయ్య, రామ సుబ్బమ్మల కనిష్ట పుత్రుడు నాగేంద్ర ప్రసాద్ (ప్రకాష్), గుంటూరు బాలాజీ నగర్‌కు చెందిన తిరుమల కొండ వెంకటేశ్వర్లు, కాశమ్మ తృతీయ పుత్రిక వివాహం ఆదివారం చీరాలలోని కిరాణా మర్చంట్ అసోసియేషన్ కల్యాణ మండపంలో అంగరంగవైభవంగా జరిగింది. వారి వివాహానికి వైఎస్సార్సీపీ సిద్ధిపేట జిల్లా అధ్యక్షులు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్ గుప్తా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఆకట్టుకున్న చిన్నారుల సంగీత విభావరీ

- ఉప్పల్ శిల్పారామంలో విద్యార్థుల సందడి



నవతెలంగాణ-సిటీబ్యూరో

చిన్నారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు బీజీబీ లెర్నింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉప్పల్ శిల్పారామంలో సంగీత విభావరీ నిర్వహించారు. బీజీబీ లెర్నింగ్ సెంటంలో ఆన్‌లైన్, ఆఫ్ లైన్‌లో సంగీతం, పియానో కీబోర్డు, గిటార్, వీణ ఇన్ స్ట్రుమెంట్, కూచిపూడి, భరతనాట్యం నేర్చుకునే విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమానికి లైఫ్ కోచ్, వ్యక్తిత్వ వికాస నిపుణులు గోనె రాజేంద్ర, మెటా ఫర్ మై సక్సెస్ పుస్తకం రచయిత అమర్, మాస్టర్ మైండ్ స్కూల్స్ ప్రిన్సిపాల్ శ్రావణి దేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు వారి సజనాత్మకమైన అంశాలతో పాటు భారతదేశానికి సంబంధించిన ఆధ్యాత్మిక కళలైన భరత నాట్యం, కూచిపూడి సంగీతంతో పాటు భగవద్గీత శ్లోకాలు పాడారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా బీజీబి లెర్నింగ్ సెంటర్ వ్యవస్థాపకురాలు హిమబిందు మాట్లాడుతూ సంగీతం, కళల పట్ల ఆసక్తి ఉండి తమ వద్ద శిక్షణ పొందుతున్న పిల్లల్ని ప్రోత్సహించాలని, వారిని మరింత ఉత్తేజ పరచాలనే ఉద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని, ఈ కార్యక్రమాన్ని మినీ శిల్పారామం పెద్ద వేదికపై నిర్వహించడం పట్ల చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సహ నిర్వాహకురాలు శిరీషా పాల్గొన్నారు.

పబ్లిక్ పరీక్షలను సిద్ధమౌతున్న 'పది' విద్యార్థులు

- పరీక్షలు దగ్గర పడుతుండడంతో ఓ వైపు ఆనందం.. మరో వైపు ఆందోళన
- ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రత్యేక తరగతులు నిర్వహణ



నవతెలంగాణ-అల్వాల్

మార్చి నెల చివర్లో ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు సర్వం సిద్ధమవుతున్నారు. పరీక్షలు దగ్గర పడుతుండడంతో ఓ వైపు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. మరో వైపు చదువుల ఒత్తిడితో ముందుకెళ్తున్నారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించి ఉన్నత చదువులకు బంగారు తలుపులు తెరుచుకోవాలనే ఆశలతో ఉన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ ఏడాది సుమారు 6 లక్షల మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కాబోతున్నారు. వారి కోసం పాఠశాల స్థాయి విద్యా శాఖ మార్చి 18వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనుంది. పరీక్షలు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అదనపు తరగతులు, మోడల్ పేపర్స్ ప్రాక్టీస్‌లో బీజీబీజీగా గడుపుతున్నారు. పరీక్షలపై ఆందోళన ఉన్నా మంచి మార్కులు సాధించాలనే తపనతో ఉత్తమ పాఠ్యపుస్తకాలను చదువుతున్నారు. విద్యార్థులకు ఏవైనా సందేహాలుంటే ప్రత్యేక తరగతుల్లో ఉపాధ్యాయులను అడగటం, గత ఏడాది మోడల్ పేపర్స్ ప్రాక్టీస్ చేస్తున్నామని నగరంలోని ఓ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సహస్ర చెప్పింది. చదువుపై ఒత్తిడిని తగ్గించుకోవడానికి కొంతమంది విద్యార్థులు యోగా, ధ్యానం వంటి పద్ధతులను అనుసరిస్తున్నారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడానికి విద్యార్థుల కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు సహకరిస్తున్నారు. పరీక్షల ఒత్తిడి పిల్లలపై ప్రభావం చూపకుండా సరైన నిద్ర, ఆహారం, విశ్రాంతి తీసుకునేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



కాప్రా డివిజన్ ఏడీవీటీ ఇన్‌చార్జి టీ. రవి వివాహానికి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ.సాగర్, నవతెలంగాణ సిబ్బంది షేక్ జాంగీర్, కాప్రా విలేకరి సత్యనారాయణ, కిసర విలేకరి బందెల యాదగిరి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

త్రిబుల్ ఆర్ "లక్కీడ్రా" విజేతలకు బహుమతులు ప్రదానం



నవతెలంగాణ-బంజారాహిల్స్

త్రిబుల్ ఆర్ "లక్కీ డ్రా" బహుమతులను సంస్థ ఎండీ దీనబంధు సాహూ ఆదివారం ప్రదానం చేశారు. మొదటి బహుమతిగా కారును హైదరాబాద్‌కు చెందిన సరిత గెలుచుకున్నారు. ద్వితీయ బహుమతిగా నాలుగు ద్విచక్రవాహనాలు, తృతీయ బహుమతి 20 కుట్టు మిషన్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఆదివారం బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో తమ కస్టమర్లకు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి 25 మంది విజేతలకు బహుమతులు ప్రదానం చేసినట్టు ఆయన తెలిపారు. త్రిబుల్ ఆర్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థను 2019లో ప్రారంభించామని తెలిపారు. ప్రజల ఆధారాభిమానులతో అనతికాలంలోనే దిగ్విజయంగా ముందుకు దూసుకుపోతున్నదన్నారు. ఎంబ్రాయిడింగ్ మిషన్లు కొనుగోలు చేసిన కస్టమర్లకు 2023వ సంవత్సరం దీపావళి పండుగ నుంచి 2024వ సంవత్సరం సంక్రాంతి సీజన్ వరకు జరిగిన లక్కీ డ్రాలను ఈ నెల 14న ప్రకటించిన్నట్లు తెలిపారు. ఈ మెగా ఫెస్టివల్ కార్యక్రమాన్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఎంబ్రాయిడింగ్ మిషన్లు కొనుగోలు చేసిన ప్రతి కస్టమరుకు లక్కీ డ్రా కూపన్లు ఇచ్చామన్నారు. అన్ని రాష్ట్రాలకు సంబంధించిన లక్కీ కూపన్లకు లక్కీ డ్రా నిర్వహించి విజేతలను ప్రకటించామన్నారు. సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి మరెన్నో కార్యక్రమాలను భవిష్యత్లో కొనసాగిస్తామని సంస్థ సీఈవో గోపాల్ కృష్ణ తెలిపారు.

బీసీల అభ్యున్నతికి పోరాటాలు ఉధృతం చేయాలి



- బీసీ కులాల ఐక్యవేదిక మల్కాజిగిరి నియోజకవర్గ కన్వీనర్ కామల్ల ఐలన్న

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

రాష్ట్రంలో జరిగే కుల గణనతో బీసీ కుల సామాజిక వర్గాలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో, ప్రభుత్వం కల్పించే బీసీ రిజర్వేషన్లతో పాటు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వాటిని అందిపుచ్చుకోడానికి బీసీలు కుల పోరాటాలు ఉధృతం చేయాలని బీసీ కులాల ఐక్యవేదిక మల్కాజిగిరి నియోజక వర్గ కన్వీనర్ కామల్ల ఐలన్న పిలుపునిచ్చారు. ఆదివారం వినాయక నగర్ డివిజన్ పరిధిలోని సంతోషి నగర్‌లోని జీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో బీసీ కులాల ఐక్య వేదిక మల్కాజిగిరి నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కామల్ల ఐలన్న మాట్లాడుతూ.. అసెంబ్లీలో కులగణన బిల్లు ప్రవేశ పెట్టి ఏకగ్రీవంగా ఆమోదించడం వల్ల బీసీ వర్గాల్లో ఆత్మ విశ్వాన్ని పెంచిందన్నారు. ఈ సందర్భంగా నేడు ఉదయం 11 గంటలకు సైనిక్‌పురి చౌరస్తాలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పాలాభిషేకం, పూలమాల సమర్పణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. బీసీ కుల బంధువులు అధిక సంఖ్య లో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. మల్కాజిగిరి సర్కిల్ సఫిల్ గూడ మినీ ట్యాంక్ బండ్ వద్ద మహనీయుల విగ్రహాలను ప్రతిష్ఠించాలని డిమాండ్ చేస్తూ బీసీ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 27న ఉదయం 11 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశాన్ని జీఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్లను, రాజకీయ నాయకు లను, సామాజిక వేత్తలను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఐక్య వేదిక కో కన్వీనర్స్ రొయ్యల కృష్ణమూర్తి, బత్తిని నర్సింహ్మా గౌడ్, వగ్గు చంద్రశేఖ ర్ రావు కురుమ, అప్పాల శ్రీనివాస్, సిహెచ్. రాం మోహన్ రావు, ఏనుముల రాజు, కాసర్ల నాగరాజు రజక, జెనుకుంట్ల రమేష్‌గౌడ్, ఎస్.ప్రభాకర్‌గౌడ్, ఉడుత నవీన్ పద్మశాలి, తోట నాగేష్, డి.మహేష్ గౌడ్, కె.సంతోష్ గౌడ్, జెర్రిపోతుల కృష్ణ గౌడ్, మక్తాలా శంకర్ గౌడ్, జి. శ్రీకాంత్ యాదవ్, డి.మ ధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో ఉన్న గిరిజన సంఘం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీసంత్ సేవాలాల్ 285వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ధన్ సింగ్ నాయక్ మాట్లాడుతూ భారత దేశంలో 13 కోట్ల బంజారాల ఆరాధ్య దైవం, ఇటు బ్రిటిష్ ప్రభుత్వంతో, అటు నిజాం ప్రభుత్వంతో సతమతమవుతున్న ఈ బంజారాలకు తండాలను నిర్మించి హితబోధనలు చేసిన గొప్ప నాయకుడు సేవలాల్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఏ.మోహన్ నాయక్, గౌరవ అధ్యక్షులు వి.లాలు నాయక్, సలహాదారులు అమీన్ సింగ్, గణేష్, ఉపాధ్యక్షులు శంకర్ నాయక్, రవీందర్, సహాయ కార్యదర్శి రాజు నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ హిరులాల్ నాయక్, బహుగుణ నాయక్, శంకర్ నాయక్, వెంకట్రామ్ నాయక్, వివిధ కాలనీల బంజార నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు




నవతెలంగాణ-హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అందోజీ సత్యం చారి, మాజీ కార్పొరేటర్ రమావత్ పద్మాశ్రీనివాస్ నాయక్ అధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నారగొని శ్రీనివాస్ యాదవ్, నాగిరెడ్డి, శ్రీరాములు గౌడ్, భిక్షపతి చారి, నరేష్, విజయ్ పాల్గొన్నారు.



హైదరాబాద్ నేషనల్ బుక్ ఫెయిర్‌లో రవ్వ శ్రీహరి వేదికపై రచయిత ప్రవాష్ ఘోష్ రచించిన శరత్ సాహిత్యం ఆవశ్యకత పుస్తకాన్ని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ రాధారాణి ఆవిష్కరించారు. సిహెచ్ ప్రమీల అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సి.హెచ్ మురహరి, ఆలూరి విజయలక్ష్మి, రాపోలు సుదర్శన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ, ముషీరాబాద్



మనిషికి శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. ఆందోళన, ఒత్తిడి వంటివి సహజమే అయినప్పటికీ ఆనందంగా ఉన్నప్పుడు మాత్రమే వాటిని ఎదుర్కొనే శక్తి మనలో ఉంటుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ నిపుణుల అధ్యయనం ప్రకారం ఇటీవల టీనేజర్లలో మానసిక ఆందోళన పెరుగుతోందని తేలింది. 13 నుండి 18 ఏండ్ల వయసు గల యువతీ యువకుల్లో దాదాపు మూడింట ఒక వంతు మంది యాంగ్జైటీ డిజార్డర్‌ను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా అమ్మాయిలు ఈ సమస్యతో ఎక్కువగా బాధపడుతున్నారు. ఇది టీనేజర్ల భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. కాబట్టి దానిని మేనేజ్ చేసుకునేందుకు నిపుణులు కొన్ని సూచనలు ఇస్తున్నారు. అవేంటో తెలుసుకుందాం...

ఆందోళనను ఎదుర్కోవడం ఇలా...



కొన్ని సార్లు ఆయా పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో తెలియక, అవగాహన లేక టీనేజర్లలో ఆందోళన పెరుగుతుంది. అందుకోసం వాటిని తట్టుకోవడానికి అవసరమైన శక్తి కావాలి. కాబట్టి ఆందోళనను రేకెత్తించే కార్యక్రమాల్లో నిమగ్నమవ్వడం ద్వారా క్రమంగా మిమ్మల్ని మీరు సవాలు చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. అలాగని ఒకేసారి మరీ ఎక్కువ ఛాలెంజింగ్ విషయాల జోలికి వెళ్లవద్దు. మీ కాన్ఫిడెంట్‌ను పెంపొందించుకోవడానికి సాధించగల గోల్స్ ఏర్పర్చుకోవడంలో మరింత క్లిష్టమైన పనులను అధిగమించడంలో కాస్త ఎక్కువ శ్రమించండి. ఇలాంటి యాంగ్జైటీ ప్రేరేపిత పరిస్థితులకు స్థిరంగా, కుమిలిపోకుండా ఉండటం నేర్చుకోవడం ద్వారా కాలక్రమేణా ఆందోళనను అదుపులో ఉంచుకోవడం, ఎదుర్కోవడం సులభమవుతుంది.

నలుగురితో కలిసిపోవడం

మీకు ఖాళీ సమయం దొరికినప్పుడు సరదాగా గడిపే ప్రయత్నం చేయండి. అవసరమైతే నలుగురితో కలిసి గడపడానికి ప్రయత్నం చేయండి. దీంతోపాటు యోగా, డ్యాన్స్ వంటివి మీలోని ఆందోళనను తగ్గిస్తాయి. ఒంటరిగా లేదా స్నేహితులతో కలిసి వాకింగ్ చేయడం ఆందోళనకు విరుగుడుగా పని చేస్తుంది. వివిధ ఫిజికల్ యాక్టివిటీస్‌లో పాల్గొనడం వల్ల ఒత్తిళ్ల నుంచి మీ దృష్టిని మళ్లించవచ్చు. అల్లకల్లోలమైన భావోద్వేగాలను ఇది తగ్గిస్తుంది. తక్కువ శారీరక శ్రమతో పోలిస్తే టీనేజర్లలో అధిక స్థాయి శారీరక శ్రమ చేసే వారిలో యాంగ్జైటీ లక్షణాలు కలిగించే అవకాశం తక్కువగా ఉంటుందని పరిశోధనలు సూచిస్తున్నాయి.

చర్చించండి

మీ సమస్యలు లేదా ఆందోళనల గురించి అర్థం చేసుకుని, పరిష్కారం చూపగల నిపుణులు, స్నేహితులు, ఇతర వ్యక్తులతో మాట్లాడండి. తల్లిదండ్రులు మిమ్మల్ని ఇబ్బందికర పరిస్థితుల నుంచి తప్పించడంలో అందరికంటే బెటర్‌గా సహాయపడతారనేది కూడా గుర్తుంచుకోండి. అలాగే మీకు ఇష్టమైన వ్యక్తులతో మాట్లాడడం వల్ల ప్రతికూల భావోద్వేగాలను తగ్గించుకోవచ్చు. ఇది ఆందోళనను మేనేజ్ చేయడంలో సహాయపడుతుంది.

మీ గురించి మీరు తెలుసుకోండి

మీ బలాలు బలహీనతలు తెలుసుకోవడం ద్వారా మిమ్మల్ని మీరు సరిదిద్దుకోవచ్చు. దీనికోసం సెల్ఫ్ రిఫ్లెక్షన్స్‌లో పాల్గొనండి. బలహీనతలను అధిగమించడానికి, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడానికి ఇది దోహదం చేస్తుంది. ప్రతి కూల అంశాలను స్పష్టంగా గుర్తించడం, నివారించడం అనేది స్వీయ-అభివృద్ధి కోసం అవసరమైన గోల్స్ సెట్ చేసుకోవడంలో అద్భుతంగా పని చేస్తుంది.

ఆసక్తికలిగించే వాటిలో...

ఎప్పుడూ ఆందోళన కలిగించే విషయాలే ఆలోచించడం వల్ల ఇబ్బంది పడతారు. ముఖ్యంగా రాబోయే పరీ క్షలు, ప్రెజెంటేషన్‌లు లేదా ముఖ్యమైన సమావేశాలు వంటివి మీలో కాస్త ఆందోళన కలిగించేవిగా ఉండవచ్చు. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి అంతకు ముందు మీకు ఆనందాన్ని ఇచ్చే, ఆసక్తికలిగించే కార్యక్రమాల్లో కూడా పాల్గొనండి. ఫ్రెండ్స్‌తో కలవడం, మీకు నచ్చే వీడియోలు, కామెడీ సిరీస్ చూడటం, ఇష్టమైన సంగీతం వినడం వంటివి చేయండి.

సమతుల్య జీవనశైలి

క్రమం తప్పకుండా ఫిజికల్ యాక్టివిటీ, తగినంత నిద్ర కలిగి ఉండటం, అలాగే విటమిన్లు, మినరల్స్‌తో కూడిన ఆహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవడం టీనేజర్లలోని ఆందోళనలను తగ్గిస్తాయి. మత్తుపదార్థాలు, పానీయాలకు దూరంగా ఉండండి. ఎందుకంటే ఇవి ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయి.



సహాయం తీసుకోండి

ఆందోళన చెందుతున్నప్పుడు మీరు ఆ పరిస్థితి నుంచి బయట పడేందుకు ఇతరుల హెల్ప్ అడగడంలో తప్పులేదు. పరిస్థితులు విపరీతంగా మారుతున్నాయని మీరు భావిస్తే, మీ స్నేహితులను, నిపుణులను, కోలిగ్స్‌ను హెల్ప్ కోసం సంప్రదించవచ్చు. మన సమాజంలో మానసిక ఆరోగ్యంపై సరైన అవగాహన లేదు. దాంతో ఈ విషయంలో సహాయం అడగటం కూడాయిక కొన్ని సార్లు అవమానంగా భావిస్తున్నారు. ఈ ఆలోచన తప్పు. టీనేజర్స్ ఆందోళనను ఎదుర్కోవడంలో ఇతరుల సపోర్టును తప్పక కోరవచ్చు. మెరుగైన భవిష్యత్తుకోసం ఆందోళనను ముందుగానే గుర్తించడం, పరిష్కరించుకోవడం చాలా ముఖ్యం. లేకపోతే ఇది మానసిక సమస్యలకు దారితీసే అవకాశం ఉంది.

ఈ రోజుల్లో డార్క్ సర్కిల్స్ (కండ్ల కింద నల్లటి వలయాలు) తో బాధపడే వారు చాలా మందే ఉన్నారు. అసలు ఈ కండ్ల చుట్టూ ఏర్పడే నల్లటి వలయాలకు కారణాలనేకం. ఒక్కొక్కరికి ఒక్కో పరిస్థితి వల్ల ఇవి ఏర్పడుతుంటాయి. అందులో మొదటి కారణం అలసట. కండ్లు ఎక్కువగా శ్రమిస్తే అలసట ఏర్పడుతుంది. ఫలితంగా ఈ వలయాలు ఏర్పడతాయి. ఎక్కువ సేపు ఫోన్ చూడటం, కంప్యూటర్ ఎక్కువగా వాడటం, రాత్రిళ్లు మెలకువగా ఉండటం, సరిగా నిద్రపోకపోవడం, అతిగా ఆలోచించి స్ట్రెస్ అవ్వడం వంటి కారణాలన్నీ అలసటకు కారణమవడంతో పాటు, డార్క్ సర్కిల్స్ ఏర్పడతాయి. ఇవి పెద్ద సమస్యేమి కానప్పటికీ అందాన్ని పాడుచేస్తాయి. ఇవి ఏర్పడేందుకు కారణాలు, వాటి నివారణకు ఏమేం చేయాలో తెలుసుకుందాం.

డార్క్ సర్కిల్స్ తగ్గాలటే...

- రక్తనాళాలను ప్రభావితం చేసే రక్తహీనత, థైరాయిడ్ సమస్యల కారణంగా ఈ డార్క్ సర్కిల్స్ వస్తాయి.
- డీహైడ్రేషన్ వల్ల కూడా ఈ సమస్య ఏర్పడుతుంది. ఈ డార్క్ సర్కిల్స్ కారణంగా చర్మం నల్లగా మారుతుంది.
- సూర్యరశ్మి కారణంగా దీని వల్ల చర్మం గోధుమ, నల్లగా మారుతుంది. ముదురు రంగు చర్మం ఉన్నవారికి హైపర్ పిగ్మంటేషన్, చర్మం మెలనిన్‌ని ఉత్పత్తి చేస్తుంది.
- కళ్ళ చుట్టూ నల్లని వలయాలు ఏర్పడటానికి మెలనిన్ ముఖ్య పాత్ర పోషిస్తుంది. సూర్యరశ్మి, హైపర్ పిగ్మంటేషన్, కొన్ని మెడిసిన్ కూడా డార్క్ సర్కిల్స్ కారణం కావొచ్చు.
- గ్లకోమా ట్రీట్‌మెంట్‌కి కొన్ని కంటి హైపోటెన్సివ్ మెడిసిన్, లాటానోప్రోస్ట్, బైమాటోప్రోస్ట్ వంటివి కూడా కళ్ళ చుట్టూ నల్లని రంగు పెరగడానికి కారణమవుతుంది.
- కెఫిన్, ఆల్కహాల్ వంటివి కూడా డార్క్ సర్కిల్స్‌కు కారణాలే.
- పడుకునే ముందు టీవీ, ఫోన్ వంటి స్క్రీన్స్ చూడడం వల్ల సమస్య పెరుగుతుంది.

నివారణకు...

- అన్నింటిలో మొదటిది, నల్లని వలయాలని తగ్గించేం దుకు బాగా నిద్ర పోవాలి. దీని వల్ల బాడీ, మనసుకి మంచిది.
- ఎండలో బయటికి వెళ్ళేటప్పుడు సన్‌స్క్రీన్ రాస్తుండాలి. ఇది హానికరమైన యూవి కిరణాల నుండి కళ్ళ చుట్టూ ఉన్న సున్నితమైన చర్మాన్ని రక్షిస్తుంది. తద్వారా సన్ డ్యామేజ్, అకాల వృద్ధాప్యాన్ని నివారిస్తుంది. ఎండలో బయటకు వెళ్లేపుడు సన్ గ్లాసెస్ ఉపయోగిస్తే, అదనపు రక్షణను అందిస్తాయి.



- కీర దోసకాయ ముక్కల్ని కళ్ళపై పెట్టి 10 నిమిషాలు పెట్టాలి. ఈ దోసకాయ ముక్కల కారణంగా కళ్లకు ఒత్తిడి తగ్గి, రక్త నాళాలను చల్లగా చేసి రిఫ్రెష్‌గా ఉంచుతుంది.

ఈ సమస్యని ఇంటి చిట్కాలతో పూర్తిగా తగ్గించలేం. లేజర్ థెరపీ కారణంగా ఈ సమస్య తగ్గుతుంది. ఫిల్లర్స్, హైలురోనిక్ యాసిడ్, ఇంజెక్షన్స్‌తో ముడతలు తగ్గుతాయి. బ్లెఫరోప్లాస్టీ, సర్జరీలు, కనురెప్పల నుండి అదనపు చర్మం, కొవ్వు, కండరాలను తగ్గిస్తుంది. ఇది చర్మాన్ని యవ్వనంగా తాజాదనాన్ని అందిస్తుంది.

బంద్, సమ్మెలో 20 కోట్ల మంది

న్యూఢిల్లీ : జార్ఖండ్‌లోని రాంచీ నుంచి మహారాష్ట్రలోని ధూలే వరకు, ఒడిశాలోని రూర్కెలా నుంచి తమిళనాడులోని తూత్తుకుడి వరకు, సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం), కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త వేదిక చేపట్టిన గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెలు రోజువారీ జీవనంపై స్పష్టమైన ప్రభావాన్ని చూపాయి. ప్రజలు, రైతులు, కార్మికులు దుకాణాలు, మండీలు, ఫ్యాక్టరీలను మూసివేశారు. రోడ్లు, రైల్వే ట్రాక్‌లు, హైవేలను దిగ్బంధించారు. స్వామినాథన్ కమిషన్ ఫార్ములా ప్రకారం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కోసం, అన్ని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల నుంచి ఒకేసారి రుణమాఫీ, విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయటం, లఖింపూర్ ఖేరీ ఊచకోతలో తన కుమారుడు ఆశిష్ మిశ్రాను కేంద్ర మంత్రివర్గం నుంచి రక్షించిన అజయ్ మిశ్రాను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చింది. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనీ, ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొనేలా రూ.26 వేలను కార్మికులకు కనీస వేతనంగా నిర్ణయించాలని కేంద్ర కార్మిక సంఘాలు (సీటీయూ) ఇందులో పాల్గొన్నాయి. ఈ మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో సహా కేరళ, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, యూపీ, అసోం, హర్యానా, పంజాబ్, గుజరాత్‌లలో పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయి. ఎర్ర జెండాలతో కార్మికులు 'ఇంక్విలాబ్ జిందాబాద్', 'ప్రయివేటీకరణ వద్దు', రైతులందరికీ ఎంఎస్‌పీ ఇవ్వండి' అంటూ నినాదాలు చేశారు. ఫిబ్రవరి 16న పరీక్షల షెడ్యూల్ కారణంగా, పశ్చిమ బెంగాల్‌కు చెందిన రైతులు, కార్మికులు ఫిబ్రవరి 13న చట్ట ఉల్లంఘన కార్యక్రమాన్ని, గ్రామీణ బంద్‌ను పాటించారు. జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో పాల్గొన్న ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్ మాట్లాడుతూ.. 20 కోట్ల మంది ప్రజలు సామూహిక కార్యాచరణలో పాల్గొంటారని నాయకులు ఆశిస్తున్నారనీ, భారత స్వతంత్రానంతర చరిత్రలో ఇదే మొదటిసారి అని చెప్పారు.

ఇకపై వడ్డీ లేని డ్వాక్రా రుణాలు

(మొదటిపేజి తరువాయి)

కోరిన డిమాండ్‌లలో ప్రధానమైన అంశం అంగన్వాడీ, తదితర స్కీమ్ వర్కర్లకు ప్రతినెలా 1వతేదీన జీతాలు చెల్లించే విధంగా చర్యలు చేపడతామని భట్టి హామీ ఇచ్చారు. అలాగే, బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లిస్తామని తెలిపారు. గత పదేండ్లుగా రాష్ట్రంలో డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు అందటం లేదని, ఇందిరమ్మ రాజ్యం ఏర్పడ్డాక గతంలో హామీ ఇచ్చిన విధంగా మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని,కార్యచరణను రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళా సాధికారికతకై మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

గిరిజనంలో వెలుగులు నింపుతాం

- విద్యా, వైద్యం, ఉపాధికి ప్రణాళికలు
- భద్రాద్రి ఐటీడీఏ పాలకవర్గ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- కరకట్ట మరమ్మతులకు ప్రణాళికలు : తుమ్మల
- గిరిజన గ్రామాల్లో రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలి : కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లంకి దక్కని ప్రోటోకాల్



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

గిరిజన కుటుంబాలకు మేలు జరిగే విధంగా విద్యా, వైద్యం, ఉపాధి ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆదివారం భద్రాచలం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఐటీడీఏ పాలకవర్గ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టితోపాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రెసిడెన్షియల్ ఆశ్రమ ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. పదిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఉన్నత చదువులకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. గిరిజన గ్రామాల్లో వైద్య సదుపాయాలు మెరుగుపరిచేందుకు 100 పడకల ఆస్పత్రి నుంచి పీహెచ్‌సీ వరకు అంబులెన్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. పీహెచ్‌సీల్లో సరిపడా సిబ్బంది లేకపోతే స్థానిక యువతను కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవాలని సూచించారు. పాలకమండలిలో చేసిన ప్రతి నిర్ణయాన్ని తూచా తప్పకుండా అమలు చేసి తీరుతామని హామీ ఇచ్చారు.

మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. భద్రాచలం ఏజెన్సీని గోదారి వరదల నుంచి కాపాడేలా కరకట్ట మరమ్మతులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. భద్రాచలం రక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని ఐటీడీఏ నుంచి వచ్చే ప్రతి రూపాయి గిరిజన అభివృద్ధికి ఖర్చు చేయాలని ఆయన కోరారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన గిరిజన యువతకి ఉపాధి అవకాశాలు చూపించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గిరిజన గ్రామాల్లో రోడ్డు విస్తరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. మూడు నెలలకు ఒకసారి జరగాల్సిన ఐటీడీఏ పాలకమండలి సమావేశాలు ఏండ్ల తరబడి జరగటం లేదని, కొత్త ప్రభుత్వంలోనైనా కచ్చితంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన గ్రామాల్లో అనేక సమస్యలు తిష్ట వేశాయని, వాటి పరిష్కారానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

భద్రాచలం ఎమ్మెల్యేకు దక్కని ప్రోటోకాల్

ఆదివారం భద్రాచలంలో జరిగిన ఐటీడీఏ పాలకమండలి సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకటరావుకి ప్రోటోకాల్ దక్కలేదు. ఈ సమావేశానికి స్థానిక శాసనసభ్యుడే అధ్యక్షత వహించాల్సి ఉండగా అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. కనీసం వేదిక మీదకే ఆహ్వానించకపోవడం పట్ల బీఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీ అనే కారణంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు అధ్యక్షత వహించే అవకాశాన్ని ప్రభుత్వ పెద్దలు కల్పించలేదని ఆరోపించారు. సమావేశంలో ఎంపీ కవిత, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, కోరం కనకయ్య, తెల్లం వెంకటరావు, ఎమ్మెల్సీ తాతా మధు, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక అలా, ఓఎస్‌డీ కృష్ణ భాస్కర్, భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ తదితరులు పాల్గొన్నారు.

జార్ఖండ్‌లోనూ కులగణన

(మొదటిపేజి తరువాయి)

ఓ అధికారి తెలిపారు. 'జనాభా ఎక్కువగా ఉంటే వాటా అధికంగా వస్తుంది. బీహార్ సిద్ధంగా ఉంది' అంటూ సొరేన్ అంతకుముందు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు. బీహార్ తరహాలోనే జార్ఖండ్‌లో కూడా కులగణన నిర్వహిస్తారు. బీహార్‌లో గత సంవత్సరం జనవరి 7వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ సమాచార సేకరణ జరిగింది.

సుప్రీంకోర్టు ఆదేశాలు పాటిస్తాం

(మొదటిపేజి తరువాయి)

స్పందించడం ఇదే మొదటిసారి. మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ పథకాన్ని ఉపయోగించుకొని వివిధ రాజకీయ పార్టీలకు విరాళాలు అందించిన దాతల పేర్లు బయటపెట్టాలని ఎస్‌బీఐని న్యాయస్థానం ఆదేశించింది. పథకాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషించిన ఆర్థిక మంత్రిత్వ శాఖ కానీ, ప్రధాని కార్యాలయం కానీ కోర్టు తీర్పుపై ఇప్పటి వరకూ స్పందించలేదు.

'పారదర్శకంగా వ్యవహరిస్తామని సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశాము. ఇప్పుడు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశానుసారం చర్యలు తీసుకుంటాం' అని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ చెప్పారు. కాగా కోర్టు తీర్పును పరిశీలిస్తున్నామని, దానిని సవాలు చేయాలా వద్దా అనే విషయంపై ఓ నిర్ణయం తీసుకుంటామని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ తెలిపారు. అయితే కేంద్రప్రభుత్వం దీన్ని సవాలు చేయాలా..లేదా అని ఆలోచిస్తున్నది. మరోవైపు ఎస్బీఐ, ఆర్థికమంత్రిత్వశాఖ ఇప్పటిదాకా నోరువిప్పలేదు.

21న నల్లజెండాలతో నిరసన

నవతెలంగాణ న్యూఢిల్లీ బ్యూరో

2021 డిసెంబర్ 9న ఎస్కేఎంతో ఒప్పందాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో పాటుగా ఎంఎస్పీ సి2+50 శాతం హామీతో కూడిన సేకరణ, సమగ్ర రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 21న బీజేపీ, ఎన్డీఏ పార్లమెంట్ సభ్యులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నల్లజెండాలు ప్రదర్శించాలని దేశ వ్యాప్తంగా రైతులకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) పిలుపునిచ్చింది. "కరెంటు ప్రయివేటీకరణ ఆపాలి. లఖింపూర్ ఖేరీలో రైతుల మారణకాండకు ప్రధాన సూత్రధారి కేంద్ర హోం సహాయ మంత్రి అజయ్ మిశ్రా టెనినిని తొలగించి, విచారించాలి. పంజాబ్ సరిహద్దులో రైతుల అణచివేతను అరికట్టాలి" అని డిమాండ్ చేసింది. రైతు వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక, అణచివేత, నియంతత్వ వైఖరిని బహిర్గతం చేయాలని విజ్ఞప్తి చేసింది. పంజాబ్‌లో మూడు రోజుల పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, బీజేపీ జిల్లా అధ్యక్షుల ఇండ్ల ముందు రాత్రి పగలు భారీ నిరసనలు చేపట్టాలని ఎస్కేఎం నిర్ణయించింది. 20 ఉదయం 10 గంటలకు నిరసన ప్రారంభమై ఫిబ్రవరి 22 సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందని తెలిపింది. ఎలక్టోరల్ బాండ్లతో అవినీతిని చట్టబద్ధం చేసి వేల కోట్ల రూపాయలను పార్టీ ఫండ్‌గా పోగు చేయడాన్ని మోడీ ప్రభుత్వం తీవ్రంగా ఎస్కేఎం ఖండించింది. దీనిని కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఎస్కేఎం స్వాగతించింది.

ఔటర్ సమీపంలో పారిశ్రామిక సిటీ

(మొదటిపేజి తరువాయి)

వివరించారు. ఈ ప్రణాళికలపై తమకు పూర్తి స్పష్టత ఉన్నదన్నారు. మెట్రోరైల్‌ను ప్రజలకు మరింత ఉపయోగపడేలా విస్తరణ చేపడతామని చెప్పారు. ఫార్మా సిటీలు కాకుండా, ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ఎలాంటి అపోహలు వద్దనీ, తమకు తామే మేధావులమని భావించబోమనీ, అనుభవజ్ఞులు, నిపుణుల సలహాలతో ముందుకెళతామని అన్నారు. దానికోసం ఆలోచించి భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకుంటామన్నారు. చట్టాలను ఉల్లంఘిస్తే ఎవర్నీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపకశాఖ సేవల్ని ఆయన కొనియాడారు. ప్రమాదం జరిగినప్పుడు అందరికంటే ముందుండేది ఫైర్ డిపార్ట్ మెంటే అనీ, ప్రజల రక్షణ కోసం ఫైర్ సిబ్బంది ప్రాణాలకు తెగించి పోరాడుతారని ప్రసంశించారు.

కేసీఆర్ ఇలాకపై నజర్

(మొదటిపేజి తరువాయి)

ప్రధాన రాజకీయ పార్టీలు పరిభ్రమిస్తున్నాయి. మెదక్ మెర్లమెంట్ నియోజకవర్గం పరిధిలో సంగారెడ్డి, పటాన్‌చెరు, నర్సాపూర్, మెదక్, గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. రెండు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయా రాజకీయ పార్టీలు మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంపై కేంద్రీకరించాయి. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి 3,16,427 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థిపై గెలిచారు. గతంలోనూ కేసీఆర్, విజయశాంతి, ఆలె నరేందర్ సైతం గులాబీ పార్టీ నుంచి మెదక్ ఎంపీగా గెలిచారు. మెదక్ ప్రాంతం గులాబీ పార్టీకి మొదటి నుంచి కంచుకోటగా ఉంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిపాలై అధికారం కోల్పోయింది. అయినా మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు గాను ఆరు చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా గెలిచారు.

మెదక్‌పై కేంద్రీకరించిన కాంగ్రెస్

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు గాను ఆరు చోట్ల టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలవగా, కాంగ్రెస్ కేవలం మెదక్ అసెంబ్లీ స్థానం దక్కించుకుంది. ఆ చేదు ఫలితాలను సమీక్షించుకున్న కాంగ్రెస్ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తన సత్తా చాటాలని చూస్తుంది. మామా అల్లుళ్ల ఎత్తుల్ని చిత్తు చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి పై ఎత్తులు వేస్తున్నారు. మెదక్ ఎంపీ నియోకజవర్గంలో బలమైన అభ్యర్థిని పోటీ చేయించాలని చూస్తున్నారు. ఇటీవల ఎంపీ టికెట్ల కోసం దరఖాస్తుల్ని స్వీకరించినప్పటికీ పార్టీ మాత్రం బీఆర్ఎస్‌ను ఓడించే శక్తి సామర్థ్యాలున్న నాయకుడ్ని బరిలో దించాలనుకుంటుంది. అందులో భాగంగానే మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును రంగంలోకి దించారు. హనుమంతరావు సిద్దిపేటలో మకాం వేసి భారీ సమావేశం నిర్వహించి కాంగ్రెస్ శ్రేణులకు బూస్టింగ్ ఇచ్చారు. కొడుకు మైనంపల్లి రోహిత్‌రావు మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని మెదక్ ఎమ్మెల్యేగా ఉన్నారు. హనుమంతరావు సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్‌లో పట్టు సాధించేలా ఆయన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన పాత వాళ్లందర్ని తిరిగి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. పటాన్‌చెరులో కాంగ్రెస్ ఓడిపోయినందున అక్కడ బలపడేందుకు ముదిరాజ్ సామాజిక తరగతిలో పట్టున్న నీలం మధును ఇటీవల కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తే 40 వేలకు పైగా ఓట్లు వచ్చాయి. నర్సాపూర్, పటాన్‌చెరు ఎమ్మెల్యే అక్రమ ఆస్తులపై దృష్టి పెట్టి వాళ్లు సైతం బేరసారాలకు వచ్చేలా చేస్తున్నారు. సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఓడిపోయినా క్రియాశీల రాజకీయాల్లో యాక్టీవ్‌గా ఉంటున్నారు. ఆయన సతీమణీ ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేశారు. మైనంపల్లి హనుమంతరావును పోటీ చేయించడం ద్వారా కేసీఆర్, హరీశ్‌రావు ఎత్తుల్ని ఎదుర్కొగలడనే చర్చ నడుస్తుంది.

పట్టు సడలకుండా బీఆర్ఎస్ జాగ్రత్తలు

మెదక్ ఎంపీ సీటును వరుసగా గెలుస్తూ వస్తున్న బీఆర్ఎస్ తన పట్టు సడలకుండా జాగ్రత్త పడుతుంది. ఆరుగురు ఎమ్మెల్యేల్లో కేసీఆర్, హరీశ్‌రావుతో పాటు సంగారెడ్డి, పటాన్‌చెరు, నర్సాపూర్, దుబ్బాక ఎమ్మెల్యేలు యాక్టీవ్‌గా కదులుతున్నారు. నియోజకవర్గంలో పర్యటిస్తూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీల వైఫల్యాలను ఎత్తిచూపుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు నియోకజవర్గాల్లో కలిపి బీఆర్ఎస్‌కు 2.16 లక్షల ఓట్లు ఆధిక్యం వచ్చింది. అదే బలాన్ని తిరిగి ప్రదర్శించడం ద్వారా మెదక్ ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకోవాలని గులాబీ నేతలు బావిస్తున్నారు. కేసీఆర్ పుట్టిన రోజును మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పండుగ మాదిరి నిర్వహించి క్యాడర్‌లో జోష్ పెంచే ప్రయత్నం చేశారు. కార్యకర్తలు, నాయకులతో కేసీఆర్ ప్రత్యేకంగా మాట్లాడుతూ ధైర్యం నింపారు. ఎంపీ అభ్యర్థులుగా ఉద్యమకారులు ఆర్.సత్యనారాయణ, బీరయ్య యాదవ్ దరఖాస్తు చేశారు. వంటేరు ప్రతాపరెడ్డి పేరు కూడా పరిశీలనలో ఉంది. కాంగ్రెస్‌ను ఎదుర్కొని గెలిచేందుకు ఆర్థిక పరిపుష్టి ఉన్న ఎమ్మెల్సీ వెంకటరామిరెడ్డి పేరు బలంగా వినిపిస్తుంది. వీళ్ల కంటే నేరుగా గులాబీ బాస్ కేసీఆర్ మెదక్ బరిలో దిగే అవకాశాల్లేకపోలేదనే చర్చా ఉంది. దేశ రాజకీయాల్లో యాక్టీవ్ అయ్యేందుకు వీలుగా మెదక్ ఎంపీగా పోటీ చేస్తారంటున్నారు.

మనోళ్లు బంగారం

• మహిళల జట్టుకు పసిడి పతకం • ఆసియా టీమ్ చాంపియన్‌షిప్స్



షా ఆలమ్ (మలేషియా) : భారత బ్యాడ్మింటన్‌లో సరికొత్త చరిత్ర. మన అమ్మాయిలు సరికొత్త చరిత్ర సృష్టించారు. ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్స్‌లో పసిడి పతకం కొల్లగొట్టారు. అగ్రజట్లు చైనా, జపాన్, థాయ్‌లాండ్, మలేషియా పోటీపడే ఈవెంట్‌లో భారత అమ్మాయిలకు ఇప్పటివరకు ఒక్క మెడల్ దక్కలేదు. కానీ తాజా ఈవెంట్‌లో యువ షట్లర్లు చరిత్ర తిరగరాశారు. ఆదివారం జరిగిన ఫైనల్లో థాయ్‌లాండ్‌పై 3-2తో ఉద్విగ్న విజయం సాధించారు. ఆసియా టీమ్ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు చారిత్రక పసిడి పతకం అందించారు. తొలి సింగిల్స్‌లో పి.వి సింధు 21-12, 21-12తో సుపనిదపై వరుస గేముల్లో గెలుపొంది శుభారంభం చేయగా.. తొలి డబుల్స్‌లో ట్రెసా జాలి, గాయత్రి పుల్లెల సైతం విజయం సాధించారు. 21-16, 18-21, 21-16తో మూడు గేముల మ్యాచ్‌లో పైచేయి సాధించారు. దీంతో భారత్ 2-0తో పసిడికి అడుగు దూరంలో నిలిచింది. కానీ రెండో సింగిల్స్‌లో అష్మిత చాలిహ 11-21, 14-21తో, రెండో డబుల్స్‌లో ప్రియ, శృతి మిశ్రా 11-21, 9-21తో పరాజయం పాలయ్యారు. నిర్ణయాత్మక ఐదో గేమ్ ముంగిట భారత్, థాయ్‌లాండ్ 2-2తో సమవుజ్జీలుగా నిలిచారు.

అన్మోల్ అదుర్స్ : వరల్డ్ నం.472 అన్మోల్ కార్బ్ మళ్లీ అద్భుతం చేసింది. వరల్డ్ నం.45 చోకివాంగ్‌పై సంచలన విజయం నమోదు చేసింది. ఎటువంటి అంచనాలు లేకుండా ఆసియా చాంపియన్‌షిప్స్‌కు వచ్చిన అన్మోల్.. వరుస విజయాలతో అందరి దృష్టిని తనవైపునకు తిప్పుకుంది. 21-14, 21-9తో థాయ్‌లాండ్ షట్లర్‌ను చిత్తు చేసిన అన్మోల్ వరుస గేముల్లోనే నిర్ణయాత్మక మ్యాచ్‌ను భారత్ వశం చేసింది. అన్మోల్ విజయంతో 3-2తో భారత్ పసిడి పతకం సొంతం చేసుకుంది. భారత్ కంటే మెరుగైన ర్యాంక్ షట్లర్లతో బరిలోకి దిగిన థాయ్‌లాండ్ సిల్వర్ మెడల్‌తో సరిపెట్టుకుంది.

నితీశ్, ప్రజ్ఞయ్ సెంచరీలు

రంజీ ట్రోఫీ ప్లేట్ లీగ్ ఫైనల్

హైదరాబాద్ : నితీశ్ రెడ్డి (122, 194 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్సులు), వికెట్ కీపర్ ప్రజ్ఞయ్ రెడ్డి (102 నాటౌట్, 141 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలతో మెరువగా.. కెప్టెన్ తిలక్ వర్మ (44, 73 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. దీంతో మేఘాలయతో రంజీ ట్రోఫీ ప్లేట్ లీగ్ ఫైనల్లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 87.5 ఓవర్లలో 350 పరుగులు చేసింది. మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 304 పరుగులే చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 0/1తో ఎదురీదుతోంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగుల వెనుకంజలో నిలిచింది.

ఇంగ్లాండ్‌ను మడతపెట్టి..!

రాజ్'కోట' మన సొంతమైంది. కీలక మూడో టెస్టులో ఆతిథ్య భారత్ అఖండ విజయం సాధించింది. పరుగుల పరంగా టెస్టుల్లో అత్యుత్తమ విజయాన్ని నమోదు చేసింది. 557 పరుగుల రికార్డు ఛేదనలో ఇంగ్లాండ్ 122 పరుగులకే కుప్పకూలింది. లోకల్ బాయ్ రవీంద్ర జడేజా (5/41) ఐదు వికెట్ల మాయజాలంతో ఇంగ్లాండ్‌ను తిప్పేశాడు. 434 పరుగుల తేడాతో భారత్ మూడో టెస్టులో అఖండ విజయం అందుకుంది. ఈ విజయంతో ఐదు మ్యాచుల టెస్టు సిరీస్‌లో 2-1తో ముందంజలోకి దూసుకెళ్లింది.

యువ కెరటం యశస్వి జైస్వాల్ (214 నాటౌట్) అజేయ ద్వి శతకంతో చెలరేగాడు. విశాఖలో కెరీర్ తొలి డబుల్ సెంచరీ బాదిన జైస్వాల్.. రాజ్‌కోట్‌లోనూ భారీ ఇన్నింగ్స్ నమోదు చేశాడు. శుభ్‌మన్ గిల్ (91)కు తోడు అరంగ్రేట ఆటగాడు సర్ఫరాజ్ ఖాన్ (68 నాటౌట్) మెరవటంతో ఇంగ్లాండ్ ముందు భారత్ భారీ లక్ష్యాన్ని ఉంచింది. భారత్, ఇంగ్లాండ్ నాల్గో టెస్టు రాంచిలో శుక్రవారం నుంచి ఆరంభం కానుంది.



- 434 పరుగులతో భారత్ అఖండ విజయం
- ఛేదనలో ఇంగ్లాండ్ 122 ఆలౌట్
- యశస్వి జైస్వాల్ అజేయ ద్వి శతకం
- రవీంద్ర జడేజా ఐదు వికెట్ల మాయజాలం



నవతెలంగాణ-రాజ్‌కోట్

రాజ్‌కోట్‌లో ఆతిథ్య భారత్ ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసింది. తొలి రెండు టెస్టుల్లో భారత్‌కు గట్టి పోటీ ఇచ్చిన ఇంగ్లాండ్‌ను మూడో టెస్టులో చిత్తు చేసింది. రికార్డు 434 పరుగుల తేడాతో రాజ్‌కోట్ టెస్టులో టీమ్ ఇండియా విజయభేరి మోగించింది. 557 పరుగుల ఛేదనలో ఇంగ్లాండ్ 39.4 ఓవర్లలో 122 పరుగులకే కుప్పకూలింది. లోకల్ హీరో రవీంద్ర జడేజా (5/41) ఐదు వికెట్ల మాయజాలానికి కుల్దీప్ యాదవ్ (2/19), అశ్విన్ (1/19), బుమ్రా (1/18) జత కలిశారు. దీంతో మూడో టెస్టు సైతం నాలుగు రోజుల్లోనే ముగిసింది. ఇంగ్లాండ్ బ్యాటింగ్ లైనప్ భారత బౌలర్లకు దాసోహం అవగా.. టెయిలెండర్లు మార్క్‌వుడ్ (33, 15 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), టామ్ హర్ట్‌లీ (16, 36 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ఇంగ్లాండ్‌కు గౌరవప్రద మూడంకెల స్కోరు అందించారు. అంతకముందు, భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 430/4 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (214 నాటౌట్, 236 బంతుల్లో 14 ఫోర్లు, 12 సిక్సులు) అజేయ ద్వి శతకం బాదగా.. సర్ఫరాజ్ ఖాన్ (68 నాటౌట్, 72 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సులు) అజేయ అర్థ సెంచరీతో చెలరేగాడు. శుభ్‌మన్ గిల్ (91, 151 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీతో మెరువగా 98 ఓవర్లలో 430 పరుగుల వద్ద భారత్ ఇన్నింగ్స్‌ను డిక్లరేషన్ ప్రకటించింది. తొలి ఇన్నింగ్స్‌లో శతకం బాదిన రవీంద్ర జడేజా.. బంతితో ఏడు వికెట్లు పడగొట్టి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. రాజ్‌కోట్ టెస్టులో విజయంతో సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యం సాధించింది.

ఇంగ్లాండ్‌ను తిప్పేశారు

ఇంగ్లాండ్ లక్ష్యం రికార్డు 557 పరుగులు. ఎటువంటి బ్యాటింగ్ లైనప్ అయినా.. ఈ లక్ష్యాన్ని ఛేదించటం కష్టసాధ్యమే. కానీ ఇంగ్లాండ్ బజ్‌బాల్ దూకుడుతో కనీసం రేసులో నిలుస్తుందనే అంచనాలు ఉన్నాయి. కానీ భారత బౌలర్లు మ్యాచ్‌ను ఏకపక్షం చేశారు. టీ విరామానికి ముందు 8.2 ఓవర్లలోనే ఓపెనర్లు ఇద్దరినీ పెవిలియన్‌కు పంపించారు. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో బెన్ డకెట్ (4) రనౌట్‌గా నిష్క్రమించాడు. క్రాఫ్లీ సిగ్నల్ ఇవ్వకుండానే సగం దూరం వెళ్లిన డకెట్.. తిరిగి క్రీజులోకి వచ్చేలోగా సిరాజ్ సూపర్ ఫీల్డింగ్‌తో వికెట్లను జురెల్ పడగొట్టాడు. జాక్ క్రాఫ్లీ (11)ని ఎల్బీగా బుమ్రా సాగనంపాడు. దీంతో 18/2 పరుగులకే ఇంగ్లాండ్ ఓపెనర్లను కోల్పోయింది. ఇక చివరి సెషన్లో ఇంగ్లాండ్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ఒలీ పోప్ (3), జో రూట్ (7), జానీ బెయిర్‌స్టో (4), బెన్ ఫోక్స్ (16) సహా మార్క్‌వుడ్ (33)ను రవీంద్ర జడేజా మాయ చేశాడు. జడేజా మాయకు ఇంగ్లాండ్ ఓ దశలో 50/7తో దీన స్థితిలో నిలిచింది. కానీ టెయిలెండర్లు వేగంగా పరుగులు సాధించి ఆ జట్టును 100 పరుగుల మార్క్ దాటించగలిగారు. కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు తీసుకోగా.. కుటుంబ వైద్య అత్యవసర పరిస్థితితో రెండు రోజుల ఆటకు దూరంగా ఉన్న రవిచంద్రన్ అశ్విన్ నాల్గో రోజు బంతి అందుకున్నాడు. టామ్ హర్ట్‌లీ (16)ని అవుట్ చేసి కెరీర్ 501వ వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. ఐదో రోజుకు వెళ్తుందనుకున్న టెస్టు మ్యాచ్.. భారత బౌలర్ల దూకుడుతో నాలుగు రోజుల్లోనే ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో 71.1 ఓవర్లలో 319 పరుగులు చేసిన ఇంగ్లాండ్.. రెండో ఇన్నింగ్స్‌లో 39.4 ఓవర్లలో 122 పరుగులకే చేతులెత్తేసింది.

12 ద్వి శతక ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ కొట్టిన సిక్సర్లు 12. ఓ టెస్టు ఇన్నింగ్స్‌లో నవజ్యోత్ సింగ్ సిద్ధూ బాదిన 8 సిక్సర్లే ఓ భారత బ్యాటర్‌కు ఇప్పటివరకు అత్యధికం. రాజ్‌కోట్‌లో జైస్వాల్ ఆ రికార్డును బద్దలుకొట్టాడు.

434 మూడో టెస్టులో భారత్ గెలుపు అంతరం 434 పరుగులు. గతంలో న్యూజిలాండ్‌పై 372 పరుగులే విజయమే అత్యుత్తమం. పరుగుల పరంగా ఇప్పుడు రాజ్‌కోట్‌లో ఇంగ్లాండ్‌పై సాధించిన విజయం అగ్రస్థానంలో నిలిచింది.

'ద్వి శతక' జైస్వాల్

యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (214 నాటౌట్) ద్వి శతకంతో చెలరేగాడు. విశాఖ టెస్టులోనూ డబుల్ సెంచరీ బాదిన జైస్వాల్.. రాజ్‌కోట్‌లోనూ జోరు కొనసాగించాడు. వెన్నునొప్పితో మూడో రోజు ఆఖర్లో రిటైర్డ్ హర్ట్‌గా వైదొలిగిన యశస్వి.. నాల్గో రోజు ఉదయం సెషన్లోనే క్రీజులోకి వచ్చాడు. సర్ఫరాజ్ ఖాన్ (68 నాటౌట్) జతగా 184 పరుగులు జోడించాడు. 11 ఫోర్లు, 7 సిక్సర్లతో 150 పరుగుల మార్క్ చేరుకున్న జైస్వాల్.. ద్వి శతకాన్ని 14 ఫోర్లు, 10 సిక్సర్లతో 231 బంతుల్లోనే పూర్తి చేశాడు. మరోవైపు సర్ఫరాజ్ ఖాన్ అరంగ్రేట టెస్టులో వరుసగా రెండో అర్థ సెంచరీ సాధించాడు. ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 65 బంతుల్లో అర్థ సెంచరీ బాదాడు. టాప్ ఆర్డర్‌లో కీలక ఇన్నింగ్స్ నమోదు చేసిన శుభ్‌మన్ గిల్.. సెంచరీ ముంగిట వికెట్ చేజార్చుకున్నాడు. నైట్‌వాచ్‌మన్ కుల్దీప్ యాదవ్ (27) సైతం ఆకట్టుకున్నాడు. దీంతో 90 ఓవర్లలో 4 వికెట్లకు 430 పరుగులు చేసిన భారత్.. 556 పరుగుల ఆధిక్యంతో ఇన్నింగ్స్‌ను డిక్లరేషన్ ఇచ్చింది. ఇంగ్లాండ్ బౌలర్లలో టామ్ హర్ట్‌లీ, జో రూట్, రెహాన్ అహ్మద్ తలా ఓ వికెట్ పడగొట్టారు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ : 445/10

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ : 319/10

భారత్ రెండో ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ నాటౌట్ 214, రోహిత్ శర్మ (ఎల్బీ) రూట్ 19, శుభ్‌మన్ గిల్ (రనౌట్) 91, రజత్ పటీదార్ (సి) రెహాన్ (బి) హర్ట్‌లీ 0, కుల్దీప్ యాదవ్ (సి) రూట్ (బి) రెహాన్ 27, సర్ఫరాజ్ ఖాన్ నాటౌట్ 68, ఎక్స్‌ట్రాలు : 11, **మొత్తం : (98 ఓవర్లలో 4 వికెట్లకు) 430 డిక్లేర్డ్.**

వికెట్ల పతనం : 1-30, 2-191, 3-246, 4-258.

బౌలింగ్ : అండర్సన్ 13-1-78-0, జో రూట్ 27-3-111-1, టామ్ హర్ట్‌లీ 23-2-78-1, మార్క్‌వుడ్ 10-0-46-0, రెహాన్ అహ్మద్ 25-1-108-1.

ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ : జాక్ క్రాఫ్లీ (ఎల్బీ) బుమ్రా 11, బెన్ డకెట్ (రనౌట్) 4, ఒలీ పోప్ (సి) రోహిత్ (బి) జడేజా 3, జో రూట్ (ఎల్బీ) జడేజా 7, జానీ బెయిర్‌స్టో (ఎల్బీ) జడేజా 4, బెన్ స్టోక్స్ (ఎల్బీ) కుల్దీప్ 15, బెన్ ఫోక్స్ (సి) ధ్రువ్ (బి) జడేజా 16, రెహాన్ అహ్మద్ (సి) సిరాజ్ (బి) కుల్దీప్ 0, హర్ట్‌లీ (బి) అశ్విన్ 16, మార్క్‌వుడ్ (సి) జైస్వాల్ (బి) జడేజా 33, అండర్సన్ నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 12, **మొత్తం : (39.4 ఓవర్లలో ఆలౌట్) 122.**

వికెట్ల పతనం : 1-15, 2-18, 3-20, 4-28, 5-50, 6-50, 7-50, 8-82, 9-91, 10-122.

బౌలింగ్ : జస్‌ప్రీత్ బుమ్రా 8-1-18-1, మహ్మద్ సిరాజ్ 5-2-16-0, రవీంద్ర జడేజా 12.4-4-41-5, కుల్దీప్ యాదవ్ 8-2-19-2, రవిచంద్రన్ అశ్విన్ 6-3-19-1.

రూ.100 కోట్లతో కొత్త స్టేడియం!

హెచ్‌సీఏ ఏజీఎంలో ఏకగ్రీవ తీర్మానం



హైదరాబాద్ : రూ.100 కోట్లతో కొత్త స్టేడియం నిర్మాణానికి హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) వార్షిక సర్వ సభ్య సమావేశం (ఏజీఎం) తీర్మానం ఆమోదించింది. ఉప్పల్ స్టేడియంలో ప్రపంచ శ్రేణి శిక్షణ కేంద్రం, హైదరాబాద్ పరిధిలో నాలుగు శాటిలైట్ అకాడమీలు సహా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో మినీ స్టేడియం నిర్మాణాలు చేపట్టనున్నారు. బీసీసీఐ నిధుల్లో కనీసం 30 నిధులను గ్రామీణ క్రికెట్ అభివృద్ధికి ఖర్చు చేయనున్నారు. అందుకోసం ఓ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. మహిళల క్రికెట్‌కు సైతం ఓ కమిటీని ఏర్పాటు చేసేందుకు ఏజీఎం ఆమోదించింది. హెచ్‌సీఏ తరఫున బీసీసీఐ సమావేశానికి అధ్యక్షుడు జగన్‌మోహన్, కార్యదర్శి దేవరాజ్ రొటేషన్ విధానంలో హాజరుకావాలని సభ్యులు తీర్మానించారు. గతంలో రసాభాసాగా సాగిన హెచ్‌సీఏ సమావేశాలకు భిన్నంగా 86వ ఏజీఎం స్నేహపూర్వక వాతావరణంలో ముగిసింది.

నవచిత్రం

పాన్ ఇండియా సినిమా రికార్డ్ బ్రేక్..



ప్రతి భారతీయుడు కచ్చితంగా చూడాల్సిన చిత్రంగా చదలవాడ శ్రీనివాసరావు దర్శకత్వంలో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలిమ్స్ బ్యానర్ పై చదలవాడ పద్మావతి నిర్మిస్తున్న చిత్రం 'రికార్డ్ బ్రేక్'. ఈ చిత్ర గ్లింప్స్, టీజర్, ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా జరిగింది.

ఈవెంట్‌కి ముఖ్య అతిథులుగా విచ్చేసిన దర్శకులు అజయ్ కుమార్ గ్లింప్స్‌ని, టీజర్‌ని నిర్మాత రామసత్యనారాయణ, ట్రైలర్‌ని తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ టి.ప్రసన్నకుమార్ లాంచ్ చేశారు.

దర్శకుడు చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ, 'ఈ సినిమా ఇంత చక్కగా రావడానికి నాలో సగభాగం అయిన నా దర్శకుడు అజయ్‌కే దక్కుతుంది. అలాగే ప్రసన్నకుమార్‌కి కూడా. ఈ సినిమాలో హీరో అంటూ ఎవరు ఉండరు ఈ సినిమాకి మెయిన్ హీరోలు ఆర్ట్ డైరెక్టర్, ఫైట్ మాస్టర్, మ్యూజిక్ డైరెక్టర్. సొసైటీకి ఉపయోగపడే కథతో సినిమా తీయాలని అనుకున్నాను. దాన్ని తెరపై చూపించేందుకు నాకున్న అనుభవాన్ని అంతా వాడాను. అలాగే ఈ సినిమా చూసి చలపతిరావు చాలా బాగా వచ్చిందని ప్రశంసించారు. ఆయన ఆఖరి ప్రశంసలు నాకు దక్కాయి. రీసెంట్‌గా కొంతమంది దర్శకులు ఈ సినిమా చూసి, రికార్డ్ బ్రేక్ కరెక్ట్ టైటిల్ అని చెప్పారు. ఈ సినిమా ఖచ్చితంగా అన్ని భాషల్లోనూ వండర్స్ క్రియేట్ చేస్తుంది. లాస్ట్ 45 నిమిషాలు ఈ సినిమా మంచి ఎమోషనల్‌గా ఉంటుంది. అందరికీ నచ్చే సినిమా అవుతుంది' అని తెలిపారు.

విజువల్ వండర్‌గా ఇంద్రాణి



యానీయా భరద్వాజ్, కబీర్ దుహాన్ సింగ్ ప్రధాన పాత్రలలో నటిస్తోన్న చిత్రం 'ఇంద్రాణి'. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషలలో ఈ మూవీ రూపొందుతోంది. ఈ మూవీ ద్వారా స్టెఫన్ పల్లం దర్శకుడిగా పరిచయమవుతుండగా వెరోనికా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై స్టాన్లీ సుమన్ బాబు నిర్మాణ సారథ్యంలో సుధీర్ వేల్పుల, కెకెరెడ్డి, జైసన్ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను పార్క్ హయాత్ హోటల్‌లో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి మణిశర్మ, నిర్మాత అనీల్ సుంకర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దర్శకుడు స్టాన్లీ పల్లం మాట్లాడుతూ, 'ఈ సినిమా క్లైమాక్స్‌లో ఏం జరగబోతుంది అనేది ఊహించడం చాలా కష్టం. అంత అద్భుతమైన కథ. ట్రైలర్ అందరికీ నచ్చింది. ఈ సినిమా ఇంత బాగా వచ్చిందంటే ఆ క్రెడిట్ అంతా మా బ్రదర్ స్టీఫెన్‌కే చెల్లుతుంది. సాయి కార్తిక్ సింగిల్ సిట్టింగ్స్‌లోనే మంచి సాంగ్స్ ఇచ్చాడు' అని తెలిపారు. 'అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఉన్న మంచి సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్. ఒక విజువల్ వండర్‌గా ఉంటుంది. టైమ్ మెషిన్, రోబో ఇలా ప్రతీది సినిమాలో కీలకంగా ఉంటుంది. ఈ సినిమా తప్పకుండా ఆడియన్స్‌ని ఎంటర్టైన్ చేస్తుంది. రాబోయో 50 సంవత్సరాల్లో ఇండియా ఎంత అడ్వాన్స్‌గా ఉండనుంది అనేది ఈ సినిమాలో చూపించాం. ఈ మూవీ యువతరానికి చాలా స్ఫూర్తి దాయకంగా ఉంటుంది. ఇది అందర్నీ అలరించే సినిమా అవుతుంది' అని స్టీఫెన్ పల్లం చెప్పారు.

యూనిక్ క్రైమ్ థ్రిల్లర్



శివ కందుకూరి హీరోగా రూపొందిన యూనిక్ క్రైమ్ థ్రిల్లర్ 'భూతద్దం భాస్కర్ నారాయణ'. స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించిన ఈ సినిమాకి పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. మార్చి 1న ఈ చిత్రం విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో ఈ చిత్రం నుంచి 'శివ ట్రాప్ ట్రాన్స్' పాటని ఎంఎం కీరవాణీ లాంచ్ చేశారు. హీరో సుహాస్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ సాంగ్ లాంచింగ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. దర్శకుడు విజయ్ కనకమేడల, హీరోయిన్ వర్ష బొల్లమ్మ ఈ వేడుకలో పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

హీరో శివ కందుకూరి మాట్లాడుతూ, 'శివ ట్రాప్ ట్రాన్స్' ఈ సినిమా ఆల్బంలో నా ఫేవరేట్. సినిమాలో చాలా కీలక సమయంలో ఈ పాట వస్తుంది. విజువల్‌తో ట్రాక్ విన్నప్పుడు అన్ బిలివబుల్ అనిపించింది. ఇలాంటి ట్రాక్ దొరకడం ఆనందంగా ఉంది. శ్రీచరణ్ అద్భుతమైన ట్యూన్ ఇచ్చారు. చైతన్య ప్రసాద్ లిరిక్స్, కాలభైరవ పాడిన తీరు పాటని నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్ళింది. మా ట్రైలర్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ పాట కూడా నచ్చుతుంది. ఈ రెండు నచ్చాయంటే మా సినిమా కూడా తప్పకుండా నచ్చుతుంది' అని అన్నారు. 'ఈ పాట కోసం శ్రీ చరణ్ ఇచ్చిన ట్యూన్, చైతన్య ప్రసాద్ అల్లిన పదాలు గూస్ బంప్స్ తెప్పించాయి. రావణాసురుడు శివుడుని ఎంత తీవ్రతతో పూజించారో ఇందులో మా విలన్ పాత్ర కూడా ఆ స్థాయిలో ఉంటుంది. ఖచ్చితంగా సినిమా మీ అందరికీ నచ్చుతుంది' అని దర్శకుడు పురుషోత్తం రాజ్ చెప్పారు. నిర్మాతలు స్నేహాల్, శశిధర్, కార్తీక్ మాట్లాడుతూ, 'ట్రైలర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో హ్యూజ్ బజ్‌ని క్రియేట్ చేసింది. తప్పకుండా థియేటర్స్‌లో చూడండి. అందరికీ అద్భుతంగా నచ్చుతుంది' అని అన్నారు.

కానిస్టేబుల్ పరీక్షకు సన్నీ లియోనా..?

రిక్రూట్‌మెంట్ పరీక్ష అడ్మిట్ కార్డులో సినీ నటి సన్నీ లియోన్ పేరు, ఫొటో కనిపించింది. అడ్మిట్ కార్డు ఫోటో సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. అడ్మిట్ కార్డులో శ్రీమతి సోనేశ్రీ మెమోరియల్ గర్ల్స్ కాలేజ్, తిర్వా, కనౌజ్ పరీక్షా కేంద్రంగా పేర్కొనబడింది. ఈ చిరునామా ముంబయిలో ఉంది. మహోబాకు చెందిన ఓ వ్యక్తి పేరిట ఉన్న మొబైల్ నెంబర్‌ను ఉపయోగించి దరఖాస్తు పంపినట్టు జాతీయ మీడియా పేర్కొంది. కనౌజ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



60 వేల కానిస్టేబుల్ పోస్టులకు 50 లక్షల మంది దరఖాస్తు

యూపీలో తాండవిస్తున్న నిరుద్యోగం సన్నీలియోన్‌కు అడ్మిట్ కార్డు

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లో నిరుద్యోగం తాండవిస్తోంది. 60,244 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు ఏకంగా 50,14,924 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 35 లక్షల మంది పురుషులు, 15 లక్షల మంది మహిళలు ఉన్నారు.రిజర్వేషన్ విధానం ప్రకారం మహిళా అభ్యర్థులకు 20 శాతం పోస్టులు ఉన్నాయి. 12,049 మంది మహిళలు ఉద్యోగాలు పొందనున్నారు. అంటే ఒక ఉద్యోగానికి 124 మంది పోటీ పడుతున్నారు. 49,195 మంది పురుషులు దరఖాస్తు చేసుకున్నారు. ఒక ఉద్యోగానికి 73 మంది పోటీ పడుతున్నారు. సంబంధిత అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... యూపీపీఆర్‌పీబీ ఆధ్వర్యాన యూపీ పోలీస్ కానిస్టేబుల్ - 2024 పరీక్షలను 75 జిల్లాల్లోని 2,385 కేంద్రాల్లో శని, ఆదివారాల్లో నాలుగు షిఫ్టుల్లో నిర్వహించారు. దరఖాస్తుదారుల్లో ఆరు లక్షల మందికిపైగా ఇతర రాష్ట్రాల వారు ఉన్నారు. బీహార్ 2,67,305, హర్యానా 74,769, జార్ఖండ్ 17,112, మధ్యప్రదేశ్ 98,400, ఢిల్లీ 42,259, రాజస్థాన్ 97,277, ఉత్తరాఖండ్ 14,627, పశ్చిమ బెంగాల్ 5,512, పంజాబ్ 3404, మహారాష్ట్ర 3,151 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో 22 జిల్లాలకు చెందిన 120 మందిని పరీక్ష రాసేటప్పుడు అక్రమాలకు పాల్పడినందుకు అరెస్టు చేశారు.

పాలస్తీనా విదేశాంగ మంత్రితో జైశంకర్ భేటీ

మ్యూనిచ్ : పాలస్తీనా విదేశాంగ మంత్రి రియాద్ అల్ మాలికితో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఆదివారం సమావేశమయ్యారు. ఈ విషయాన్ని జైశంకర్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2014/59462.